

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 91

గురువారం 22-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్

తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లు హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–11, 21–10తో లిన్ యు సియెన్ (చైనీస్ తైపీ)పై... కశ్యప్ 21–15, 21–16తో హెసియావో (జర్మనీ)పై గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ ద్వయం 21–14, 21–17తో భారత్‌కే చెందిన బొక్కా నవనీత్–ప్రియా కొంజెంగ్‌బమ్ జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

వరల్డ్ నంబర్‌వన్‌గా జో రూట్

ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఇంగ్లండ్ ఓడినప్పటికీ ... ఆ జట్టు బ్యాటర్ జో రూట్ మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లబుషేన్ (ఆస్ట్రేలియా) మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. యాషెస్ తొలి టెస్టులో రూట్ (118 నాటౌట్; 46 పరుగులు) రెండు ఇన్నింగ్స్‌లో రాణించగా... లబుషేన్ మాత్రం (0, 13) విఫలమయ్యాడు.



తెలుగు టాలన్స్ దూకుడు



జైపూర్: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన తెలుగు టాలన్స్ జట్టు లీగ్ దశను విజయంతో ముగించింది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టాలన్స్ జట్టు 36–28 గోల్స్ తేడాతో గర్విత్ గుజరాత్ జట్టును ఓడించింది. మొత్తం 10 మ్యాచ్‌లు ఆడిన టాలన్స్ 15 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. తెలుగు టాలన్స్‌తోపాటు మహారాష్ట్ర ఐరన్‌మెన్, రాజస్తాన్ పేట్రియాట్స్ జట్లు సెమీఫైనల్ చేరుకోగా... చివరి సెమీఫైనల్ బెర్త్ కోసం ఢిల్లీ పంజెర్స్, గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్లు పోటీపడుతున్నాయి.

నేటి నుంచి గ్లోబల్ చెస్ లీగ్

దుబాయ్: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే), టెక్ మహీంద్రా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దుబాయ్ వేదికగా నేటి నుంచి గ్లోబల్ చెస్ లీగ్ జరుగనుంది. మొత్తం ఆరు జట్లు (బాలన్ అలాస్కన్ నైట్స్, చింగారి గల్ఫ్ టైటాన్స్, గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్, ఆల్పైన్ వారియర్స్, త్రివేణి కాంటినెంటల్ కింగ్స్, అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్) బరిలో ఉన్నాయి.



భారత్‌దే ‘ఎమర్జింగ్ కప్’

- అండర్–23 ఆసియా టి20 క్రికెట్ టోర్నీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై విజయం
- శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్ మాయాజాలం

మోంగ్ కాక్ (హాంకాంగ్): ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించడంతో ఆసియా మహిళల అండర్–23 ఎమర్జింగ్ కప్ టి20 క్రికెట్ టోర్నీ ఫైనల్ జరిగింది. శ్వేతా సెహ్రావత్ నాయకత్వంలోని భారత ‘ఎ’ జట్టు చాంపియన్‌గా అవతరించింది. బుధవారం జరిగిన తుది పోరులో భారత్ 31 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ‘ఎ’ జట్టును ఓడించింది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో 15 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు కావడం గమనార్హం. భారత జట్టు లీగ్ దశలో ఒక మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత రెండు లీగ్ మ్యాచ్‌లు, సెమీఫైనల్ కూడా వర్షం కారణంగా సాధ్యపడలేదు. అయితే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన టైటిల్ పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు సాధించింది. దినేశ్ వృందా (29 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), కనిక అహూజా (23 బంతుల్లో 30 నాటౌట్; 4 ఫోర్లు), ఉమా చెత్రీ (20 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), శ్వేత సెహ్రావత్ (20 బంతుల్లో 13; 2 ఫోర్లు) రాణించారు. భారత జట్టుకు ఆడుతున్న హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష నాలుగు పరుగులు చేసింది. అనంతరం 128 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 19.2 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. భారత స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (4/13), మన్నత్ కశ్యప్ (3/20), కనిక అహూజా (2/23) బంగ్లాదేశ్‌ను దెబ్బ తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన కనిక అహూజాకు ‘ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్’... ఈ టోర్నీలో తొమ్మిది వికెట్లు పడగొట్టిన శ్రేయాంక పాటిల్ ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డులు గెల్చుకున్నారు.

రొనాల్డో రికార్డు...

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో జాతీయ జట్టుకు 200 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ఘనత



రెక్జావిక్ (ఐస్‌లాండ్): పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు దిగ్గజం, స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో మరో మైలురాయి అందుకున్నాడు. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో జాతీయ జట్టు తరఫున 200 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. యూరో–2024 చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా గ్రూప్ ‘జె’లో ఐస్‌లాండ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డో బరిలోకి దిగడంద్వారా 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. 38 ఏళ్ల రొనాల్డో ఆట 89వ నిమిషంలో చేసిన గోల్‌తో ఈ మ్యాచ్‌లో పోర్చుగల్ 1–0తో ఐస్‌లాండ్‌ను ఓడించింది. గ్రూప్ ‘జె’లో పోర్చుగల్‌కిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు కూడా రొనాల్డో (123 గోల్స్) పేరిటే ఉంది. మ్యాచ్‌కు ముందు రొనాల్డో ఘనతకు గుర్తింపుగా ‘గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్’ సంస్థ సర్టిఫికెట్‌ను అందజేసింది. 2003 నుంచి పోర్చుగల్ జాతీయ సీనియర్ జట్టుకు ఆడుతున్న రొనాల్డో వరుసగా ఐదు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా నిలిచాడు. రొనాల్డో కెప్టెన్సీలో పోర్చుగల్ 2016 తొలిసారి యూరో చాంపియన్‌గా అవతరించింది. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్‌లో స్పోర్టింగ్ సీపీ, మాంచెస్టర్ యునైటెడ్, రియల్ మాడ్రిడ్, యువెంటస్ జట్లకు ఆడిన రొనాల్డో ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రొ లీగ్‌లో అల్ నాసర్ క్లబ్ జట్టుకు ఆడుతున్నాడు.

జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన టాప్‌-10 ఆటగాళ్లు

ప్లేయర్	దేశం	మ్యాచ్‌లు
రొనాల్డో	పోర్చుగల్	200
బదర్ అల్ ముతవా	కువైట్	196
సో చిన్ అన్	మలేసియా	195
అహ్మద్ హసన్	ఈజిప్ట్	184
అహ్మద్ ముబారక్	ఒమన్	183
సెర్జియో రామోస్	స్పెయిన్	180
ఆండ్రెస్ గ్వార్డాడో	మెక్సికో	179
అల్‌దెయా	సౌదీ అరేబియా	178
క్లాడియో స్వారెజ్	మెక్సికో	177
గియాన్లుగి బఫన్	ఇటలీ	176

సునీల్ ఛెత్రి ‘హ్యాట్రిక్’

పాకిస్తాన్‌పై 4–0తో భారత్ ఘనవిజయం

బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు భారీ విజయంతో శుభారంభం చేసింది. పాకిస్తాన్ జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ తొలి మ్యాచ్‌లో భారత్ 4–0 గోల్స్ తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. కెప్టెన్ సునీల్ ఛెత్రి (10వ, 16వ, 74వ ని.లో) మూడు గోల్స్‌తో ‘హ్యాట్రిక్’ సాధించగా... మరో గోల్‌ను ఉదాంత సింగ్ (81వ ని.లో) అందించాడు. శనివారం తమ తదుపరి మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది. 1952 తర్వాత భారత ఫుట్‌బాల్ వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్టుకు ఒక్క గోల్ కూడా ఇవ్వకపోవడం ఇదే ప్రథమం. భారత జట్టు తరఫున 138వ మ్యాచ్ ఆడిన సునీల్ ఛెత్రి (90 గోల్స్) అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో నాలుగో స్థానానికి ఎగబాకాడు. టాప్–3లో క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్–123 గోల్స్), అలీ దాయి (ఇరాన్–109 గోల్స్), మెస్సీ (అర్జెంటీనా–103 గోల్స్) ఉన్నారు. 2005లో జూన్ 12న భారత సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన 38 ఏళ్ల సునీల్ ఛెత్రి తొలి గోల్ కూడా పాకిస్తాన్ జట్టుపైనే రావడం విశేషం. పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ మొరటుగా వ్యవహరించడంతో ఆయనకు మ్యాచ్ రిఫరీ ప్రజ్వల్ ఛెత్రి రెడ్ కార్డు చూపించి మైదానం బయటకు పంపించారు. భారత జట్టు రెండో గోల్ చేసిన తర్వాత పాక్ ప్లేయర్ అబ్దుల్లా ఇక్బాల్ త్రో ఇన్ చేయడానికి సిద్ధంకాగా స్టిమాక్ అబ్దుల్లా నుంచి బంతిని లాక్కున్నారు. స్టిమాక్ చర్యకు పాక్ ఆటగాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం కూడా చోటు చేసుకుంది. రిఫరీ జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దడంతోపాటు స్టిమాక్‌కు రెడ్ కార్డు ఇచ్చి బయటకు పంపించి మ్యాచ్‌ను కొనసాగించారు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో కువైట్ జట్టు 3–1తో నేపాల్ జట్టును ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో లెబనాన్‌తో బంగ్లాదేశ్; మాల్దీవులుతో భూటాన్ తలపడతాయి.


సునీల్ ఛెత్రి



సిద్ధాంత్‌కు కాంస్యం

బెర్లిన్: స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్–2023లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ స్విమ్మర్ సిద్ధాంత్ మురళీ కుమార్ కాంస్య పతకం సాధించాడు. పురుషుల 25 మీటర్ల ఫ్రీస్టయిల్ లెవెల్ ‘బి’ కేటగిరీలో 17 ఏళ్ల సిద్ధాంత్ 30.57 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. గచ్చిబౌలి స్టేడియంలోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో హెడ్ కోచ్ ఆయుశ్ యాదవ్ వద్ద సిద్ధాంత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఈనెల 25 వరకు జరిగే ఈ క్రీడల్లో ఇప్పటి వరకు భారత్‌కు మూడు స్వర్ణాలు, ఏడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు లభించాయి.

చివరి బంతికి స్కాట్లాండ్ గెలుపు

బులవాయో: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఐర్లాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ ‘బి’ లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు ఒక వికెట్ తేడాతో గెలిచింది. తొలుత ఐర్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు చేయగా... స్కాట్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 289 పరుగులు చేసి నెగ్గింది. ఆఖరి ఓవర్లో స్కాట్లాండ్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. తొలి ఐదు బంతుల్లో ఆరు పరుగులు వచ్చాయి. గెలిచేందుకు ఆఖరి బంతికి రెండు పరుగులు అవసరంకాగా... మైకేల్ లీస్క్ (61 బంతుల్లో 91 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఫోర్ కొట్టి స్కాట్లాండ్‌ను గెలిపించాడు. మరో మ్యాచ్‌లో ఒమన్ జట్టు ఐదు వికెట్లతో యూఏఈపై గెలిచింది.


మైకేల్ లీస్క్

సినిమా


నాగార్జున

అజయ్ దర్శకత్వంలో..?

గత ఏడాది అక్టోబరులో ‘ది ఘోస్ట్’ సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చారు నాగార్జున. ఆ తర్వాత తదుపరి చిత్రం గురించి ఆయన అధికారికంగా ప్రకటించలేదు. కథలు వింటూ బిజీగా ఉన్నారు. దర్శకుడు మోహన్‌రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ వంటివారు నాగార్జునకు కథలు వినిపించారట. అయితే ఏదీ ఫైనలైజ్ కాలేదని సమాచారం. తాజాగా నాగార్జునకు ‘ఆర్‌ఎక్స్ 100’ ఫేమ్ దర్శకుడు అజయ్ భూపతి ఓ కథను వినిపించారని, ఈ కథ ఆయనకు నచ్చిందని, త్వరలోనే వీరి కాంబోలో సినిమా ఉంటుందనీ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను శ్రీనివాసా చిట్టూరి నిర్మించనున్నారని తెలిసింది.


ప్రభాస్

రాయల్?

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాళవికా మోహనన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే యాభై శాతానికి పైగా పూర్తయింది. ఈ చిత్రానికి ఇప్పటివరకూ ‘రాజా డీలక్స్’ అనే టైటిల్ వినిపించింది. తాజాగా ‘అంబాసిడర్’, ‘రాయల్’ అనే టైటిల్స్‌ను కూడా పరిశీలిస్తున్నారట. మరి..‘రాజా డీలక్స్’ లేదా ‘రాయల్’ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫైనలైజ్ అవుతుందా? లేక మరేదైనా టైటిల్ ఈ సినిమాకు ఖరారు అవుతుందా? అనేది వేచి చూడాలి. ఇక హారర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా రాజా డీలక్స్ అనే ఒక థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, ఈ చిత్రంలో ప్రభాస్ – బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తాతా మనవళ్లుగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.


ధనుష్

సాహస ప్రయాణం!

‘రాంఝణా’ (2013), ‘అత్రంగి రే’ (2021) చిత్రాల తర్వాత హీరో ధనుష్, బాలీవుడ్ దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో మూడో సినిమా రూపొందనుంది. ఈ చిత్రానికి ‘తేరే ఇష్క్ మే’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ‘రాంఝణా’ చిత్రం విడుదలై (2013 జూన్ 21) పదేళ్లు పూర్తయిన సందర్భంగా ధనుష్, ఆనంద్ ఎల్. రాయ్ ‘తేరే ఇష్క్ మే’ సినిమాను ప్రకటించారు. ‘‘కొన్ని సినిమాలు మన జీవితాలను మార్చేస్తుంటాయి. ‘రాంఝణా’ చిత్రం కూడా అలాంటిదే. ఈ క్లాసిక్ చిత్రంలో భాగస్వామ్యులైన అందరికీ ధన్యవాదాలు. ఇక ఇప్పుడు ‘రాంఝణా’ ప్రపంచం నుంచే ‘తేరే ఇష్క్ మే’ చిత్రం రాబోతోంది. ఈ సినిమా కోసం నేను ఎలాంటి జర్నీ చేయనున్నానో నాకు తెలియదు. కానీ ఈ ప్రయాణం సాహసోపేతంగా ఉంటుందని మాత్రం చెప్పగలను’’ అని పేర్కొన్నారు ధనుష్. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాదే ప్రారంభం కానుంది.

వరుణ్ సందేశ్‌కు గాయాలు

‘ది కానిస్టేబుల్’ సినిమా సెట్స్‌లో వరుణ్ సందేశ్ గాయపడ్డారు. వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ శుభాన్ దర్శకత్వంలో ‘బలగం’ జగదీష్ నిర్మిస్తున్న చిత్రం ‘ది కానిస్టేబుల్’. ఈ సినిమాకు సంబంధించిన ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణలో భాగంగా వరుణ్ సందేశ్ గాయపడ్డారు. ‘‘పల్లెటూరిలోని ఓ కానిస్టేబుల్ జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న సినిమా ఇది. 40 శాతం పూర్తయింది. అయితే హైదరాబాద్‌లోని శంకర్‌పల్లి సమీపంలో గల టంగుటూరు గ్రామంలో ఫైట్ సీన్ తీస్తున్నప్పుడు వరుణ్ సందేశ్ కాలికి బలమైన గాయం అయింది. దాంతో వైద్యులు మూడు వారాల విశ్రాంతి సూచించారు. ఆయన కోలుకున్నాక రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది.


వరుణ్ సందేశ్

మిస్టర్ ఎక్స్ ఆరంభం

ఆర్య, గౌతమ్ కార్తీక్ హీరోలుగా, అనఘ హీరోయిన్‌గా పాన్ ఇండియన్ మూవీ ‘మిస్టర్ ఎక్స్’ సినిమా ఆరంభమైంది. మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.


అనఘ, ఆర్య, మను ఆనంద్, గౌతమ్ కార్తీక్

ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ‘‘యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. స్టంట్ సిల్వా యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఫైట్స్‌ని ఇండియా, ఉగాండా, అజర్‌బైజాన్, జార్జియా దేశాల్లో చిత్రీకరిస్తాం. ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ధిబు నినన్ థామస్, కెమెరా: తన్వీర్ మీర్.


సిద్ధు జొన్నలగడ్డ

భాగ్ సాలేకి వాయిస్

శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం ‘భాగ్ సాలే’. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహించారు. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా జులై 7న విడుదల కానుంది. క్రైమ్ కామెడీగా రూపొందిన ఈ సినిమాకి హీరో సిద్ధు జొన్నలగడ్డ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆయన వాయిస్ ఓవర్‌తో ‘భాగ్ సాలే’ చిత్ర నేపథ్యాన్ని వివరించబోతున్నారు. కథలో హీరో ఎందుకు ఛేజ్ చేస్తాడు? దాని వెనకున్న కారణాలేంటి? అనేది సిద్ధు చెబుతారు. ఈ చిత్రానికి కెమెరా: రమేష్ కుషేందర్, సంగీతం: కాల భైరవ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: అశ్వత్థామ, గిష్మన్ కొరబండి.


పూజా హెగ్డే

అందుకే తప్పుకోవాల్సి వచ్చింది

‘మహర్షి’ చిత్రం తర్వాత హీరో మహేశ్‌బాబు, హీరోయిన్ పూజా హెగ్డే జంటగా నటించేందుకు రెడీ అయిన చిత్రం ‘గుంటూరు కారం’. ఈ చిత్రంలో శ్రీలీల మరో హీరోయిన్. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా వివిధ కారణాల వల్ల ‘గుంటూరు కారం’ సినిమా రెగ్యులర్ షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక హీరోయిన్ పూజా హెగ్డే ‘గుంటూరు కారం’ చిత్రం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ‘‘తమిళంలో ఓ చిత్రం, కన్నడంలో ఓ మూవీ, హిందీలో ఓ కొత్త ప్రాజెక్ట్‌తో పాటు కొన్ని యాడ్స్ కమిటయ్యారు పూజా హెగ్డే. ఇలా వరుస కమిట్‌మెంట్స్ కారణంగా కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక ‘గుంటూరు కారం’ చిత్రం నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చింది’’ అని పూజా హెగ్డే వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్నారు. ఇక ‘గుంటూరు కారం’ సినిమా నుంచి పూజా హెగ్డే తప్పుకోవడంతో తొలుత సెకండ్ హీరోయిన్‌గా తీసుకున్న శ్రీలీలను మెయిన్ హీరోయిన్‌గా ఫిక్స్ చేసిందట చిత్ర యూనిట్. అలాగే సెకండ్ హీరోయిన్ పాత్ర కోసం సంయుక్తా మీనన్ వంటి హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తోందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కాగా ‘గుంటూరు కారం’ నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం అవుతుందని, వీలైనంత త్వరగా షూటింగ్‌ను పూర్తి చేసి, ముందుగా ప్రకటించినట్లు సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ సినిమాను విడుదల చేసేలా చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం.

విశాఖ ఉక్కు నేపథ్యంలో...

సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘ఉక్కు సత్యాగ్రహం’. ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో పల్సర్ బైక్ పాటతో ఫేమస్ అయిన గాజువాక కండక్టర్ ఝాన్సీ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. జనం ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ– ‘‘విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం గతంలో జరిగిన పోరాటం, ప్రస్తుతం పరిరక్షణ కోసం జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. వాస్తవానికి దగ్గరగా యువతరాన్ని ఆలోచింపజేసేలా సినిమా ఉంటుంది. త్వరలో వైజాగ్ ఆర్‌కే బీచ్‌లో ‘ఉక్కు సత్యాగ్రహం’ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తాం’’ అన్నారు. వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ కోటి, కెమెరా: వెంకట్ చక్రి, సమర్పణ: సతీష్ రెడ్డి, శ్రీవేమల, సహనిర్మాతలు: శంకర్ రెడ్డి, కుర్రి నారాయణరెడ్డి.


సత్యారెడ్డి, గద్దర్


వాస్తవ ఘటనల భీమదేవరపల్లి

అంజి వల్లమాన్, సాయి ప్రసన్న, అభిరామ్, రూపా శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, రాజవ్వ, కీర్తి లత కీలక పాత్రల్లో రమేష్ చెప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘భీమదేవరపల్లి బ్రాంచి’. డాక్టర్ బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ సినిమా మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 23న రిలీజ్ కానుంది. బత్తిని కీర్తిలతా గౌడ్ మాట్లాడుతూ– ‘‘ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు పరిజ్ఞానం పెంచుకోవాలనే సదుద్దేశ్యంతో ఈ చిత్రం నిర్మించాను’’ అన్నారు. ‘‘పేపర్‌లో వచ్చిన ఓ వాస్తవ ఘటనకి ప్రభావితమై ఈ చిత్రకథ తయారు చేశాను. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలు తెలుసుకోవాలనే ఆలోచనతో ఈ సినిమా తీశాం’’ అన్నారు రమేష్ చెప్పాల.


రూపా శ్రీనివాస్, అభిరామ్

అన్ని సమయాల్లో గొప్ప

‘సుడిగాలి’ సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తున్న చిత్రం ‘జీ.ఓ.ఏ.టీ’ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ – అన్ని సమయాల్లో గొప్ప). నరేష్ కుప్పిలి దర్శకత్వంలో మహాతేజ క్రియేషన్స్ పతాకంపై చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ‘‘హైదరాబాద్‌లో మా సినిమా తొలి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ షెడ్యూల్‌లో సుధీర్, దివ్యభారతిలపై కీలక సన్నివేశాలు తీశాం. సుధీర్‌పై యాక్షన్ ఎపిసోడ్స్ కూడా చిత్రీకరించాం. ఖర్చు, క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా నిర్మిస్తున్నాం. సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైలురాయిగా నిలుస్తుంది’’ అన్నారు చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రమణ్యం.


సుధీర్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 91

గురువారం 22-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ఎంప్లాయర్ బ్రాండ్' టాటా పవర్

ఆకర్షణీయమైన ఎంప్లాయర్ బ్రాండ్‌గా 'టాటా పవర్'కు అగ్రస్థానం - 9లో



నింగి.. నేల..ఎక్కడైనా పవర్‌ఫుల్

బైడెన్, మోదీ మధ్య ఎంక్యూ9 రీపర్ డ్రోన్ల కొనుగోలుపై నేడు కీలక భేటీ - 6లో



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ నియంత

అమెరికా, చైనా మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. చైనా అధినేత షీ జిన్‌పింగ్ నియంత అంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మండిపడ్డారు.

- వివరాలు 6లో



హోండురస్‌లో దారుణం

హోండురాస్ దేశం తమారా పట్టణంలోని మహిళా జైలులో రెండు ముఠాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో 46 మంది ఖైదీలు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో





అభివృద్ధి ప్రయాణం రికార్డు 'యోగాసనం'

భారత ప్రధాని మోదీ అమెరికాలో బిజీబిజీగా గడిపారు. ఎలాన్ మస్క్‌తో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. భారత్‌లో టెస్లా కంపెనీ ఏర్పాటుపై త్వరలోనే ప్రకటన చేస్తానని మస్క్ చెప్పారు. కాగా, ఐక్యరాజ్యసమితిలో తొలిసారిగా అధికారికంగా, ప్రధాని మోదీ సారథ్యంలో సాగిన యోగా సెషన్ గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. మోదీ.. యోగా టీ-షర్ట్, ట్రౌజర్ ధరించి 'నమస్తే'తో యోగాసనాలు ప్రారంభించి పలు దేశాల ప్రతినిధులకు యోగా సెషన్‌లోకి స్వాగతం పలికారు.

- వివరాలు 6లో



మన స్మారకం.. ఘన నిర్మాణం

- తెలంగాణ అమరవీరుల స్మారకం నేడు ప్రారంభం
- ప్రపంచంలో నాలుగో స్థానం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా... తెలంగాణ అమరవీరుల స్మారకార్థం హుస్సేన్‌సాగర్ తీరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్మారక చిహ్నాన్ని గురువారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. అతుకుల్లేని స్టెయిన్ లెస్ స్టీల్, అద్దంతో నిర్మించినట్టుండే ఈ కట్టడం ప్రపంచంలోనే నాలుగోది కావటం విశేషం.

- వివరాలు 8లో

పొత్తులపై కేసీఆర్‌తో చర్చలు

సీపీఐ, సీపీఎం నిర్ణయం

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. అందుకోసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని భావిస్తున్నట్లు నాయకులు తెలిపారు. బుధవారం సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం తదితరులు దీనిపై చర్చించారు.

- వివరాలు 2లో

15,660 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు 117 బ్లాకులు..

నేడు కొల్లూరు డిగ్నిటీ హౌసింగ్ టౌన్‌షిప్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

144.5 ఎకరాల్లో రూ.1,474.75 కోట్ల వ్యయంతో నిర్మాణం

- అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లు, లిఫ్టులు వంటి ఆధునిక సదుపాయాలు... పార్కు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటివెన్నో ఏర్పాటు
- బడి, గుడి, ఆస్పత్రి, మార్కెట్ల నిర్మాణానికి చర్యలు
- లాంఛనంగా ఆరుగురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వనున్న ముఖ్యమంత్రి
- అనంతరం పటాన్‌చెరులో బహిరంగ సభ



కొల్లూరు డిగ్నిటీ హౌసింగ్ టౌన్‌షిప్



సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం భారీ స్థాయిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాజెక్టు 'కేసీఆర్ నగర్ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ టౌన్‌షిప్'ను గురువారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రారంభించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ శివార్లలోని సంగారెడ్డి జిల్లా ఆర్‌సీపురం మండలం కొల్లూరులో రెండో దశ కింద ఈ టౌన్‌షిప్‌ను నిర్మించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన ఆరుగురు లబ్ధిదారులకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా లాంఛనంగా ఇళ్ల పట్టాలను అందించనున్నారు.

కార్పొరేట్ స్థాయి హంగులతో..

కొల్లూరులో సుమారు 144.50 ఎకరాల్లో రూ.1,474.75 కోట్ల వ్యయంతో కార్పొరేట్ అపార్ట్‌మెంట్లకు తీసిపోని విధంగా, సకల హంగులు, మౌలిక సదుపాయాలతో టౌన్‌షిప్‌ను నిర్మించారు. ఇక్కడ మొత్తంగా 117 బ్లాకుల్లో 15,660 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఉన్నాయి. ఈ టౌన్‌షిప్‌లో మొత్తంగా 6 నుంచి 36 మీటర్ల వెడల్పు గల 13.50 కిలోమీటర్ల పొడవైన రోడ్లను నిర్మించారు. మొత్తంగా 2.1 కోట్ల లీటర్ల సామర్థ్యమున్న నీటి నిల్వ (అండర్ గ్రౌండ్ కలిపి) ట్యాంకులను

మిగతా 2వ పేజీలో ▶

పటాన్‌చెరులో బహిరంగ సభ

కొల్లూరులో డబుల్ బెడ్రూం టౌన్‌షిప్‌ను ప్రారంభించిన అనంతరం పటాన్‌చెరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం కేసీఆర్ భూమిపూజ చేయనున్నారు. అనంతరం పటాన్‌చెరులో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు ఏర్పాట్లు చేశారు. వీటిని మంత్రి హరీశ్‌రావు బుధవారం పరిశీలించారు. 30 వేల మందితో ఈ సభను నిర్వహించనున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

నేడు 'ఇంటింటికీ బీజేపీ'

30 లక్షల ఇళ్లకు వెళ్లనున్న పార్టీ యంత్రాంగం

- రాష్ట్ర అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు ఇదే కార్యక్రమంలో నిమగ్నం
- మోదీ తొమ్మిదేళ్ల పాలనలో విజయాలపై ప్రజలకు కరపత్రాల పంపిణీ




- వివరాలు 2లో

బీఆర్‌ఎస్‌తో ప్రజలు సంతోషంగా లేరు: బండి

2లో

రామోజీ రాసిందే రసీదు!

ష్యూరిటీ పేరుతో అక్రమంగా డిపాజిట్ల సేకరణ



- పాన్ నంబర్, ఆధార్ ఉండదు
- బ్యాంకు ఖాతా ఊసే లేదు
- తనకు తోచినంత వడ్డీ రేట్ల నిర్ణయం
- అవే నిధులు దర్జాగా సొంత కంపెనీలకు మళ్లింపు
- ఆర్బీఐ నిబంధనలు బేఖాతర్
- కేంద్ర చట్టం యథేచ్ఛగా ఉల్లంఘన
- సహారా, చార్మినార్, కృషి బ్యాంక్ తరహాలో అక్రమాలు
- మార్గదర్శి ముసుగులో 'నల్ల' దందా!

7లో

కరీంనగర్ పేరు చెబితే.. ప్రతిపక్షాల గుండెఝల్లు

రూ. 220 కోట్లతో కేబుల్ బ్రిడ్జి, రూ. 410 కోట్లతో ఎంఆర్‌ఎఫ్

- త్వరలో మానేరు పొడవునా సుజల దృశ్యం
- ఆగస్టు నాటికి మానేరు రివర్‌ఫ్రంట్ సిద్ధం
- తీగలవంతెన ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్
- అభివృద్ధిని ప్రోత్సహించాలని ప్రజలకు వినతి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉద్యమకాలం నుంచి 'కరీంనగర్ పేరు చెబితే ఝల్లు మనాలే' అని పాటలు పాడుకున్నామని, ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు గుండె ఝల్లు మంటోందని మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు అన్నారు. కరీంనగర్‌లోని మానేరు నదిపై నిర్మించిన తీగల వంతెనను మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం

మిగతా 2వ పేజీలో ▶



విద్యుత్, బాణసంచా వెలుగుల్లో కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి. (ఇన్‌సెట్‌లో) బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

ఇదండీ సంగతి



... నెక్స్ట్ మీటింగ్‌కు ప్రిపేర్ అవుతున్నార్సార్!

క్లుప్తంగా...

ప్రజల తెలంగాణ కోసమే పార్టీ: గద్దర్

- 'గద్దర్ ప్రజా పార్టీ' రిజిస్ట్రేషన్ కోసం సీఈసీకి దరఖాస్తు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రజలు కోరుకొనే తెలంగాణ కోసమే పార్టీ పెడుతున్నట్లు ప్రజా గాయకుడు గద్దర్ పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజా పాలన అందలేదని విమర్శించారు. తెలంగాణలో ధరణి కార్యక్రమాన్ని ఆయన మోసంగా అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో 'గద్దర్ ప్రజా పార్టీ' రిజిస్ట్రేషన్ నిమిత్తం సీఈసీకి దరఖాస్తు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విధానాలు తప్పని పేర్కొన్న గద్దర్, పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ కాదని.. పుచ్చు తెలంగాణ చేశారని ఆరోపించారు. ధరణి పేరుతో కేసీఆర్ భూములు మింగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దోపిడీ పార్టీ పోవాలనే ఏడుపదుల వయసులో ప్రజా పార్టీ పెట్టానని చెప్పారు. కాగా, 'కేసీఆర్ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ పోటీ చేస్తానని గతంలో చెప్పా. ఇప్పుడు పార్టీ తీర్మానం మేరకు ఎక్కడ చేయమంటే అక్కడ చేస్తా. భావ, ఆచరణ సారూప్యత ఎజెండాగా పొత్తులుంటాయి' అని గద్దర్ పేర్కొన్నారు.

డబ్బు, మద్యం పంచనని ప్రమాణం చేయండి

- వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో ఎలాంటి డబ్బు, మద్యం పంచబోమని బొడ్రాయి మీద ప్రమాణం చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల కోరారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేటీఆర్ తీరు ఉందని ఆమె విమర్శించారు. పోలీసులను అడ్డు పెట్టుకోవడం లేదు.. ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం లేదని చిన్నదొర చెప్పడం ఈ దశాబ్దపు పెద్ద జోక్ ఇదేనని బుధవారం ట్విట్టర్‌లో ఎద్దేవా చేశారు. అన్నం పెట్టే రైతుకు బేడీలు వేసి, చంటి బిడ్డల తల్లులని చూడకుండా జైళ్లకు పంపడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను బీఆర్‌ఎస్ పాలనలో బానిస వ్యవస్థగా మార్చారని ఆరోపించారు. డబ్బు, మద్యం పంచనని దొంగ మాటలు చెప్పే దొర మొన్నే జరిగిన సిరిసిల్ల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో డబ్బులు పంచలేదా?.. మద్యం పారించలేదా? అని నిలదీశారు. మునుగోడు, నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో ఓటుకు రూ.10 వేలు పంచింది కేటీఆర్ సారథ్యంలోనే కదా? అని సూటిగా ప్రశ్నించారు. సర్పంచ్ నుంచి ఎంపీ ఎలక్షన్ల దాకా డబ్బులు కుమ్మరించి, మద్యం ఏరులై పారించింది బీఆర్‌ఎస్ పార్టీయేనని విమర్శించారు. సంతలో పశువులను కొన్నట్లు వేల కోట్లు కుమ్మరించి ఎమ్మెల్యేలను కొన్నది బీఆర్‌ఎస్ కాదా? అని మండిపడ్డారు. తమ పాలన మీద నమ్మకమే ఉంటే పోలీసుల సాయం తీసుకోనని గ్రామ దేవతల మీద ఒట్టు వేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ



భువనగిరి టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. తాము కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. బుధవారం బీఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమైనా బీఎస్పీ మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకురాలు బెల్లి లలిత ఆశయ సాధనకు బీఎస్పీ కృషి చేస్తుందన్నారు.

స్మృతివనం ప్రారంభానికి ఆహ్వానం

- శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ



సాక్షి యాదాద్రి: హైదరాబాద్‌లో గురువారం సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్న స్మృతి వనం కార్యక్రమానికి రావాలని తెలంగాణ మలిదశ పోరాటంలో తొలి అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మకు ఆహ్వానం అందింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన శంకరమ్మ బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. స్మృతి వనం ఆవిష్కరణకు తమను పిలవడం ఎంతో సంతోషకరమైన విషయమని ఆమె చెప్పారు. అమరవీరుల తల్లిదండ్రులుగా.. తమ పిల్లలు అక్కడ ఉన్నారని భావిస్తామన్నారు. ఎమ్మెల్సీ పదవి గురించి తనకు ఎలాంటి సమాచారమూ లేదని స్పష్టం చేశారు. గతంలో ఎప్పుడూ సీఎంను కలవలేదని, ఆయనపై తమకు వ్యతిరేకతేమీ లేదన్నారు. హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్న అమరవీరుల స్మృతి వనం కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి జగదీశ్‌రెడ్డి ఫోన్ చేసి చెప్పారని శంకరమ్మ తెలిపారు. కాగా, గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి శంకరమ్మకు ఇవ్వాలని కేసీఆర్ భావించారని, శంకరమ్మకు గన్‌మన్, పీఏ, ప్రభుత్వ వాహనాన్ని కూడా కేటాయించినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా జరుగుతున్న ప్రచారం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.

రైతు బిడ్డను కావడం వల్లే | 'కిసాన్ సర్కార్' నినాదం

- సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు
- మహారాష్ట్రలో అధికారంలోకి వస్తే రెండేళ్లలో తెలంగాణ మోడల్
- రెండేళ్లలో ఉచిత తాగునీరు, విద్యుత్
- సీఎం కేసీఆర్ వెల్లడి



సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: తాను స్వయంగా రైతు బిడ్డను కావడం వల్లే దేశ రాజకీయాల్లో 'కిసాన్ సర్కార్'అనే నినాదం తొలిసారిగా వినిపిస్తోందని బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు, పలువురు బుధవారం ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. హక్కుల సాధనకు జీవితకాలమంతా భారత రైతాంగం రోడ్ల మీద పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితి నుంచి రైతులు బయటపడేందుకు తమ ప్రభుత్వాన్ని తామే ఏర్పాటు చేసుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. మన ఓటు మనకే అనే చైతన్యంతో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్'నినాదాన్ని నిజం చేసేందుకు బీఆర్‌ఎస్‌తో కలిసి నడవాలని దేశ రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ మోడల్‌తో రైతులకు దీపావళి

మహారాష్ట్రలో తెలంగాణ మోడల్‌ను అమలు చేస్తే రైతులకు దీపావళి వస్తుందని, అక్కడి పార్టీలు దివాళా తీస్తాయని కేసీఆర్ అన్నారు. తాను రైతు బిడ్డను కాబట్టే తెలంగాణ మోడల్ సాధ్యమైందని, ఇక్కడ రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టేందుకు తొమ్మిదేళ్లు పట్టినా, మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడితే రెండేళ్లలోనే అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. గోదావరి, కృష్ణా నదుల జన్మ స్థానమైన మహారాష్ట్రలో అద్భుత సహజవనరులున్నా పాలకుల అసమర్థతతో వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పండుతున్న 2 కోట్ల టన్నుల వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లులను జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తామన్నారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలో ఉచితంగా తాగునీరు, 24 గంటల ఉచిత నిరంతరాయ విద్యుత్‌ను రైతులకు అందజేస్తామన్నారు.

బీఆర్‌ఎస్ సభ్యత్వం 50లక్షలు: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు ఇప్పటికే 10లక్షలకు చేరుకోగా, కొద్ది నెలల్లో 50లక్షలకు చేరుతుందని పార్టీ నేతలు కేసీఆర్‌కు వివరించారు. సభ్యత్వ నమోదు, బీఆర్‌ఎస్ సభలకు జనాదరణ చూస్తే పార్టీ దేశ వ్యాప్తంగా విస్తరించడం ఖాయంగా కనిపిస్తోందని కేసీఆర్ అన్నారు. మహారాష్ట్రలోని ప్రతీ గ్రామంలో కిసాన్, మహిళా, దళిత్, ఆదివాసీ, బీసీ, యువజన విభాగాలను కలుపుకుని మొత్తం తొమ్మిది కమిటీలు వేయాలని సూచించారు. కాగా, బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మహారాష్ట్ర మాజీ విఠల్ జాదవ్, సినీ డ్యాన్సర్ పునేకర్, సామాజిక కార్యకర్త శేఖర్ అంబేకార్, ఉమాకాంత్ మంగ్రూలేతో పాటు లాతూర్, ఉస్మానాబాద్ జిల్లాల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, గ్రామ సర్పంచులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలు శంకరన్నదోంగ్డే, మాణిక్ కదం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో ప్రజలు సంతోషంగా లేరు

- రాష్ట్రం కోసం పేదలు అమరులయ్యారు
- కేసీఆర్ మాత్రం దొంగ దీక్ష చేశారు
- లక్సెట్టిపేట 'మహాజన్ సంపర్క్ అభియాన్'లో బండి సంజయ్



సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/లక్సెట్టిపేట: శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి 1400మంది పేదల ప్రాణ త్యాగాలతో తెలంగాణ వచ్చిందని, సీఎం కేసీఆర్ ఏం త్యాగం చేశారో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగమని చెప్పి నిరుద్యోగులను, పోడు పట్టాలు ఇస్తామని గిరిజనులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సహా ఈ ప్రభుత్వంలో ఏ వర్గానికీ సంతృప్తి లేదన్నారు. మంచిర్యాల అసెంబ్లీ స్థాయి 'మహాజన్ సంపర్క్ అభియాన్'సభను బుధవారం లక్సెట్టిపేటలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. ఉద్యమంలో సీఎం కేసీఆర్ దొంగ దీక్షలు చేశారన్నారు. ఆ సమయంలో కేటీఆర్ ఎక్కడున్నారని? హరీశ్‌రావు, కవిత ఏం త్యాగం చేశారని ప్రశ్నించారు. ఎల్లంపల్లి నుంచి 3టీఎంసీలు 30వేల ఎకరాలకు ఇస్తామని ఇవ్వలేదని, సుందిళ్ల ప్రాజెక్టులో నస్పూర్, మంచిర్యాల ప్రాంతాలు నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనని, కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని తెలిపారు. కొందరు నేతలు మునిగిపోయే పడవలో చేరుతున్నారని, కాంగ్రెస్ పార్టీని లేపే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోదీ 2.40లక్షల ఇళ్లు ఇచ్చారు

ప్రధాని మోదీ.. దేశవ్యాప్తంగా మూడు కోట్ల ఇళ్లు ఇస్తే, తెలంగాణకు 2.40లక్షల ఇళ్లు ఇచ్చారని, వాటిని ఏం చేశారో సీఎం కేసీఆర్ చెప్పాలని బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామని మోదీ ముందుకొచ్చినా.. సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రశ్నిస్తున్నందుకు తనను రెండుసార్లు అరెస్టు చేశారని, తమ కార్యకర్తల్ని జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, నిరుపేదలకు ఇళ్లు, ఫసల్ బీమా, జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్‌కు ఆధ్యాత్మికత ఎక్కడిది?

సాక్షి, హైదరాబాద్: ఆత్మసాక్షిగా కూడా అబద్ధమే చెప్పే సీఎం కేసీఆర్‌కు ఆధ్యాత్మికత ఎక్కడిదని ట్విట్టర్ వేదికగా బండి సంజయ్ ప్రశ్నించారు. హిందూగాళ్లు, బొందుగాళ్లు అంటూ దుర్భాషలు..భయంకర హిందువును నేనేనంటూ ప్రగల్భాలు పలకడం ఆయనకే చెల్లిందన్నారు. 'యాదాద్రేమో మీకు పెట్టుబడి...కొండగట్టు, ధర్మపురి, వేములవాడ, కొమురవెల్లి, బాసర, భద్రాద్రి, జోగులాంబ ఆలయాలకు నిధుల కేటాయింపేమో మొక్కుబడి..రూ.కోట్లకు కోట్లు ఇస్తాననే మాటలే తప్ప చేతలు లేవు' అని ట్వీట్ చేశారు.

కరీంనగర్ పేరు చెబితే.. ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో రూ.220 కోట్లతో తీగల వంతెన, రూ.410 కోట్లతో మానేరు రివర్‌ఫ్రంట్ (ఎంఆర్‌ఎఫ్) వంటి ప్రాజెక్టులతో నగరం అభివృద్ధి చెందుతోందన్నారు. మానేరు నది మొత్తం 180 కి.మీల పొడవునా సుజల దృశ్యంగా మార్చాలన్న పట్టుదలతో పనిచేస్తున్నామన్నారు. ఉద్యమకాలంలో జలదృశ్యంలో మొదలై.. రాబో యే దసరా నాటికి మానేరు సుజల దృశ్యంగా ఆవిష్కారం కాబోతుందని ప్రకటించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని కాళోజీ అన్నట్లుగా.. 'నా తెలంగాణ కోటి మాగాణం'గా చేస్తున్నామన్నారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలతో గోదావరి–కృష్ణా నీటిని ఒడిసి తెలంగాణ బీడుభూములను సస్యశ్యామలం చేశామన్నారు.

పనిచేసే వారికి పట్టం కట్టండి..

కరీంనగర్ అభివృద్ధిలో మంత్రి గంగుల కమలాకర్ సంకల్పాన్ని కేటీఆర్ ప్రశంసించారు. సీఎం ముద్దుగా 'కరీంనగర్ భీముడు' అని పిలుచుకునే గంగుల కమలాకర్ చొరవతోనే అందమైన జంక్షన్లు, రోడ్లతో నగరం సర్వాంగ సుందరంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్ను వెన్నుదట్టి మరోసారి ప్రోత్సహించాలని ప్రజలను కోరారు. అదే సమయంలో ప్రణాళికా సంఘం బోర్డు ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ను ఎంపీగా కోల్పోయామని వాపోయారు. ఇపుడున్న ఎంపీ ఏం మాట్లాడుతడో ఆయనకే తెలియదని విమర్శించారు. నగరంలో పదెకరాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గుడి కట్టిన నాయకుడు ఉన్నాడా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పల్లెప్రగతి నుంచి పట్టణప్రగతి వరకు దేశంలో మనమే నెంబర్ వన్‌గా ఉన్నామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సంక్షేమ రంగాల్లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దూసుకుపోతోందని, అందులో కరీంనగర్ తెలంగాణలోనే అగ్రభాగంలోనే ఉందని తెలిపారు. అందుకే, పనిచేసేవారిని ప్రోత్సహించాలని కోరారు. పనిచేయని వారిని చెత్తబుట్టలో వేయాల్సిన బాధ్యత మీదేనని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని.. అభివృద్ధే తమ కులమని.. జనహితమే తమ మతం అని ముగించారు.



డైనమిక్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్

కరీంనగర్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు: గంగుల

అంతకుముందు మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఉద్యమకాలం నుంచి కరీంనగర్ అంటే సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానమని గుర్తుచేశారు. కేబుల్ వంతెన, మానేరు రివర్‌ఫ్రంట్ ఆగస్టు 15 నాటికి మొదటి దశ ప్రారంభిస్తామన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వాటర్ ఫౌంటెయిన్ ప్రారంభమవుతుందని, ఈ ప్రాజెక్టులతో నగరానికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇన్ని అవకాశాలు కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గతంలో చెప్పినట్లుగా కరీంనగర్‌ను లండన్ తరహాలో తీర్చిదిద్దుతున్నారన్నారు. రాష్ట్రం ఇస్తే ఏం చేస్తారన్న వెక్కిరింపులను దాటి.. నదులను ఎత్తి కోటి ఎకరాలకు నీళ్లు తెచ్చామని, నిరంతర కరెంటు ఇస్తున్నామని చెప్పారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటికీ బీజేపీ'

- 30 లక్షల ఇళ్లకు వెళ్లనున్న పార్టీ యంత్రాంగం
- రాష్ట్ర అధ్యక్షుడు నుంచి కార్యకర్త వరకు ఇదే కార్యక్రమంలో నిమగ్నం
- మోదీ ప్రభుత్వ 9 ఏళ్ల పాలనలో విజయాలపై ప్రజలకు కరపత్రాల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: 'మహా జన్‌సంపర్క్ అభియాన్'లో భాగంగా గురువారం నుంచి 'ఇంటింటికీ బీజేపీ'పేరిట తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర బీజేపీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మొదలు పోలింగ్‌బూత్ స్థాయి కార్యకర్త దాకా మొత్తం పార్టీ యంత్రాంగం ఈ కార్యక్రమాల్లో నిమగ్నం కానుంది. సాయంత్రం వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తారు. గురువారం నుంచి 30వ తేదీ వరకు చేపట్టబోయే కార్యక్రమాల్లో భాగంగా మొత్తం 119 శాసనసభా స్థానాల్లో సభలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ పోలింగ్‌బూత్‌లో సగటున వంద ఇళ్ల తలుపులను తట్టి మొత్తం 30 లక్షల ఇళ్లలో ప్రజలకు మోదీ సర్కార్ విజయాలను తెలిపే కరపత్రాలను అందజేయనున్నారు. అలాగే ప్రధాని మోదీకి మద్దతు తెలిపేలా ప్రజలతో 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ అభియాన్‌లో భాగంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రంలో పర్యటించేందుకు సమయాన్ని కేటాయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. గుజరాత్, తదితర రాష్ట్రాల్లో తుపాను ప్రభావం కారణంగా ఇటీవల అమిత్‌షా ఖమ్మం బహిరంగసభ రద్దు కాగా, మళ్లీ ఆయనతో అక్కడే త్వరలోనే సభ నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలాఖరులోగా ప్రధాని మోదీ కూడా రాష్ట్రంలోని ఒకటి, రెండు చోట్ల రోడ్‌షోలు నిర్వహించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం.

నేడు ముఖ్యనేతల పర్యటనలిలా..

గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్‌లో పర్యటించి మోదీ పథకాలను ప్రచారం చేస్తారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంబర్‌పేట్, నాంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని వివిధ పోలింగ్ బూత్‌ల పరిధిలో పర్యటిస్తారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ ముషీరాబాద్‌లోని గాంధీనగర్ డివిజన్‌లో నిర్వహించే కార్యక్ర మాల్లో పాల్గొంటారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

15,660 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు 117 బ్లాకులు

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. అండర్ గ్రౌండ్ ద్వారానే విద్యుత్ సరఫరా కేబుళ్లు వేశారు. లిఫ్టులకు, వాటర్ సప్లై, ఎస్‌టీపీలకు విద్యుత్ సరఫరా కోసం 30 కేవీఏ నుంచి 400 కేవీఏ వరకు 133 జనరేటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మురుగు నీటిని బయటకు పంపించకుండా రీసైక్లింగ్ చేసే ఎస్టీపీలను, శుద్ధి చేసిన నీటిని సుందరీకరణ పనులకు వాడేలా పైప్‌లైన్ నిర్మించారు. 10.55 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, 10.05 కిలోమీటర్ల తాగునీటి పైప్‌లైన్, 10.60 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ పైప్‌లైన్, 137 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధి దీపాల కోసం 528 స్తంభాలు ఏర్పాటు చేశారు. 54,000 చదరపు అడుగుల విస్తీర్ణమున్న 3 షాపింగ్ కాంప్లెక్స్‌లలో 118 షాపులు, ప్రతి బ్లాక్‌కు రెండు చొప్పున 234 లిఫ్టులను ఏర్పాటు చేశారు.

సామాజిక వసతులూ ఎన్నో..

- టౌన్‌షిప్ వాసులకు ఆహ్లాదకరంగా ఉండేందుకు పార్కు, సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, ఆట స్థలం, ఓపెన్ జిమ్, ఇండోర్ స్పోర్ట్ కాంప్లెక్స్, ఓపెన్ స్పోర్ట్స్ ఏరియా, మల్టీపర్పస్ గ్రౌండ్, ఆంఫి థియేటర్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, బతుకమ్మ ఘాట్లనూ ఏర్పాటుచేశారు.
- కాలనీ వాసుల కోసం ఆధునిక కూరగాయల, మాంసాహార మార్కెట్, విద్యార్థుల కోసం ప్లేస్కూల్, అంగన్‌వాడీ సెంటర్, బస్తీ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బస్ టెర్మినల్, బస్‌స్టాప్, పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్, మిల్క్ బూత్‌లు, పెట్రోల్ బంకు, పోస్టాఫీసు, ఏటీఎం, బ్యాంకు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యార్డు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

శంకర్‌పల్లిలో ప్రైవేటు రైల్వే ఫ్యాక్టరీని ప్రారంభించనున్న కేసీఆర్

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక 'మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ'ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించనున్నారు. వంద ఎకరాల్లో, సుమారు వెయ్యి కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ ఫ్యాక్టరీకి మంత్రి కేటీఆర్ 2017–18లో శంకుస్థాపన చేయగా.. ఇటీవలే పనులు పూర్తయి ఉత్పత్తి ప్రారంభమైంది. దీనిని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. ఏటా 500 రైల్వేకోచ్‌లు, 50లోకోమోటివ్‌ల ఉత్పత్తి లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. వాటిని వివిధ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. రైల్వే పరికరాల ఉత్పత్తిలోని ప్రైవేటు సంస్థల్లో పెద్దదైన మేధా సంస్థ.. భారతీయ రైల్వేకు కూడా వివిధ ఉత్పత్తులను మేధా సంస్థ సరఫరా చేస్తోంది. ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల మందికిపైగా ఉపాధి పొందనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. కంపెనీ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు.

భట్టికి తగ్గని జ్వరం..

రెండోరోజూ పాదయాత్రకు బ్రేక్

- నేడు కూడా విరామమే..
- కేతేపల్లి శిబిరం వద్ద కొనసాగుతున్న వైద్య చికిత్స



భట్టికి సపర్యలు చేస్తున్న ఆయన సతీమణి నందిని

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు జ్వరం ఇంకా తగ్గలేదు. దీంతో ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం కూడా ఆగిపోయింది. వడదెబ్బతో తల నొప్పి, నీరసం, తీవ్ర జ్వరం రావటంతో మంగళవారం మధ్యాహ్నమే ఆయన పాదయాత్రకు విరామం ప్రకటించారు. బుధవారం కూడా జ్వరం తగ్గకపోవడంతో వైద్యుల సూచనల మేరకు పూర్తిగా పాదయాత్రను నిలిపివేశారు. గురువారం ఉదయం కూడా పాదయాత్రకు విరామం ప్రకటించారు. వైద్యుల పరీక్షల అనంతరం సాయంత్రం పాదయాత్ర నిర్వహిస్తారా లేదా అన్నది తేలనుంది. వైద్యుల సూచన మేరకు భట్టి విక్రమార్క పాదయాత్ర శిబిరంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వడదెబ్బ కారణంగా జ్వరం రావడంతో పాటు డీహైడ్రేషన్ కావడం వల్ల భట్టి విక్రమార్కకు చాలా నీరసంగా ఉందని సూర్యాపేటకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఆయన త్వరగా కోలుకోవడానికి సెలైన్స్ పెట్టినట్లు వెల్లడించారు.

ప్రముఖుల పరామర్శ..

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎల్.ఆర్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య తదితర కాంగ్రెస్ నేతలు, పలువురు కార్యకర్తలు పాదయాత్ర శిబిరం వద్దకు వచ్చి భట్టిని పరామర్శించారు. ఆందోళన చెందవద్దని, తాను త్వరలోనే కోలుకుంటానని భట్టి.. కార్యకర్తలకు ధైర్యం చెప్పి పంపారు.

ఎమ్మెల్యే రాజయ్యపై | సర్పంచ్ నవ్య ఫిర్యాదు

- వేధిస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించిన జానకీపురం సర్పంచ్
- తన భర్త ప్రవీణ్‌తో పాటు ధర్మసాగర్ ఎంపీపీ, ఎమ్మెల్యే పీఏపైనా ఆరోపణలు
- ఎమ్మెల్యే లైంగికంగా వేధిస్తున్నారని గతంలో ఆరోపణలు
- తాజాగా బాండ్‌పేపర్లపై సంతకం పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు



ధర్మసాగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నవ్య

సాక్షిప్రతినిధి, వరంగల్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కుర్సపల్లి నవ్య మధ్య వేధింపుల పంచాయితీ చినికిచినికి గాలివానగా మారి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సర్పంచ్ నవ్య.. ఎమ్మెల్యేతో పాటు తన భర్త ప్రవీణ్, ధర్మసాగర్ ఎంపీపీ నిమ్మ కవిత, ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్‌లపై బుధవారం సాయంత్రం ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేతోపాటు తన భర్త, ఎంపీపీ, ఎమ్మెల్యే పీఏలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వేధింపులకు సంబంధించి తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని నవ్య స్పష్టం చేశారు. వేధింపులపై మూడు నెలల క్రితం క్షమాపణ చెప్పిన ఎమ్మెల్యే రాజయ్య.. గ్రామ అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తానని చెప్పి నయాపైసా ఇవ్వకపోగా తనకు ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రూ.100 బాండ్ పేపర్‌పై అప్పుగా రూ.20 లక్షలు తీసుకున్నట్టు సంతకం పెట్టాలని ఎమ్మెల్యేతోపాటు తన భర్త, ఎంపీపీ, ఎమ్మెల్యే పీఏలు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తన భర్తపై కూడా ఆరోపణలు చేసిన నవ్య.. ఆయనతో కలిసే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం కొసమెరుపు.

డబ్బు ఆశచూపి నా భర్తను ట్రాప్ చేశారు..

సర్పంచ్ నవ్య.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు ఆరోపణలు చేశారు. 'జానకీపురం గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నన్ను ఎమ్మెల్యే రాజయ్య కొంతకాలంగా వేధిస్తున్నారు. గతంలో నా భర్త ప్రవీణ్ కుమార్ ద్వారా నన్ను బలవంతగా ఒప్పించి, రాజీపడే విధంగా చేసి.. ఎమ్మెల్యే రాజయ్య స్వయంగా మా ఇంటికి వచ్చి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. మీడియా ముఖంగా జానకీపురం గ్రామాభివృద్ధి కోసం తన సొంత నిధులనుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాటలను నమ్మి రాజీపడ్డాం. కానీ నేటికీ ఎలాంటి నిధులు మంజూరు చేయకపోగా రూ.25 లక్షలు మాకే ఇచ్చినట్లుగా తప్పుడు ప్రచారం ఎమ్మెల్యే చేయించాడు. నెలరోజుల కింద నా భర్త ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే అనుచరుడు శ్రీనివాస్ గ్రామానికి నిధులు ఇస్తామని నన్ను హనుమకొండకు రప్పించి నా దగ్గరికి రెండు అగ్రిమెంటు పేపర్లను తీసుకువచ్చారు. ఒకటి గతంలో ఎమ్మెల్యేపై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు అబద్ధమని, నేను తప్పుగా రాజకీయ లబ్ధి కోసం వాటిని చేసినట్లు ఒప్పుకున్నట్టుగా స్టాంపు పేపరుపైన రాయించుకొచ్చారు. మరో పేపర్‌పై రూ.20 లక్షలు నాకు అప్పుగా ఇచ్చినట్లు, తిరిగి ఎప్పుడు అడిగితే అప్పుడు ఇచ్చే విధంగా ఒప్పుకున్నట్లు రాసుకొని వచ్చారు. వాటిపై సంతకం పెట్టాలని బలవంతం చేశారు. దీనిని నేను వ్యతిరేకించా. డబ్బు ఆశచూపి నా భర్తను ట్రాప్ చేసి, సంతకం పెడితేనే గ్రామానికి ఒప్పుకున్న నిధులు రూ.25 లక్షలు మంజూరు చేస్తామని వేధింపులకు గురి చేస్తున్నారు. మార్చి 8న జరిగిన వేధింపుల ఘటనలో మధ్యవర్తిత్వం వహించిన ధర్మసాగర్ ఎంపీపీ నిమ్మ కవిత ఆ రోజు క్షమించమని ప్రాధేయపడితే.. పోనీ, ఎవరి పాపం వారిది అని పేరు బయట పెట్టలేదు. అయినా నా భర్తకు డబ్బు ఆశచూపి ఒప్పంద పత్రంపై సంతకం చేయించడానికి పన్నాగం పన్నారు. నిజాయితీగా ఉండాలనుకున్న నేను సంతకం చేయకపోవడంతో వేధింపులకు గురి చేస్తున్నందున ఎమ్మెల్యే, ఆయన పీఏ, ఎంపీపీ, నా భర్తపైనా చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నా'అని ఫిర్యాదులో వివరించారు.

ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు..

భర్తతో కలసి నవ్య ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన ధర్మసాగర్ పోలీసులు, బుధవారం రాత్రి వరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు. ఎమ్మెల్యే, ఎంపీపీ, ఎమ్మెల్యే పీఏలతో పాటు తనభర్తపైనా నవ్య చేసిన ఫిర్యాదులో ఎఫ్‌ఐఆర్ కంటెంట్ లేనందున కేసు నమోదు చేయలేదని, న్యాయపరమైన సలహా తీసుకున్న తర్వాత చర్యలు చేపడతామని ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేశ్ తెలిపారు.

పొత్తులపై సీఎం కేసీఆర్‌తో చర్చలు

సీపీఐ, సీపీఎం నిర్ణయం

- త్వరలో జిల్లాల్లో ఉమ్మడిగా సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. అందుకోసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని భావిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీని ఓడించినట్లుగానే, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కలసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ మేరకు బుధవారం సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం సహా ఆ పార్టీల నాయకులు చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, ఎస్.బాలమల్లేశ్, కలవేన శంకర్ (సీపీఐ), జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, పోతినేని సుదర్శన్ రావు, జాన్ వెస్లీ (సీపీఎం)లు మఖ్దూం భవన్‌లో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలపై సుమారు రెండు గంటల పాటు చర్చించారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు విషయంలో ఇప్పటికీ అడుగు ముందుకు పడకపోవడం, బీఆర్‌ఎస్ నేతలు పలువురు గతంలో చేసిన వ్యాఖ్యలపై చర్చ జరిగినట్లు సమాచారం. త్వరలో జిల్లా స్థాయి ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని ఆ పార్టీలు నిర్ణయించాయి. తెలంగాణలో బీజేపీకి అవకాశం లేకుండా చేసేందుకు చొరవ చూపి మరింత దృఢంగా బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపైన ఉందని సమావేశం అభిప్రాయపడింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో చేరికలపైనా సమావేశంలో చర్చించారు. ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోమారు ఈ నెల 30వ తేదీన సమావేశం కావాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి.

ఆగస్టులో సిద్దిపేటకు రైలు సర్వీసులు

- జూలై చివరి నాటికి పూర్తికానున్న ట్రాక్ పనులు
- రైల్వే సేఫ్టీ కమిషనర్ పచ్చజెండా ఊపగానే సేవలు షురూ
- కాచిగూడకు పుష్‌పుల్ పరుగులు
- తిరుపతి, బెంగళూరు/ముంబయికి ఎక్స్‌ప్రెస్ రైళ్లు


సిద్ధమైన రైల్వేట్రాక్

సాక్షి, హైదరాబాద్: ఆగస్టులో సిద్దిపేటకు రైలు సర్వీసులు ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా జూలై చివరి నాటికి లేదా ఆగస్టు మొదటి వారాంతానికి సిద్దిపేట వరకు రైల్వే లైన్ సిద్ధం కాబోతోంది. ప్రస్తుతం సిద్దిపేట సమీపంలోని దుద్దెడ వరకు పూర్తిస్థాయి ట్రాక్ ఏర్పాటు పూర్తికాగా, అక్కడి నుంచి సిద్దిపేట చేరువ వరకు తాత్కాలిక ట్రాక్ ఏర్పాటు పూర్తయింది. సిద్దిపేట బైపాస్ వరకు ఆ పనులు పూర్తయిన తర్వాత శాశ్వత ప్రాతిపదికన పట్టాలు ఏర్పాటు చేస్తారు. ఆ వెంటనే రైల్వే సేఫ్టీ కమిషనర్ దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు ట్రాక్ సామర్థ్యాన్ని పరీక్షించి అనుమతి ఇవ్వగానే రైలు సేవలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుష్‌పుల్.. ఎక్స్‌ప్రెస్‌లు..

గజ్వేల్ వరకు లైన్ నిర్మాణం పూర్తయిన వెంటనే గతేడాదే అక్కడి నుంచి నగరానికి ప్యాసింజర్ రైలు నడపాలని నిర్ణయించారు. కానీ కోవిడ్ ఆంక్షలతో ఇందుకు ఆటంకం ఎదురయ్యింది. తర్వాత ప్రారంభించాలని భావించినా, గజ్వేల్ నుంచి నిత్యం నగరానికి ఓ రైలుకు సరిపడా ప్రయాణికులు ఉండరన్న అభిప్రాయం వ్యక్తం కావటంతో ఆ ప్రయత్నాన్ని అధికారులు విరమించుకున్నారు. ఇప్పుడు సిద్దిపేట నుంచి సరిపడ సంఖ్యలో ప్రయాణికులు ఉంటారని నిర్ధారించుకున్న అధికారులు.. రోజుకు ఒకటి లేదా రెండు పుష్‌పుల్ రైలు ట్రిప్పులు నడపాలని నిర్ణయించారు. సిద్దిపేట నుంచి కాచిగూడకు ఆ రైలు నడుస్తుందని చెబుతున్నారు. ఇక తిరుపతికి, బెంగళూరుకు గాని ముంబయికి గాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా సిద్దిపేట నుంచి నడపాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతున్న కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను సిద్దిపేట నుంచి ప్రారంభిస్తే, కరీంనగర్ ప్రయాణికులకు కూడా వెసులుబాటుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

సిద్దిపేట స్టేషన్ వద్ద ఐదు లైన్లు..

సిద్దిపేటలో రైల్వే స్టేషన్ భవనం వేగంగా సిద్ధమవుతోంది. దాంతోపాటు సరుకు రవాణాకు భారీ గూడ్సు యార్డును నిర్మిస్తున్నారు. ఇక్కడ మొత్తం ఐదు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి మెయిన్ లైన్, రెండు లూప్‌లైన్లు, ఒకటి గూడ్సు లైను, ట్రాక్ మెయింటెనెన్స్‌కు వినియోగించే ట్రాక్ మిషన్ కోసం సైడింగ్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్‌ఫామ్స్ 750 మీటర్ల పొడవుతో సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి సరుకు రవాణా భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్న రైల్వే శాఖ, అందుకోసం దాదాపు 800 మీటర్ల పొడవుతో గూడ్సు షెడ్డును ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే గజ్వేల్‌లో 600 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన సరుకు రవాణా యార్డు బాగా ఉపయోగపడుతోంది. ఈ ప్రాంతానికి కావాల్సిన ఎరువులు రైలు ద్వారానే వస్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి ధాన్యం క్రమం తప్పకుండా ఎగుమతి అవుతోంది. సిద్దిపేటలో కూడా సరుకు రవాణా ప్రాంగణం అందుబాటులోకి వస్తే ధాన్యం తరలింపు ఊపందుకోనుంది.

ఉపాధి హామీ పథకాన్ని పునర్ వ్యవస్థీకరించాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి కమిటీ అభిప్రాయం
- పలు రాష్ట్రాల్లో ఉపాధి హామీ అమలును పరిశీలించిన బృందం

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో పునర్‌వ్యవస్థీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. ఈ పథకం ద్వారా చేపట్టే పనులు ప్రయోజనకరంగా ఉండేలా మార్పులు, చేర్పులు చేయాలని సూచించింది. కూలీలకు ఉపాధి కల్పనతో పాటు వివిధ రూపాల్లో 'సంపద సృష్టి'కి ఈ పథకాన్ని అనుసంధానించాలని, దేశవ్యాప్తంగా పేదరికమున్న బ్లాకుల్లో నీటి వనరుల పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టాలని సిఫార్సు చేసినట్టు తెలుస్తోంది. నాణ్యతతో కూడిన ఆస్తుల కల్పనకు రాష్ట్రాలు ఈ పథకంలోని మొత్తం నిధుల్లో 70శాతం కేటాయించి, 30శాతం నిధులు మిగతాచోట్ల వ్యయం చేయాలని కేంద్రానికి సిఫార్సు చేసినట్టు సమాచారం. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన పనులను అమలు చేయకుండా ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకు చర్యలు చేపట్టాలని సూచించింది. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 7,245 బ్లాకుల్లో... నీటికొరత అధికంగా ఉన్న రెండున్నర వేల బ్లాకులు, అత్యధికంగా పేదరికం ఉన్న వెయ్యి బ్లాకుల్లో కూలీలకు ఉపాధికల్పనతో పాటు ఆస్తుల సృష్టికి ఈ పథకాన్ని అనుసంధానించాలని సూచించినట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఉపాధి హామీ పథకంతో మరిన్ని ప్రయోజనాలు పొందేందుకు చేయాల్సిన మార్పుచేర్పుల సలహాల నిమిత్తం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ నిపుణుల కమిటీని నియమించింది. శాఖ మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలోని తొమ్మిదిమంది సభ్యుల బృందం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో సహా ఛత్తీస్‌గఢ్, బిహార్, యూపీ, అస్సాం, గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ అమలు తీరును పరిశీలించింది. ఉపాధి పనుల డిమాండ్‌కు కారణాలు, అమలులో వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విభిన్న పద్ధతులు వంటి వాటిపై ఈ బృందం అధ్యయనం చేసింది. ఆయా పనులు, అవసరాల డిమాండ్‌కు తగ్గట్టుగా ఈ పథకం పునర్ వ్యవస్థీకరణతో పాటు ప్రతి గ్రామీణ కుటుంబానికి వందరోజుల 'అన్ స్కిల్డ్'పని కల్పించేలా భరోసా వంటి అంశాలను ఈ బృందం పరిశీలించింది. కాగా, పనుల పరిశీలన సందర్భంగా.. లైవ్ లొకేషన్‌లో మొబైల్ యాప్ ద్వారా కూలీల అటెండెన్స్ నమోదు, ఆధార్ ఆధారిత పేమెంట్స్ తప్పనిసరి వంటి కొత్త నియమ, నిబంధనల అమలుపై కూడా ఈ కమిటీకి ఫిర్యాదులు అందినట్టు సమాచారం.

అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షలు!

- రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర ఎన్నికల సంఘం బృందం
- నేడు సీఈఓ, పోలీసు నోడల్ అధికారులతో సమీక్ష
- శుక్ర, శనివారాల్లో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం బృందం ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పర్యటించి శాంతిభద్రతల పరిస్థితులతో పాటు ఎన్నికలకు సన్నద్ధతను పరిశీలించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ నేతృత్వంలో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు, ఇతర అధికారుల బృందం బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వీరికి ఘన స్వాగతం పలికారు. సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్ కుమార్, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఆర్‌కే గుప్తాతో పాటు ఇతర అధికారులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లపై గురు, శుక్ర, శనివారాల్లో మూడు రోజుల పాటు వరుస సమీక్షలు నిర్వహించనుంది. సీఈఓ వికాస్‌రాజ్, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి, కేంద్ర సాయుధ బలగాల నోడల్ అధికారితో గురువారం బుద్ధభవన్‌లో సమావేశమై ఎన్నికలకు భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై చర్చించనుంది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఐటీ, ఎస్ఎల్‌సీబీ, ఎక్సైజు, జీఎస్టీ, సీజీఎస్టీ, ఈడీ, ఎస్ఎల్‌బీసీ, డీఆర్ఐ, ఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, కమర్షియల్ ట్యాక్స్ వంటి విభాగాలతో తదుపరి శుక్ర, శనివారాల్లో సమావేశం నిర్వహించనుంది. ఈసీ బృందం ఢిల్లీకి తిరిగి వెళ్లాక రాష్ట్రంలో పరిస్థితులు, ఎన్నికలకు సన్నద్ధతపై అధికారులకు నివేదిక సమర్పించనుంది. దీని ఆధారంగా ఎన్నికల నిర్వహణపై ఈసీ నిర్ణయం తీసుకోనుంది.

దశాబ్ది వేడుకల వేళనైనా.. కనికరించండి

- బదిలీల కోసం ఉపాధ్యాయ దంపతుల నిరీక్షణ
- 18 నెలలుగా ఎదురుచూపులే
- 13 జిల్లాల ఉపాధ్యాయ దంపతుల తీరని వ్యథ
- ఖాళీలు ఉన్నా బదిలీకి నోచుకోని వైనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల వేళనైనా తమపై కనికరించి బదిలీలకు మోక్షం కలిగించాలని 13 జిల్లాల్లోని ఉపాధ్యాయ దంపతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 20 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల స్పౌజ్ బదిలీలు జరిగినా, మిగతా జిల్లాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టారు. 18 నెలలు కావస్తున్నా అతీగతీ లేకపోవడంతో దశాబ్ది ఉత్సవ వేడుకలు జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలోనైనా ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు బదిలీల కోసం అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. మంత్రులను కలుస్తూ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అదే సమయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు గోడు వివరిస్తున్నప్పటికీ 13 జిల్లాల్లో నిలిచిపోయిన ఉపాధ్యాయ దంపతుల బదిలీలకు మాత్రం మార్గం సుగమం కావడం లేదు.



జిల్లాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ...

దాదాపు అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతుల బదిలీలు జరపడానికి అవసరమైన ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు సూర్యాపేట జిల్లాలో 21 మంది ఎస్జీటీలు స్పౌజ్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా, ఆ జిల్లాలో సుమారు 300 ఎస్జీటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అలాగే సంగారెడ్డి జిల్లాలో కేవలం 5గురు మాత్రమ స్పౌజ్ బదిలీ కోసం దరఖాస్తు పెట్టుకున్నారు, కానీ అక్కడ వందల సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. స్పౌజ్ బదిలీలు జరగని మిగతా జిల్లాలైన వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మేడ్చల్, సిద్దిపేట, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, ఖమ్మం జిల్లాల్లో కూడా దాదాపు ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. మిగిలిపోయిన 13 జిల్లాల్లోని స్పౌజ్ ఖాళీలను భర్తీ చేయడానికి విద్యాశాఖ ఎందుకు ఆసక్తి చూపడం లేదో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ దంపతులు ఆందోళన చెందుతున్నారు.

భర్త ఓ చోట... పిల్లలు మరోచోట

స్పౌజ్ బదిలీలు జరగకపోవడంతో మహిళా ఉపాధ్యాయుల బాధలు వర్ణణాతీతం. భర్త ఒకచోట, భార్య మరో చోట.. చదువుల కోసం పిల్లలు హైదరాబాద్‌లోనో.. ఉండాల్సి రావడంతో ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొందని మహిళా ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. గడిచిన 18 నెలలుగా బదిలీల కోసం ఎదురు చూస్తున్న వారు కనీసం దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా తీపి కబురు అందుతుందని ఆశిస్తున్నారు.

మానవ అక్రమ రవాణాపై హైకోర్టు ఆందోళన

సాక్షి, హైదరాబాద్: విచ్చలవిడిగా జరుగుతున్న మానవ అక్రమ రవాణాను అరికట్టి చిన్నారులను కాపాడటమే కాకుండా, అనంతరం వారికి సరైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానికి ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. రోజురోజుకూ పెరిగిపోతున్న మానవ అక్రమ రవాణాపై ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బాలల సంక్షేమ కేంద్రాల పనితీరు, నిరుపేదల సంక్షేమానికి సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని శిశు సంక్షేమ కేంద్రాల పనితీరు, వాటి పరిస్థితిపై తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) నివేదికను ధర్మాసనానికి న్యాయవాది అనిల్‌కుమార్ అందజేశారు. రెస్క్యూ హోంలలో కనీస వసతులు కల్పించి, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం ఆ మేరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పిటిషనర్ ప్రజ్వల తరఫున న్యాయవాది దీపక్ మిశ్రా వాదించారు. 2014లోనే హైకోర్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శిశు సంక్షేమ కేంద్రాలను తనిఖీ చేసేందుకు కమిటీని నియమించినట్లు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వెల్లడించారు. ఆ నివేదిక అనంతరం కేంద్రాల పనితీరు.. చట్ట ప్రకారం సంరక్షణ చర్యలు చేపట్టడం కోసం కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనంతరం ఈ కేసులో అమికస్‌క్యూరీ డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలను ధర్మాసనం విన్నది. తదుపరి వాదనల కోసం విచారణను జూలై 20కి వాయిదా వేసింది.



ప్రతి రోజూ మేల్కొనడం... కొంచెం జన్మించడం,
ప్రతి తాజా ఉదయం... కొంచెం యవ్వనం,
ప్రతి రాత్రి నిద్రకు ఉపక్రమించడం... కొంచెం మరణం.
– హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 22 జూన్ 2023

ఎట్టకేలకు ఒక ముందడుగు!

ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు... ఒకదానిపై మరొకదానికి ఒంటి నిండా అనేక అనుమానాలు, అపనమ్మకాలు. అలాంటి దేశాలు కూర్చొని చర్చించుకుంటే అది పెద్ద విశేషమే. అమెరికా, చైనాల మధ్య ఈ వారం అదే జరిగింది. అస్తుబిస్తుగా ఉన్న తమ సంబంధాలను చక్కదిద్దుకొనేందుకు అవసరమైన ఒక అడుగు ముందుకు వేశాయవి. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తాజా చైనా పర్యటన అనేక విధాల గుర్తుండిపోయేది అందుకే. 2018 తర్వాత గడచిన అయిదేళ్ళలో అమెరికా విదేశాంగ మంత్రి ఒకరు చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా చివరిరోజైన సోమవారం సాక్షాత్తూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సైతం బ్లింకెన్ సమావేశమై, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ కోసం ప్రయత్నించడం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపింది.

అరుదైన ఈ పర్యటనలో కళ్ళు చెదిరే కీలక ప్రకటనలేవీ లేకపోవచ్చు. కానీ, అసలంటూ ఘర్షణ వాతావరణాన్ని ఉపశమింపజేసి, తమ మధ్య సంబంధాలను సమస్థితికి తీసుకురావాలని రెండు దేశాలూ అంగీకరించడమే అతి పెద్ద వార్త అయింది. పరస్పరం నిష్కర్షగా అభిప్రాయాలు పంచుకొన్న ఈ చర్చలు భవిష్యత్తు పట్ల ఆశలు రేపాయి. నిజానికి, మునుపటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాం నుంచి కొన్నేళ్ళుగా అమెరికా తన దూకుడు చర్యలతో డ్రాగన్‌కు కోపం తెప్పించింది. ఫలితంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. మళ్ళీ గాడిన పెట్టాలనుకున్నా, ఫిబ్రవరిలో గగనతలంలో పయనిస్తూ భారీ బెలూన్ అమెరికాలో కనిపించేసరికి వ్యవహారం ముదిరింది. చైనా బెలూన్ గూఢచర్యానికి పాల్పడుతోందంటూ ఆరోపణలు మిన్నంటాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బాహాటంగానే చైనాను తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో బ్లింకెన్ తాజా చైనా పర్యటన, సత్సంబంధాల పునరుద్ధరణ ప్రయత్నం ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఒక విధంగా– బీజింగ్‌తో సంభాషణ వాషింగ్టన్ ఏరికోరి ఎంచుకున్నది కాదు. తప్పనిసరి అనివార్యత. తాజా సంభాషణల్లో సైతం బీజింగ్ తన మూతి బిగింపు పూర్తిగా వీడినట్టు లేదు. ఆ దేశం కాస్తంత నిష్ఠురంగానే ఉన్నా వైట్‌హౌస్ వర్గం తమ పని తాము కొనసాగించక తప్పదు. స్వీయ ప్రయోజనాల రీత్యా డ్రాగన్‌తో మాటామంతీ కొనసాగింపే అమెరికాకు ఉన్న మార్గం. కొద్ది వారాలుగా ఈ ప్రయత్నాలు కాస్త ముమ్మరించాయి. చైనాకు చెందిన అగ్ర దౌత్యవేత్త వాంగ్ యీతో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ గత నెల వియన్నాలో రెండు రోజులు ''నిర్మాణాత్మక'' సమావేశాలు జరపడాన్ని ఈ దృష్టితోనే చూడాలి. ఫలితంగా అమెరికా వాణిజ్య కార్యదర్శి, చైనా వాణిజ్య శాఖ మంత్రితో అమెరికాలో మాట కలిపేందుకు తలుపులు తెరుచుకున్నాయి. ఇక, మధ్యశ్రేణి అమెరికన్ అధికారులు బీజింగ్‌లో పర్యటించారు. అమెరికా గూఢచారి విభాగం సీఐఏ డైరెక్టర్ సైతం సద్దు లేకుండా చైనా సందర్శించిన సంగతి మర్చిపోలేం. దీన్నిబట్టి భౌగోళిక రాజకీయాలకు అతీతంగా డ్రాగన్‌తో దోస్తీకి అగ్రరాజ్యం చేయిచాస్తోందని అర్థమవుతోంది.

బంధాలు మెరుగుపడడం దేవుడెరుగు, కనీసం మరింత క్షీణించకుండా ఆపడానికి బ్లింకెన్ పర్యటన ఉపకరిస్తుంది. తక్షణ ప్రయోజనాలు ఆశించలేం కానీ, చైనా విదేశాంగ మంత్రితో, అగ్ర దౌత్యవేత్తతో 'నిక్కచ్చిగా' సంభాషణలు సాగడంతో, ఆఖరి రోజున డ్రాగన్ దేశాధినేతతో బ్లింకెన్ భేటీకి మార్గం సుగమం అయింది. రానున్న రోజుల్లో ఇది రెండు అగ్రరాజ్యాల అధినేతల మధ్య భేటీకి దారి తీయగలదని ఆశించడానికి వీలు కలిగింది. సైనిక ఘర్షణ ముప్పును తగ్గించుకోవాలని రెండు దేశాలూ ఒకే ఆలోచనకైతే వచ్చాయి. ఈ దిగ్గజ దేశాల మధ్య బంధం సుస్థిరంగా ఉండడం ప్రపంచ శాంతికి సైతం అవసరం. నిజానికి, చైనా ఆశలు, ఆకాంక్షలు అపరిమితమే అయినా, షీ మాత్రం విశ్వనేతగా అమెరికా స్థానంలోకి రావాలనే ఆలోచన, వ్యూహం తమకు లేదని చెబుతున్నారు.

చైనా తనదిగా ప్రకటించుకొనే స్వయంపాలిత ద్వీపం తైవాన్‌కు వచ్చే ఏడాది ప్రథమార్ధంలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. తైవాన్‌పై డ్రాగన్ వేసే అడుగులను గ్రహించడంలో అంచనాలు తప్పితే ప్రమాదం తప్పదన్న తెలివిడి అమెరికాకు ఉంది. అందుకే, సంబంధాల మెరుగుదలకు, మరీ ముఖ్యంగా సైనిక చర్చల పునరుద్ధరణకు వాషింగ్టన్ తహతహలాడింది. కానీ, తమ రక్షణ మంత్రిపైన అమెరికా ఆంక్షలు కొనసాగుతున్న వేళ బీజింగ్ అందుకు ఇష్టపడలేదు. అమెరికా మరింత స్పష్టమైన చర్యలతో, సంకల్పంలో నిజాయతీ ఉందని నిరూపించుకొనేలా ముందుకు రావాలని చూస్తోంది. ఆ మాటకొస్తే, గతంలో తనకూ, బైడెన్‌కూ మధ్య కుదిరిన ఒప్పందాల పైనే ఇరుపక్షాలూ ఇంకా చర్యలు చేపట్టాల్సి ఉందని బ్లింకెన్‌కు షీ గుర్తు చేశారు.

రానున్న నెలల్లో పరిణామాల్ని బట్టి, షీ– బైడెన్‌ల శిఖరాగ్ర సమావేశానికి అవకాశాలుంటాయి. సొంతగడ్డపై రాజకీయ ఒత్తిళ్ళ రీత్యా చైనాపై కఠిన వైఖరిని బైడెన్ సర్కార్ ఏ మేరకు మార్చుకోగలుగుతుందన్నది సందేహమే. అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రచారం దగ్గరవుతున్న వేళ బైడెన్‌కు అది మరీ కష్టం. అయితే, భౌగోళిక రాజకీయాల్లో పొరపొచ్చాలెన్ని ఉన్నా, ప్రపంచ కుగ్రామంలో ఆర్థిక అనివార్యతలే కీలకమనే స్పృహ ఈ అగ్రశక్తులు రెంటికీ పుష్కలం. అదే ఇప్పుడు ఇరు పక్షాల మధ్య అపనమ్మకాన్ని వదిలించుకొనే మాటలకు దృశ్యాదృశ్య హేతువు. పరిమిత సహకారం, ఉద్రిక్తతల్లో కొంత ఉపశమనం సరిపోతాయా? చెప్పలేం. కానీ, నిరంతర సంభాషణలకు సిద్ధంగా ఉన్నామన్న ఈ సంకేతమే గనక ఇవ్వకుంటే, విశ్వశాంతికి కీలకమైన బంధాన్ని చేతులారా చెడగొడుతున్న బాధ్యతారహిత పెద్దన్నలనే ముద్ర మిగిలిపోతుంది. ఆ ఎరుక అమెరికా, చైనాలకు దండిగా ఉంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.చవితి ప.2.46 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.2.21 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.1.54 నుండి 3.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.44 వరకు తదుపరి ప.3.05 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** రా.12.54 నుండి 2.21 వరకు.

సూర్యోదయం: 5.30
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

త్యాగాల వెలుగు దీపిక

సందర్భం



జూలూరు గౌరీశంకర్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులు ఇవాళ ప్రతి తెలంగాణవాసికీ ప్రాతఃస్మరణీయులు. వారు ఏ ఆకాంక్షలతో, కలలతో ఆత్మ బలిదానాలు చేసుకున్నారో వాటిని సాకారం చేసేందుకు స్వరాష్ట్రం ఇప్పటికే పని ప్రారంభించింది. అదే సమయంలో తెలంగాణ అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికీ పెద్దపీట వేసి స్వరాష్ట్ర సాధనలో నేలకొరిగిన అమరుల నుంచి స్ఫూర్తి పొందడానికి నిత్యం జ్వలించే 'అమర జ్యోతి'ని ప్రభుత్వం నిలిపింది. రాష్ట్ర పరిపాలనా కేంద్రం సచివాలయం ఎదురుగా దీన్ని నెలకొల్పడం ప్రశంసనీయం. అమరుల త్యాగానికి ఇది నిలువెత్తు రూపం. స్మృతి వనంలోని ఈ జ్యోతి భవిష్యత్ తరాలకు వెలుగు దీపిక. మనకాలంలో మనమందరమూ పాల్గొని విజయం సాధించిన ఒక మహోద్యమానికి ప్రతీక!


దీపం జ్యోతి పరబ్రహ్మ – అంటే దీపం దైవంతో సమానం అని అర్థం. 'తమసోమా జ్యోతిర్గమయ' అంటే చీకటిని చీల్చుకుని వెలుతురు ఉదయిస్తుందని భాష్యం. ఏ వెలుగు కోసమైతే మనుషులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా ఎంచి ఆహుతి అయిపోయారో ఆ వెలుగు, ఆ త్యాగాన్ని స్మరించుకుని, ఆ త్యాగం నుండి స్ఫూర్తి పొందడానికి వెలిగించే జ్యోతి 'అమర జ్యోతి'. దానిని నిలపడమంటే త్యాగధనులకు మనం ప్రకటించే కృతజ్ఞత మాత్రమే కాదు, మన బాధ్యతను నెరవేర్చడం కూడా.

తెలంగాణ నేలతల్లి రుణం తీర్చుకునేందుకు నేలకొరిగిన వీరుల త్యాగాలను మననం చేసుకుంటూ, వారికి నివాళులర్పిస్తూ తెలంగాణ సమాజం వందనం చేస్తోంది. అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవడానికీ, ఆ త్యాగాల నుంచి స్ఫూర్తి పొందడానికీ 'అమరజ్యోతి'ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ జ్యోతి ఉన్న 'స్మృతి వనం' తెలంగాణ అస్తిత్వ ఉద్యమ కాంతులను ఎగజిమ్ముతోంది. ఈ స్మారక స్థలం త్యాగధనులను మననం చేసుకుంటూ భవిష్యత్ తెలంగాణను నిర్మించుకునేందుకు ప్రతినబూనే ప్రతిజ్ఞాస్థలం. తెలంగాణ రాష్ట్రం కోసం అమరత్వాన్ని ముద్దాడి అమరులైన వీరులారా, ఆత్మబలిదానాలు చేసుకుని ఆదర్శంగా నిలిచిన యోధులారా, మిమ్ములను ఎప్పటికీ ఈ మట్టి మరిచిపోదని చాటిచెబుతూ అమరుల త్యాగాల చిహ్నంగా అమరజ్యోతి నిర్మాణం జరిగింది. తెలంగాణ సమాజం మీ త్యాగాలను నిత్యం మననం చేసుకుంటూ ముందుకు సాగుతుంది.

1969 ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో నేలకొరిగిన వీరులను తలచుకుంటూ రగిలిన మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన మహోద్యమంలో అసువులు బాసిన వారి అమరత్వానికి ప్రతీకగా అమరజ్యోతిని నిర్మించుకోవడం గర్వించదగినది.

అమరులు కన్నుమూసి మన కళ్ళ ముందు దీపాలు వెలిగించారు. ఆ దీపాల మహాజ్యోతే ఈ అమరజ్యోతి. ఇవ్వాళ ఎన్నెన్నో కొత్త ఆలోచనల విత్తనాలు, నూతన భావ సంఘర్షణలు, ఉద్యమకలలు, ఉద్వేగాలు, దేదీప్యమానంగా అమరజ్యోతిలో ప్రతిఫలిస్తున్నాయి. అమరులను స్మరించుకోవటం చారిత్రక కర్తవ్యంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. వారిని తలచుకోవడం మనందరి బాధ్యత, కర్తవ్యమని గుర్తుచేస్తూ తెలంగాణ ప్రభుత్వం అమరుల త్యాగాలను గుండెనిండా నింపుకుని భవిష్యత్ తెలంగాణను పునర్నిర్మించుకుంటుందని చెప్పడానికి వెలుగుతున్న అమరజ్యోతే సాక్ష్యం. తెలంగాణ ప్రభుత్వం అమరజ్యోతిని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. అమరులకు మొత్తం తెలంగాణ సమాజమే తలవంచి నివాళులర్పిస్తూ, వందనాలు తెలియజేస్తోంది.

తెలంగాణ నేల మీద ఎన్నెన్నో పోరాటాలు జరిగాయి. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. ప్రపంచానికే మహత్తర



సందేశం అందించిన మానవీయ పోరాటాలు ఈ మట్టిపై జరిగాయి. ప్రపంచ అస్తిత్వ ఉద్యమాల చరిత్రలో మరువలేని మహత్తర దీర్ఘకాలిక శాంతియుత ఉద్యమం తెలంగాణ రాష్ట్రసాధన పేరున జరిగింది. ఇది మన కాలంలో మనందరం పాల్గొని, ఒక్కతాటిపై నడిచి విజయం అంచుల వరకు చేరి స్వరాష్ట్రం సాధించుకున్న చరిత్ర. ఈ ప్రపంచీకరణ కాలమే అబ్బురపడే విధంగా చెరగని చరిత్రగా నిలిచిపోతుంది. నీళ్ళు, నిధులు, నియామకాల కోసం ఎగిసిన స్వరాష్ట్ర ఉద్యమం 14 ఏళ్ళు శాంతియుతంగా కొనసాగింది. 2009 డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్రం ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటన తర్వాత సీమాంధ్రకు చెందిన టీడీపీ, కాంగ్రెస్ నేతలు యూ టర్న్ తీసుకున్నాక కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగటంతో తెలంగాణ అగ్నిగుండంగా మారింది. తెలంగాణ గుండె గాయపడింది. కేసీఆర్ నిరాహారదీక్షకు మద్దతుగా తెలంగాణ అంతా ముక్తకంఠంతో గర్జించింది. ఎల్‌బీ నగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి 'జై తెలంగాణ' అని నినదిస్తూ ఆత్మబలిదానానికి సిద్ధపడి తన ఒంటికి నిప్పంటించుకుని అమరత్వాన్ని పొందారు. కేసీఆర్ గుక్కపట్టి ఏడ్చారు. ఏ పిల్లల భవిష్యత్తు బాగుండాలని స్వరాష్ట్ర ఉద్యమాన్ని చేస్తున్నారో ఆ పిల్లలే ఆత్మబలిదానాలకు పాల్పడడంతో తెలంగాణ గుండె తల్లడిల్లింది. కేసీఆర్ ఆత్మబలిదానాలు వద్దని మొరపెట్టుకున్నారు. అయినా తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో ఆత్మబలిదానాలు కొనసాగాయి. ఉస్మానియా యూనివర్సిటీలో మెయిన్ గేటు దగ్గర యాదయ్య తన ఒంటికి నిప్పంటించుకుని బలయ్యారు. కానిస్టేబుల్ కిష్టయ్య రివాల్వర్‌తో కాల్చుకుని నేలకొరిగారు. ఇటువంటి త్యాగాలు స్వరాష్ట్ర ఉద్యమంలో చాలా చోటుచేసుకున్నాయి. కేసీఆర్ ఒక పక్క తన శాంతియుత ఉద్యమాన్ని కొనసాగిస్తూ, ఆత్మబలిదానాలు వద్దని యువతకు పదేపదే విన్నవించుకుంటూ బిడ్డలు నేలరాలుతున్న తీరును చూసి తల్లడిల్లిపోయారు. కన్నీటి ప్రవాహాలు, ఆవేదనలు, ఆందోళనలు, జనప్రళయ ప్రభంజనాలను ప్రజాఉద్యమాలుగా మలచుకుంటూ ముందుకు సాగడంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది.

స్వరాష్ట్ర స్వప్నం సాకారం చేసుకున్న తర్వాత మొదటి తెలంగాణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తూ కేసీఆర్ తొలి అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకుని అమరత్వం పొందిన వారిని మననం చేసుకుని, వారి త్యాగాలకు గుర్తుగా బంగారు తెలంగాణ నిర్మించేందుకు ముందుకు సాగుదామని ప్రతిన తీసుకున్నారు. ప్రజలంతా ముక్తకంఠంతో ఎలా ఉద్యమించి కదిలారో వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తెలంగాణ పునర్నిర్మాణాన్ని కొనసాగిస్తానని తొలి తెలంగాణ ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసింది. ఆ దిశగానే అడుగులు వేస్తూ ముందుకు సాగింది.

ఇదే క్రమంలో 9 ఏళ్ళలో తెలంగాణ అన్ని రంగాలలో ప్రగతిని సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రసాధన ఉద్యమాన్ని ప్రజా హృదయాలలో చెదరని ముద్రగా నిలపడానికి అమరజ్యోతి సాక్షిగా నూతన సచివాలయాన్ని నిర్మించుకుని దానికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టుకోవడం ముదావహం. ఎవరూ ఊహించని విధంగా మన తెలంగాణ ఖ్యాతిని దిగ్దిగంతాలకు వినిపించే విధంగా అద్భుత మహాసౌధంగా రాష్ట్ర సచివాలయాన్ని నిర్మించుకోవడం గొప్ప అనుభూతినిస్తోంది. సరిగ్గా సచివాలయానికి ఎదురుగా ప్రతి నిత్యం అమరుల త్యాగాలను గుర్తుచేసే విధంగా అఖండమైన అమరజ్యోతిని కేసీఆర్ ఏర్పాటు చేయడం ఆయన దార్శనిక ఆలోచనలకు నిదర్శనం.

2001 ఏప్రిల్ 27న ఏ ప్రదేశంలోనైతే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవటమే ఏకైక లక్ష్యమని కేసీఆర్ ప్రకటించారో, ఆ 'జలదృశ్యం' లోనే త్యాగమూర్తుల స్మారక మహారూపాన్ని ప్రతిష్ఠించుకోవటం జరిగింది. నాలుగు కోట్ల మంది తెలంగాణీయులు అమరుల త్యాగాలను మననం చేసుకునే మహాస్థలిగా అమర మహాజ్యోతి ఇక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అసెంబ్లీ కెదురుగా గన్ పార్కులో ఉన్న అమరవీరుల స్తూపం దగ్గర ప్రతిన తీసుకుని కదిలిన ఉద్యమం... తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని, ఇప్పుడు అమర జ్యోతిని నిర్మించుకుంది. ఈ అమరజ్యోతి నిర్మాణం కేవలం తెలంగాణకే కాకుండా ప్రపంచంలోని అస్తిత్వ ఉద్యమాల చరిత్రకే మకుటాయమానంగా నిలుస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద భారీ అంబేడ్కర్ విగ్రహం చూపే చూపుడువేలు సాక్షిగా తెలంగాణ సమాజం ముందుకు సాగాలని అమరజ్యోతి మనకు దారిదీపంలా తోవ చూపుతోంది.

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్
(నేడు తెలంగాణ అమరుల స్మృతివనం – 'అమరజ్యోతి' ప్రారంభం)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

చంపేశాయా?



ఆస్ట్రేలియా క్రికెట్ లెజెండ్ షేన్ వార్న్ హఠాత్తుగా మరణించడానికి తొమ్మిది నెలల ముందు తీసుకున్న కోవిడ్ ఎంఆర్ఎన్ఏ టీకాలే ఆయన గుండెపోటును వేగవంతం చేసి వుంటాయని ఇద్దరు ప్రముఖ కార్డియాలజిస్టులు చెబు తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం!
– టోబీ యంగ్, యాక్టివిస్ట్

అనకూడని మాటలు



ఏ అకౌంటునైనా లక్ష్యంగా చేసుకుని మళ్లీ మళ్లీ వేధిస్తే, ఆ వేధింపు అకౌంట్లు కనిష్ఠంగా తాత్కాలిక సస్పెన్షన్లను అందుకుంటాయి. 'సిస్' లేదా 'సిస్ జెండర్' (జన్మతః వచ్చిన లింగం) అనే మాటలు ట్విట్టర్ వేదిక మీద దూషణలుగా పరిగణించబడతాయి.
– ఎలాన్ మస్క్, ట్విట్టర్ అధినేత

యథా రాజా...



చైనా ప్రభుత్వ అధికారులు ఎక్కడున్నా చాలా మర్యాదస్థులుగా ఉండేవారు. మీరు వాళ్లను చికాకుపెట్టినా కూడా మర్యాదగా, అణకువగా వ్యవహరించేవాళ్లు. కానీ షీ జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ 'ఉల్ఫ్ వారియర్ డిప్లొమసీ' (తోడేలు యోధ దౌత్యం) మొదలైంది. వాళ్ల ప్రవర్తనలో కూడా విపరీతమైన దురుసుతనం పెరిగింది.
– జాన్ సింప్సన్, బ్రాడ్‌కాస్టర్

ముఖం వెలిగింది



పన్నెండో తరగతి పరీక్షలు రాశాను. ఇంగ్లిష్ పేపర్ ఇవ్వాళ... అందులో 'విదేశంలో చదువుతున్న మిత్రుడికి మామల్లపురంలో 44వ చెస్ ఒలింపియాడ్ ఎలా జరిగిందో వివరించండి' అన్న ప్రశ్న కనబడటం సంతోషం కలిగించింది. (పోటీల జ్యోతి వెలిగించిన ఇద్దరిలో ప్రజ్ఞానంద ఒకరు.)
– ఆర్. ప్రజ్ఞానంద, చెస్ గ్రాండ్‌మాస్టర్

వాళ్లే నిర్ణయిస్తారా?



నేను 'సిస్' అనే మాటను తిరస్కరిస్తాననీ, అలా నన్ను పిలవొద్దనీ నిన్న ఒక ట్వీట్ చేయగానే, ట్రాన్స్ యాక్టివిస్టుల నుంచి నన్ను 'సిస్సీ' అంటూ, 'నచ్చినా నచ్చకపోయినా' అలాగే పిలుస్తామంటూ వరుసగా సందేశాలు వచ్చాయి. ఇవే పాత్రలు తారుమారైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి.
– జేమ్స్ ఎస్సెస్, కామెంటేటర్

యోగా మంచిదేగా!



రన్నింగ్ చేసిన తర్వాత మేము (భార్యతో కలిసి) కొన్ని యోగాసనాలు ప్రయత్నించాం. యోగా వల్ల బహువిధ ఆరోగ్య లాభాలున్నాయి. మీ వ్యాయామ దినచర్యలో, మీ మొత్తం జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోండి. (జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం)
– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఎక్కడున్నారు?



భారత స్త్రీవాద ఉద్యమం 1980ల్లో వరకట్న మరణాలకు వ్యతిరేకంగా మొదలైంది. ఇప్పుడు ఎవరూ వాటి గురించి మాట్లాడటం లేదు. స్త్రీవాదులందరూ చిన్న అంశాలైన లైంగికత, మీ టూ, ఎంపిక... ఇలాంటివే మాట్లాడుతున్నారు. కానీ ఇప్పటికీ మహిళలు ఎక్కువ హింసను గృహసంబంధ అంశాల్లోనే ఎదుర్కొంటున్నారు. అయినా దేశంలో స్త్రీవాద ఉద్యమమే లేనప్పుడు స్త్రీవాదులు వీటి గురించి మాట్లాడటం లేదనడం అర్థరహితం.
– సంజుక్తా బాసు, పాత్రికేయురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కవిత



బి. నరసింగరావు

అంతరంగ గానం...

ఒకానొక పెద్ద విగ్రహం
ఒకానొక పెద్ద హర్మ్యం
అట్టడుగు వర్గాల చేతులకు
రెండు డ్రమ్ములు వాయించుకోవడానికి
తాంబూలాలిచ్చాం తన్నుక చావండి
ఇక తన్నుక చావడం ఒకరిపని
తమాషా చూడడం మరొకరి పని

గతంలో రాజులు ఇతర రాజ్యాల మీద
దండయాత్రలు చేసిందెందుకు
భూ భాగం... ధనాగారం...అంతఃపుర స్త్రీలు

నేటి రాజకీయ రాజుల మనోగతం
అధికారం... కీర్తిప్రతిష్ఠలు... సంపద

ఈ దేశంలో ప్రతి ఐదేళ్లకొకసారి వచ్చే
ఎన్నికలలో పనిచేసే మంత్రం
అభివృద్ధి... అభివృద్ధి... అభివృద్ధి
జనం నుండి ముక్కు పిండి
వసూలు చేసే పన్నులే
ప్రభుత్వం చేతుల్లో గలగలలాడే సంపద

ప్రజలపై ఖర్చుపెట్టేది ఖర్చుపెట్టి
మిగతాది వెనకేసుకోవడం
ప్రజల కోసం ఖర్చు చేసిందానికిగాను
వాళ్ళ నుంచి మెప్పు పొందితే
మళ్ళీ ఐదేళ్ళ పాలన గ్యారంటీ

మతాలను విభజించు
కులాలను విభజించు
కుటుంబాలను విభజించు
ఇక జయ్యత్ గా పాలన కొనసాగించు

లింకన్ ఏమన్నాడు "ప్రజల నుండి...
ప్రజల కొరకు... ప్రజల చేత"

ఇక్కడ ప్రజల వ్యక్తిత్వాలకు సజీవ సమాధి
ఇక్కడ వెలువడే ప్రతి దివ్యమైన ఆలోచన
ఒకే ఒక్క దివ్యమైన మేధస్సులోంచి

మీరు మాట్లాడితే ముళ్ళకంప...
మాట్లాడక పోతే మళ్ళీ టికెట్...
ఇదేక్రమం... ఇదే మీ విజయసూత్రం
జపించండి! తపించండి!!

మళ్ళీ మళ్ళీ వస్తా... ఐదేళ్ళకోసారి ఓట్లడుగుతా
వొట్టిగకాదు! అభివృద్ధి చూపించి..!
నా ముఖం చూసి నన్ను గెలిపించండి
పరిపాలించడంలో వెన్నుచూప...
మీరంతా తినండి... తాగండి
ఆర్. ఆర్. ఆర్. లు 'బలగా'లు చూపిస్తాం

రాష్ట్రం సాధించగలిగితే
ఎవ్వడినైనా కౌగిలించుకుంటానని
ఒకప్పుడన్నా!
సాధించి చూపించిన!
ఇప్పుడు మాత్రం నా దరిదాపుల్లోకి
ఎవ్వరూ రావొద్దు

నేను ఒంటరిగా వనాలలో
గడిపే సమయమంతా
మీ అభివృద్ధి ఎలా కొనసాగించాలి
అనే ఆలోచనలతో గడుపుతా
గతంలో బండ్ల కొద్ది పుస్తకాలు చదివిన
ఇప్పుడు రాజ్యం ఏలడానికి
కొత్త రాష్ట్రాన్ని ముందుకు తీసుకపోవడానికి
అవ్వి ఎంతో ఉపయోగపడుతున్నాయి

నాకొచ్చే గొప్ప గొప్ప ఆలోచనలను
గొప్పగానే సమాజం కోసం ప్రవేశపెడతా
దాంతో నగరాలు వెలిగిపోతోంటాయ్!
గ్రామాలు తెలివి మీరిపోతోంటాయ్

ఎవరో ఒకరు అవినీతి గురించి
మాట్లాడుతూనే ఉంటారు
అది గిట్టని వాళ్ళు చేసే పని
నేను నిరంతరం మీ గురించి
పనిచేస్తూనే పోతూ ఉంటా

'పరిపాలన' భవిష్యత్ లో ఎలా అని
ఆందోళన చెందకండి
మా ఇంట్లో ఇప్పటికే అరడజను మంది
రాజకీయ నాయకులున్నారు
ఇంకొక పాతికేళ్ళ వరకు
మీరు ఇంకొకరి కోసం వెతకనవసరం లేదు

మా కుటుంబ సభ్యులు నిరంతరంగా
అలుపుసొలుపు లెరగకుండా
మిమ్మల్ని పరిపాలిస్తూనే ఉంటారు
నిజాన్ని అబద్ధం
అబద్ధాన్ని నిజం చేయకపోతే
రాజకీయ చక్రం తిప్పడానికి వీలే కాదు
దాన్ని ఎవ్వరూ పట్టించుకోవొద్దు



డబ్బు! డబ్బు!! డబ్బు!!!
డబ్బుదేముంది కుక్కను కొడితే రాలుతుంది
మీరు డబ్బు గురించి బెంబేలు పడకండి
మీరు మీ తిండి తిప్పల గురించి ఆలోచించండి

రాజ్యాన్ని ఏలేవారు దేవుని బిడ్డలు
మీరేమి తక్కువ కాదు
మీరు వారి బిడ్డల బిడ్డలు... అంతే తేడా!
యజ్ఞయాగాలెందుకు చెయ్యొద్దు
వాస్తును ఎందుకు పాటించవద్దు

ఎవరో నడమంత్రపు గాళ్ళు
అట్లా విమర్శిస్తుంటారు

అత్యంత మేధాసంపత్తితో కూడిన
ఆలోచన మాది
ఐనా ఈ సంపదంతా మేము కట్టుకపోతామా
మహా అయితే ఏడుతరాలు

మాటి మాటికి మా గత చరిత్రని
పీకుతూ ఉంటారు
దాంతో వచ్చేది లేదు...పొయ్యేది లేదు
ప్రజాస్వామ్యం ఇలాగే ఉంటుంది
ప్రతి విషయంలో లోతుకు వెళ్ళకూడదు
తింటూ, కుడుస్తూ ఉంటే అది ప్రజాస్వామ్యమే!
ఎవర్నయినా బంగీలు తీయిస్తున్నమా?
లేకపోతే జైల్లల్ల పెడుతున్నమా?

అదే! మాటి మాటికి
జులూస్‌లు, ధర్నాలు, పికెటింగ్‌లు
నిరహార దీక్షలు
ఏమైంది! వీళ్ళ దిమాక్ ఖరాబైందా?

మతాలు కులాలు వర్గాలు
అరె! ఇయ్యాల్ల కొత్తగున్నయా యివ్వి!
జమాన నుంచి నడుస్తున్న కతలు యివ్వి
గిట్లనే కొట్లాటలు గిట్లాటలు గిట్ల అయితయని
పోలీసుల దండు బెంచిన
గడ్‌బడ్ జేస్తే ఊర్కుంటమా

మాట మాటకు లింకన్ లింకన్
అంటరేందయ్యా!
లింకన్‌ను గింకన్నూ
పాత సామానుల గదిలో గిరాటు వేయండి
ఎందుకంటే ఆ టైం ఈ టైం ఒకటైతదా?
ఈ మార్క్సులూ గీక్సులూ ఇప్పుడు పనికిరారు
జనానికి పనికొచ్చేది
ఒక్క మా ప్రభుత్వం మాత్రమే!

కోటరీలు గీటరీలు
జర్నలిస్టులు గిర్నలిస్టులు అంటుంటారు
కోటను రక్షించుకోవడానికి మా కెన్నో కావాలి
వాళ్ళు వీళ్ళు అన్న మాటలు విని మోసపోకండి
గోన పత్తరు మీరు
నేను ఏలుతున్న రాజ్యానికి ధీటైందాన్ని
ఒక్క రాష్ట్రాన్ని చూపించండి ఇండియాలో!

ఏది పాపం! ఏది పుణ్యం!!
ఇవన్నీ పాత చింతకాయ పచ్చడి మాటలు
మీరు మౌనంగా ఉంటే మీకెన్నో అనుకూలిస్తయి
అది మీకూ సుఖం... మాకూ సుఖం

అయ్యా ఏలినోళ్ళకు దండం
దొరా! అటు సూడుండ్లి ఒక్కపాలి

"కన్నీళ్లను, కలలను కాగడాలుగా మలిచి
పిల్ల బాటలను రహదారులుగా కలగని
తల్లిపొత్తిళ్ళలోంచి ఆకాశంలో కెగిసి
వెన్నెల పాలను తల్లిపాలను కలిపి తాగి

శబ్దాన్ని చీల్చి మరణ మృదంగం మ్రోగించి
ప్రజల శ్వాసని పసిగట్టి
శివంగుల్లాగా ముందుకు దూకి
ఆత్మ గౌరవమనే జెండాను
గుండెలనిండా ఎగరవేసి
తెలంగాణ మానస వీణ తీగల మీద
మేలిమి రాగాలను నేసి

గుండెలలో మెండుగా మందుగుండును దట్టించి
గొబ్బెమ్మ, ధూలా పాటలను ఆటలను ధ్వనించి
ప్రతి గుండెలో ఆనంద ధ్వనులను మ్రోగించిన
బిడ్డలు, అన్నలు, తమ్ముళ్ళు, తండ్రులు
మీ త్యాగాల ఫలితాలే
మేము అనుభవిస్తున్న వస్తు విషయాలు
జోహార్! జోహార్!! జోహార్!!!
వీరులకు, ధీరులకు, మా కలలను నెరవేర్చిన
కమలాలకు, బంతిపూలకు, తంగేడులకు...
జేజేలు తెలంగాణకు!
జేజేలు భారతావనికి!!


(బి. నరసింగరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలంగాణ పల్లె జీవితంలోని కష్టాలు, కన్నీళ్లు, దోపిడీ, దౌర్జన్యం, వెట్టి వంటి అనేక అంశాలను తన సినిమాల ద్వారా ప్రతిభావంతంగా ప్రపంచానికి తెలియచెప్పిన కళాకారుడు. ప్రపంచ సినీయవనికపై తెలంగాణకు ఒక గౌరవనీయ స్థానాన్ని కల్పించారు. దర్శకుడు, నిర్మాత, స్క్రీన్‌ప్లే రచయిత, నటుడు, కవి, స్వరకర్త, పెయింటర్... ఇలా అనేక పాత్రల్లో ఒదిగిపోయారు.)

మనోళ్లే మాడుతున్నారు

అధిక ఉష్ణోగ్రతల వల్ల 54 దేశాల్లో 117 కోట్ల మందికి ముప్పు

భారత్ సహా 9 దేశాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజలకు అధిక ముప్పు

వీరిలో అత్యధికంగా 32.3 కోట్ల మంది భారతీయులే



ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండల తీవ్రత నుంచి రక్షించుకోగలిగే శీతల సదుపాయాల్లేక కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ప్రమాదంలో జీవిస్తున్నారు. 54 దేశాల్లో 117 కోట్ల మంది ఈ ముప్పును ఎదుర్కొంటున్నట్లు 'సస్టైయినబుల్ ఎనర్జీ ఫర్ ఆల్' లెక్కతేల్చింది. ఇది 2022 నాటి అంచనా. ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ ప్రతి ఏటా బాధితుల సంఖ్య ఆ మేరకు పెరుగుతోంది. చాలా మంది మానసిక, శారీరక అనారోగ్యాల పాలవుతున్నారు. వడదెబ్బతో మృత్యువాతపడుతున్న వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతోంది. అంతేకాదు రెక్కాడితేగాని డొక్కాడని పేదలు ఎండలో మాడుతూనే పనులు చేసుకోక తప్పటం లేదు. ఎండకు భయపడిన వారు పని దినాలను, దినసరి ఆదాయాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

బాధితులు మన దేశంలోనే ఎక్కువ

అధిక ప్రభావం గల దేశాల్లో ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో పేదరికం, విద్యుత్ సదుపాయంలో అంతరాల కారణంగా శీతలీకరణ సదుపాయాలకు నోచుకోని జనాభా గణనీయంగా ఉంది. అత్యంత ఎక్కువ ప్రభావిత దేశాలు 9. ఈ జాబితాలో 32.3 కోట్ల మందితో మన దేశానిదే అగ్రస్థానం. 15.8 కోట్లతో చైనా రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో నైజీరియా (14.2 కోట్లు), బంగ్లాదేశ్ (5 కోట్లు), ఇండోనేసియా (4.4 కోట్లు), పాకిస్తాన్ (3.4 కోట్లు), బ్రెజిల్ (3.2 కోట్లు), మొజాంబిక్ (2.7 కోట్లు), సూడాన్ (1.7 కోట్లు) ఉన్నాయి. ఈ దేశాల్లో అధిక ఎండల కారణంగా అత్యధిక పేద, మధ్యతరగతి ప్రజలు ఎయిర్ కూలర్లు, ఏసీలు లేక ఫ్యాన్లతో సరిపెట్టుకుంటూ అష్టకష్టాలు పడుతున్నారు. పేద దేశాల్లో కొందరికైతే ఫ్యాన్ కూడా లేదు. విద్యుత్ సదుపాయమే లేని నిరుపేదలూ లేకపోలేదు. 2021కన్నా 2022లో ప్రపంచవ్యాప్తంగా గ్రామీణ, పట్టణవాసుల్లో అధిక ఎండల బాధితుల సంఖ్య 2.86 కోట్లు పెరిగిందని సస్టైయినబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ తెలిపింది.

ఇళ్లన్నిటికీ విద్యుత్ ఉంది కానీ..

ప్రజల ఆదాయం స్థాయినిబట్టి శీతల సదుపాయాలు కల్పించుకొనే స్తోమత ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో విద్యుత్ సదుపాయం 100 శాతం ఇళ్లకు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఈ ఇళ్లలో శీతలీకరణ ఉపకరణాల వాడకం తక్కువగానే ఉంది. 19.6 కోట్ల ఫ్యాన్లు, 16.2 కోట్ల రిఫ్రిజిరేటర్లు, 4 కోట్ల ఎయిర్ కండిషనర్లు భారత్‌లో వినియోగంలో ఉన్నట్లు అంచనా.

సుస్థిర శీతల సాంకేతికతలు

ఏసీల వల్ల ప్రజలకు వేడి నుంచి తాత్కాలిక ఉపశమనం దొరుకుతున్నప్పటికీ వీటి నుంచి వెలువడే ఉద్గారాల వల్ల వాతావరణం ఇంకా వేడెక్కుతోంది. అందువల్ల, సుస్థిర శీతల సదుపాయాలతో కూడిన ప్రత్యామ్నాయాలపై ముఖ్యంగా అధికోష్ణ ప్రభావిత 9 దేశాలు మరింతగా దృష్టి సారించాల్సి ఉంది. నాలుగేళ్ల క్రితం భారత్ తొలి అడుగు వేసింది. ప్రత్యేక నేషనల్ కూలింగ్ యాక్షన్ ప్లాన్ ప్రకటించింది. అడవుల పెంపకం, పట్టణాల్లో పచ్చదనం పెంపొందించటం ఉష్ణోగ్రతలను తగ్గించటంలో ఉపయోపడతాయి. గాలి నాణ్యతను మెరుగు పరుస్తాయి. శాస్త్ర సాంకేతిక పరిశోధనలపై మరింత పెట్టుబడి పెట్టడం ద్వారా సుస్థిర శీతల సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది.

\- సాక్షి సాగుబడి డెస్క్

పనితీరే ప్రామాణికం

- మరో 9 నెలల్లో ఎన్నికలు రానున్నాయి.. ఇక ప్రతి అడుగు కీలకమే
- 'గడప గడపకూ' వర్క్ షాప్‌లో ఏపీ సీఎం జగన్ దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: ''మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఇవాళ్టి నుంచి మనం వేసే ప్రతి అడుగు చాలా కీలకం. 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ మనం గెలవాలి. ఇంతకు ముందుకన్నా బ్రహ్మాండమైన మెజార్టీలు రావాలి. మన లక్ష్యం అదీ! అందుకే గడప గడపకూ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలి..'' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం వైఎస్ జగన్ వర్క్ షాప్ నిర్వహించారు. 175కు 175 స్థానాల్లో విజయబావుటా ఎగురవేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా తెచ్చిన మార్పులను 'వై ఏపీ నీడ్స్ జగన్..?' (ఏపీకి జగన్ ఎందుకు కావాలి..?) అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ తెలియజేద్దామని పిలుపునిచ్చారు. 'నెగెటివ్ మీడియాను అడ్డం పెట్టుకుని మారీచుల్లా మనపై యుద్ధం చేస్తున్నారు.. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. ఆ దుష్ప్రచారాన్ని ప్రతి గడపలోనూ తిప్పికొట్టాలి..' అని సూచించారు. వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రతి లబ్ధిదారుడినీ చైతన్యం చేయాలి..

ఇవాళ మూడు ప్రధాన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో మొదటిది ఈ నెల 23వతేదీన ప్రారంభించబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమం. రెండోది.. గడపగడపకూ మన ప్రభుత్వం. ఇక మూడో అంశం ''వై ఏపీ నీడ్స్ జగన్..?'' అనే కార్యక్రమం. నాలుగేళ్ల పరిపాలనలో గొప్పగా, దేశానికే ఆదర్శంగా నిలబడ గలిగిన పనులు ఏం చేశామన్న విషయాలతోపాటు వాటికి సంబంధించి ఆధారాలతో సహా అవగాహన కలిగించేలా 'వై ఏపీ నీడ్స్ జగన్..' కార్యక్రమాన్ని కూడా చేపట్టబోతున్నాం. మనం రాక్షసులతోనూ, మారీచులతోనూ యుద్ధం చేస్తున్నాం. ప్రతి ఒక్క రూ చైతన్యవంతులు అయితేనే మనపై జరుగు తున్న దుష్ప్రచారాన్ని తగినవిధంగా తిప్పికొట్టగ లిగే పరిస్థితి ఉంటుంది. మనం చేస్తున్న మంచి ఏమిటన్నది ప్రతి మనిషి దగ్గరికి, ప్రతి కుటుంబం వద్దకు పదేపదే తీసుకెళ్లాలి. ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగలిగే పరిస్థితిలోకి ప్రతి లబ్ధిదారుడిని తయారు చేయాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం.

ఆ భావనే ఆశీస్సులుగా మారి..

వచ్చే ఎన్నికల్లో మనం 175కు 175 నియోజకవర్గాలూ గెలవాలి. ఆ దిశగా అడుగులు పడాలి. అదేం కష్టమైన పనికాదు. ఎందుకంటే.. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు మంచి జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలకు మంచి జరగ్గా పట్టణ ప్రాంతాల్లో 84 శాతానికి మేలు జరిగింది. ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి. అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉన్నప్పుడు.. దేవుడి దయతో మన ప్రభుత్వం మంచి చేయగలిగిందని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పి ఆ ఇంట్లో ప్రతి అక్కచెల్లెమ్మ మనసులో ఇది నిజమే కదా అనే భావనను తేవాలి. ఆ భావనే ఆశీస్సులుగా మారి ప్రతి ఇళ్లూ మనకు ఓటు వేస్తుంది. అది జరిగితే ప్రతి గ్రామం మనకు ఓటు వేస్తుంది. ప్రతి నియోజకవర్గం ఆటోమేటిక్‌గా మనకే ఓటు వేసే పరిస్థితి వస్తుంది. 175కు 175 స్థానాల్లో మనం విజయం సాధిస్తాం.

మళ్లీ ఓడిపోతానని తెలుసు.. అయినా నిలబడుతున్నా..

ముమ్మిడివరం సభలో జనసేన అధినేత పవన్



సాక్షి, అమలాపురం/ముమ్మిడివరం : 'వచ్చే ఎన్నికల్లో ఓడిపోయినా.. నిలబడి ఉండటానికి సిద్ధపడి గొడవ పెట్టుకుంటున్నాను. మా నాన్న చెప్పేవాడు కీడెంచి మేలెంచమని. నేను ఇంకొకసారి ఓడిపోతానని నిర్ణయించుకునే వైఎస్సార్‌సీపీ క్రిమినల్ గ్యాంగ్స్‌తో గొడవ పెట్టుకుంటున్నాను' అని జనసేన అధినేత పవన కల్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరంలో బుధవారం రాత్రి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జనసేన గెలవకపోయినా.. తాను ఎమ్మెల్యేగా ఓడిపోయినా.. ప్రశ్నిస్తున్నాననే భయం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉందన్నారు. అందుకే తాను వస్తున్నానని తెలిసి హడావుడిగా ధాన్యం కొన్నారని, ధాన్యం సొమ్ములు కూడా రైతుల అకౌంట్లలో వేశారని తెలిపారు. గతంలోనూ తన సభలకు ఇలాగే జనం వచ్చారని, కానీ ఓటు వైఎస్సార్‌సీపీకి వేశారన్నారు. 'సీఎంజగన్‌ను 75% మంది వ్యతిరేకిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరంతా ఐక్యంగా ఉండి, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అర్థం చేసు కోకపోతే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి తీరుతుంది' అని అన్నారు.

23 నుంచి కేజీబీవీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పోస్టుకు ముగ్గురు చొప్పున 4,243 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఏపీలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 1,543 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా, 46,173 దరఖాస్తులు అందాయి. పోస్టుకు ముగ్గురి చొప్పున అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులను 4,243 మందిని ఎంపిక చేసి, వారి వివరాలను జిల్లాలకు పంపించారు. బుధ, గురువారాల్లో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, శుక్రవారం నుంచి డీఈవో, జాయింట్ కలెక్టర్, సబ్జెక్ట్ నిపుణులతో పాటు ఐదుగురి సభ్యుల బృందం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, తుది జాబితా సిద్ధం చేస్తుందని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

రాజకీయ ఆత్మహత్య దిశగా పవన్

మీడియాతో ఏపీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: రాజకీయ ఆత్మహత్య దిశగా పవన్ కళ్యాణ్ పయనిస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. నిత్యం పిచ్చి వ్యాఖ్యలతో గ్రాఫ్ దిగజారిపోవడంతో పాటు, రాజకీయాల్లో మోస్ట్ కన్‌ఫ్యూజ్డ్ వ్యక్తిగా పవన్ మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. 'పవన్ నువ్వు ఎక్కింది వారాహి కాదు పందిని. ఆ పందిపై తిరుగుతూ నీపై నువ్వే బురద చల్లుకుంటున్నావు. నీ పిరికితనం తప్ప.. నిన్ను చంపాల్సిన అవసరం ఏంటి. అసలు నీస్థాయి ఎంత.. నువ్వు గెలిచిన సీట్లు ఎన్ని. నీ మాటలు చాలదా.. ఒకడు నిన్ను చంపాలా? నీ వ్యాఖ్యలతో నువ్వే రాజకీయంగా చచ్చిపోయేలా ఉన్నావు. నీకే నమ్మకం లేని ఎన్నికలకు నువ్వే ప్రచారం చేసుకోవడం చూస్తే నవ్వొస్తోంది. ఒకవేళ నిన్ను చంపాల్సి వస్తే.. వంగవీటి మోహనరంగాను హతమార్చిన వాళ్లకే ఆ ఆలోచన ఉంటుంది. నువ్వు చెగువేరా బొమ్మ వేసుకుని ప్రాణహాని గురించి ప్రస్తావించడం సిగ్గుచేటు..' అని మండిపడ్డారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాము ప్రధాన ప్రతిపక్షమైన చంద్రబాబును మాత్రమే కాదని, దుష్టచతుష్టయంతో పాటు దత్తపుత్రుడు పవన్‌ను కూడా ఒంటరిగానే ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక మళ్లీ తిరిగి ఎక్కడ అధికారంలోకి వస్తారోనని భయపడుతున్న రామోజీరావు.. పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని కుటిల రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఉండే రామోజీరావు, అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చిపోయే పవన్ కలిసి.. నిత్యం ప్రజాసంక్షేమం కోసమే పనిచేస్తున్న సీఎం జగన్‌ను ఎక్కడికి పంపించగలరని నిలదీశారు. 'రామోజీరావు లేనిపోనిది రాసి.. గందరగోళం చేసి ప్రజల మనసులను మార్చాలనుకోవడం పూర్వం చెల్లింది. ఎన్టీఆర్‌పై అలాంటి రాతలేరాసి భ్రష్టుపట్టించారు. ఆ పాపానికి ఇప్పుడు ఖర్మ అనుభవించక తప్పదు..' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే కురుక్షేత్ర యుద్ధంలో కౌరవ కూటమిని ఓడించేందుకు ప్రజలు ఎప్పుడో సిద్ధమయ్యారన్నారు. పవన్‌కు ప్రాణహానిపై భయం ఉంటే ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వం కచ్చితంగా విచారణ చేస్తుందని చెప్పారు. భారతదేశంలోనే రామోజీరావుకి మించిన వైట్‌కాలర్ నేరస్తులు లేరని చెప్పారు. చిట్‌ఫండ్ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించి, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్నారు.

కిడ్నాప్‌పై సీబీఐ విచారణకు సిద్ధం

- నా కుటుంబం కిడ్నాప్‌ను ఓ వర్గం మీడియా వక్రీకరిస్తోంది
- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: తన కుటుంబం కిడ్నాప్‌నకు గురైన వ్యవహారంపై కొందరు రాజకీయ నేతలు సీబీఐతో విచారణ చేయించాలని కోరుతున్నారని, వాళ్లనడం కాదు.. సీబీఐ విచారణకు తానే సిద్ధంగా ఉన్నానని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చెప్పారు. ఎంపీ బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు డబ్బు కోసం తన కుటుంబాన్ని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేస్తే కొందరు రాజకీయవేత్తలు, ఓ వర్గం మీడియా దానిని వక్రీకరిస్తోందని చెప్పా రు. ఆ మనస్తాపంతోనే విశాఖ వీడుతానని చెప్పానన్నారు. తన వ్యాపారాల కారణంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చెడ్డ పేరు రాకూడ దనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రెండేళ్ల కిందటే మాజీ ఎస్పీతో భూవివాదం కారణంగా తనపై ఆరోపణలు చేశారని, అప్పుడే తాను ఈ నిర్ణయం ప్రకటించానని చెప్పారు. ప్రస్తుతం విశాఖలో చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేస్తానన్నారు. తన నిర్ణయాన్ని వక్రీకరిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు, ఒక వర్గం మీడియా ప్రభుత్వ ప్రతిష్టను, విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కిడ్నాపర్ హేమంత్‌తో తనకు సంబంధం లేదన్నారు. ఎవరితోనూ రాజకీయ కక్షలు, వ్యాపార లావాదేవీలు లేవ న్నారు. హేమంత్, రాజేష్‌పై అనేక క్రిమినల్ కేసులున్నాయని తెలిపారు. భీమవరం, తిరుపతి, విజయవాడలో కూడా వాళ్లు నేరాలకు పాల్ప డ్డాడన్నారు. ఇలాంటి నేరస్తులు ఓ ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తే.. ఎవరూ స్పందించకపోగా, డ్రామా అని కొందరు అంటున్నారన్నారు. ఎంపీ రఘురామకృష్ణరాజు గజ్జి కుక్కలాంటి వ్యక్తి అని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో అప్పటి అరకు ఎమ్మెల్యే హత్యకు గురవలేదా, బాబు వాహనాన్నే పేల్చేశారే.. అప్పుడు ఆయనేం రక్షణ కల్పించాడు అని ప్రశ్నించారు.

క్లుప్తంగా...

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ నియంత

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం



బీజింగ్: అమెరికా, చైనా నాయకుల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా పర్యటన పూర్తయిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. చైనా అధినేత షీ జిన్‌పింగ్‌పై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనొక నియంత అంటూ మండిపడ్డారు. తాజాగా కాలిఫోర్నియాలో నిధుల సేకరణ కార్యక్రమంలో బైడెన్ మాట్లాడారు. చైనాకు చెందిన అనుమానిత నిఘా బెలూన్‌ను తమ అధికారులు పేల్చివేసినప్పుడు జిన్‌పింగ్ చాలా ఆందోళనకు గురయ్యారని, ఆయన ఎందుకలా ప్రవర్తించారో తెలియదని అన్నారు. చైనా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెప్పారు. జిన్‌పింగ్‌పై బైడెన్ చేసిన వ్యాఖ్యలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఖండించారు. బైడెన్ ఆరోపణలు అసంబద్ధం, బాధ్యతారాహిత్యం అని ఆక్షేపించారు.

కేంద్ర ఆర్డినెన్స్‌పై విపక్షాల భేటీలో చర్చించాలి

ప్రతిపక్ష నాయకులకు అరవింద్ కేజ్రీవాల్ లేఖ



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా అధికారాలను నియంత్రిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి తప్పుపట్టారు. ఈ నెల 23న పట్నాలో జరిగే విపక్షాల భేటీలో ఈ ఆర్డినెన్స్ వ్యవహారంపై చర్చించాలని ఆయన కోరారు. ఈ మేరకు విపక్ష నేతలు బుధవారం లేఖ రాశారు. ఆర్డినెన్స్‌పై బీజేపీయేతర పార్టీలు తమ వైఖరిని బహిర్గతం చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇది కేవలం ఢిల్లీకి సంబంధించిన సమస్యగా చూడొద్దని అన్నారు. ఇప్పుడు అడ్డుకోకపోతే ఇతర రాష్ట్రాల్లో అధికారాలను సైతం కేంద్రం గుప్పిట్లో పెట్టుకుంటుందని హెచ్చరించారు.

నింగి.. నేల.. నీరు.. ఎక్కడైనా పవర్‌ఫుల్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఇవాళ కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశంలో ఇరువురు నేతలు రక్షణ రంగంలో పటిష్ట బంధాలకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షణ రంగంలో వేలాది కోట్ల రూపాయల ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలున్నాయి. అందులో అందరి దృష్టిని ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ డ్రోన్ల కొనుగోలుకు ఇప్పటికే కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ డ్రోన్ల ప్రత్యేకతలు భారత్‌కు ఒనగూరే ప్రయోజనాలేంటో చూద్దాం..

సాక్షి, నేషనల్ డెస్క్



నింగి, నేల, నీరు ఎక్కడైనా, ఏ పనైనా ఈ డ్రోన్లు చేయగలవు. కదన రంగంలో అరివీర భయంకరమైనవిగా గుర్తింపు సంపాదించాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు విస్తృతంగా వినియోగిస్తున్నాయి. ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు బహుళ ప్రయోజనాలకు వినియోగపడతాయి. అమెరికాకు చెందిన జనరల్ ఆటమిక్స్ ఏరోనాటికల్ వ్యవస్థ ఈ డ్రోన్లను అభివృద్ధి చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా, శత్రుదేశాల రహస్యాల సేకరణ వంటి కార్యక్రమాలతో పాటు బాంబు దాడుల్ని కూడా ఈ డ్రోన్లు చేయగలవు. ఈ డ్రోన్లను కొనుగోలు చేయడానికి ఇప్పటికే కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్రివిధ బలగాలైన భారత వైమానిక దళం, నావికా దళం, ఆర్మీలకు ఒక్కో దానికి 10 డ్రోన్ల చొప్పున మొత్తం 30 డ్రోన్లను కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమైంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య గురువారం నాడు జరిగే భేటీలో 300 కోట్ల డాలర్ల విలువైన (రూ.24,600 కోట్లు) ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునే అవకాశాలున్నాయి. మిలటరీ ఆపరేషన్లు, సరిహద్దుల్లో నిఘా, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే చర్యల్లో ఈ డ్రోన్లు కీలకంగా వ్యవహరిస్తాయి. మానవ రహిత డ్రోన్లు కావడంతో కదన రంగంలో వినియోగించినా ప్రాణనష్టం ఉండదు. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌లో ఇద్దరు పైలట్లు ఈ డ్రోన్‌ను నియంత్రిస్తూ ఉంటారు దీర్ఘకాలం పనిచేయడం, నిరంతరాయంగా నిఘా పెట్టే సామర్థ్యం, దాడులకు దిగే సత్తా వంటి బహుళ ప్రయోజనాలు కలిగిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు భారత త్రివిధ బలగాల మేధస్సు, నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయి. పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో మనకి నిరంతరాయంగా ఘర్షణలు, చొరబాట్లు జరుగుతూనే ఉంటాయి. ఈ డ్రోన్లు మన దగ్గరుంటే సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి, ముప్పుల్ని ముందే పసిగట్టడం, వాటికి సంబంధించిన ఇమేజ్‌లను పంపించి అప్రమత్తం చేయడం వంటివి చేస్తాయి. ఉగ్రవాద కార్యకలాపాలను కూడా ఇవి గుర్తించి

భారత్‌కు ఎలా ఉపయోగం ?

వాయువేగంతో వాటికి సంబంధించిన సమాచారాన్ని పంపుతాయి. మన దేశానికి అతి పెద్ద సముద్ర తీరప్రాంతం ఉంది. ఈ ప్రాంతాల్లో భద్రత అత్యంత కీలకం. సముద్ర తీర ప్రాంతాల్లో కూడా ఈ డ్రోన్లు పర్యవేక్షించగలవు. స్మగ్లింగ్, పైరసీ వంటి కార్యకలాపాలను గుర్తించడమే కాకుండా, సహాయ కార్యక్రమాల్లోనూ ఉపయోగపడతాయి. ప్రకృతి విపత్తులైన వరదలు, తుపాన్లు, భూకంపాలు వంటి సమయాల్లో విపత్తు నిర్వహణ కూడా చేయగలవు. మనుషులు వెళ్లలేని ప్రాంతాలకు ఈ డ్రోన్లు వెళ్లి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

ప్రత్యేకతలు

- 50 వేల అడుగుల ఎత్తులో 40 గంటల సేపు నిరంతరాయంగా ప్రయాణించగలదు
- అధునాతన కెమెరాలు, సెన్సార్లు, రాడార్లతో సరిహద్దుల్లో గట్టిగా నిఘా పెట్టి సున్నితమైన అంశాలను, అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి పంపించగలదు
- 240 నాట్స్ ట్రూ ఎయిర్ స్పీడ్ (కేటీఏఎస్) వేగంతో ప్రయాణిస్తుంది
- ఆటోమేటిక్ టేకాఫ్, ల్యాండింగ్, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వంటివి చేయగలదు
- 12,177 కేజీల బరువైన పేలోడ్‌ను మోసుకుపోగలదు
- 2,721 కేజీల ఇంధనాన్ని నింపవచ్చు
- 114 హెల్‌ఫైర్ క్షిపణులు, జీబీయూ-12 పేవ్‌వే లైజర్ గైడెడ్ బాంబుల్ని మోసుకుపోగలదు
- ఆకాశంపై నుంచి బాంబుల్ని కూడా కురిపించగలదు

ఏయే దేశాలు వినియోగిస్తున్నాయి?

ఈ డ్రోన్లను అమెరికా చాలా విస్తృతంగా వినియోగిస్తోంది. అఫ్గానిస్తాన్, ఇరాక్ సహా ఇతర ఘర్షణ ప్రాంతాల్లో వీటిని మోహరించింది. అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, నాసా ఈ డ్రోన్లను వినియోగిస్తున్నాయి. యూకే రాయల్ ఎయిర్‌ఫోర్స్, ఇటలీ ఎయిర్‌ఫోర్స్, ఫ్రెంచ్, స్పెయిన్ ఎయిర్‌ఫోర్స్ , జపాన్ దేశాలు ఈ డ్రోన్లు వాడుతున్నాయి. 2014-2018 మధ్య కాలంలో ఇరాక్, సిరియాలో నిర్వహించిన 2,400 మిషన్లలో బ్రిటన్ ఈ డ్రోన్లనే మోహరించింది. 398 సార్లు ఈ డ్రోన్లతో దాడులకు పాల్పడింది. అమెరికాకు చెందిన ఎంక్యూ-9 డ్రోన్ తమ దేశ రహస్యాలను ఉక్రెయిన్‌కు చేరవేస్తోందన్న అనుమానంతో నల్లసముద్రంలో గత మార్చిలో కూల్చేసింది. 2020 జనవరిలో ఇరాన్‌లో జనరల్ క్వాజిం సొలెమినీ ఈ డ్రోన్‌తో అమెరికా చేసిన బాంబు దాడిలోనే మరణించారు.

హోండురస్‌లో దారుణం

46 మంది ఖైదీల దుర్మరణం



తెగుసిగల్పా(హోండురస్): హోండురస్ దేశంలోని మహిళా చెరసాల 46 మంది మహిళా ఖైదీల పాలిట మరణశాసనమైంది. దేశ రాజధాని తెగుసిగల్పాకు 50 కిలోమీటర్ల దూరంలోని తమారా పట్టణంలోని ఉమెన్స్ జైలులో ముఠాల మధ్య ఘర్షణలు మంగళవారం తారాస్థాయికి చేరుకున్నాయి. రెండు ముఠాలకు చెందిన మహిళా ఖైదీలు తుపాకులతో కత్తులతో బాహాబాహీకి దిగారు. ఈ సందర్భంగా అగ్నికీలలు ఎగసిపడిన ఘటనలో మొత్తంగా 46 మంది ఖైదీలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది సజీవ దహనం అయినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలుస్తోంది. జైళ్లలో వేళ్లూనుకున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ఈ సమస్య పెద్దదైంది. హోండురస్ కారాగారాల్లో చాలా వరకు నేరగాళ్లు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తారు. సొంత నియమాలనే పాటిస్తారు. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా అక్కడి జైళ్లు వర్ధిల్లుతున్నాయి. నిషేధిత వస్తువులను జైళ్లలో విక్రయిస్తూ ముఠాలు సొమ్ముచేసుకుంటాయి. మంగళవారం నాటి ఘటనలో బారో 18, మారా సాల్వాట్రూకా(ఎంఎస్-13) అనే రెండు గ్యాంగ్‌ల మధ్య ఘర్షణే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గడిచిన శతాబ్దకాలంలో చూస్తే అతిపెద్ద చెరసాలల్లో విషాద ఘటన హోండురస్‌లోనే నమోదైంది. 2012లో కొమయగువా జైలులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘోర ప్రమాదంలో ఏకంగా 361 మంది కారాగారవాసులు ప్రాణాలు కోల్పోయారు.

ఎన్డీయే గూటికి మాంఝీ



న్యూఢిల్లీ: జితిన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్తానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) ఎన్డీయేలో చేరింది. ఇకపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో సాగుతామని బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన అనంతరం మాంఝీ ప్రకటించారు. నితీశ్ కుమార్ నాయకత్వంలోని సంకీర్ణానికి (జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్) గుడ్‌బై చెప్పిన రెండు రోజులకే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. జితిన్ రామ్ కుమారుడు సంతోష్ సుమన్ ఇటీవలే మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. హెచ్‌ఏఎం.. బీజేపీకి సన్నిహితమవుతున్నదనే అనుమానంతో ఆ పార్టీని జేడీయూలో విలీనం చేయాలని నితీశ్‌కుమార్ కోరారు. పార్టీని విలీనం చేయడానికి విముఖంగా ఉన్న మాంఝీ జేడీయూ నేతృత్వంలోని సంకీర్ణంతో తెగదెంపులు చేసుకొని ఎన్డీయేలో చేరారు.

చైనా 'ఉగ్ర' వైఖరిపై భారత్ ఆగ్రహం

ఐక్యరాజ్య సమితి: పాకిస్తానీ ఉగ్రవాది సాజిద్ మిర్‌ను ప్రపంచస్థాయి ఉగ్రవాదిగా ప్రకటించేందుకు ఐరాస వేదికగా చేసిన ప్రయత్నాన్ని చైనా అడ్డుకోవడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. 26/11 ముంబై దాడుల కేసులో సూత్రధారుల్లో ఒకడిగా పేరొందిన లష్కరే తోయిబా ఉగ్రసంస్థ ముఖ్య నేత సాజిద్‌ను గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించాలంటూ భారత్, అమెరికా చేసిన ప్రతిపాదనకు చైనా మోకాలడ్డుపెట్టడం తెల్సిందే. దీనిపై భారత్.. ఐరాస ఉగ్రవ్యతిరేక సమావేశం వేదికగా ఘాటుగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం న్యూయార్క్‌లో భారత శాశ్వత మిషన్ సంయుక్త కార్యదర్శి ప్రకాశ్ గుప్తా మాట్లాడారు. ' భౌగోళిక స్వప్రయోజనాల కారణంగా ఉగ్రవాదులపై నిషేధం విధించటంలో మనం విఫలమయ్యామంటే అది మనలో నిజమైన రాజకీయ సంకల్పం లేదని స్పష్టం చేస్తోంది. ఉగ్రవాదం విసిరే సవాళ్లను ఎదుర్కోలేము. స్వీయ ఓటమిని చూపేలా మంచి ఉగ్రవాదులు, చెడు ఉగ్రవాదులు అంటూ వింత, వితండ వాదనలు ఆపండి. ఇలాంటి ద్వంద్వ వైఖరి విధానాలను రూపుమాపాలి. సహేతుకమైన కారణాలు చూపకుండానే ఇలాంటి ఆధారసహిత ప్రతిపాదనలను తుంగలో తొక్కడం దారుణం' అని గుప్తా ఆగ్రహం వ్యక్తంచేశారు. సాజిద్ ఉగ్రవాది అని ఇప్పటికే పలు ప్రపంచ దేశాలు ప్రకటించాయి. సాజిద్ తలపై అమెరికా సైతం 50 లక్షల డాలర్ల రివార్డ్ ప్రకటించింది. గతంలో సాజిద్ ఆచూకీ దాచేందుకు పాక్ ప్రయత్నించింది. గత ఏడాది జూన్‌లో పాకిస్తాన్‌లోని ఉగ్ర వ్యతిరేక కోర్టు సాజిద్‌కు 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

మా అభివృద్ధి ప్రయాణమిదీ..

- సంస్కరణలతో ఆర్థిక ప్రగతి సాధిస్తున్నామన్న ప్రధాని మోదీ
- న్యూయార్క్‌లో ఆర్థిక, వ్యాపార రంగ నిపుణులు, ప్రముఖులతో సమావేశం

న్యూయార్క్: ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా తొలిరోజు బుధవారం బిజీబిజీగా గడిపారు. అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులతో వరుసగా సమావేశమయ్యారు. ఆర్థిక, వ్యాపార రంగ నిపుణులు, ప్రముఖులు, నోబెల్ బహుమతి గ్రహీతలు, విద్యావేత్తలతో భేటీ అయ్యారు. అమెరికన్ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ పాల్ రోమర్, పెట్టుబడిదారుడు, హెడ్జ్ ఫండ్ సహ వ్యవస్థాపకుడు, బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ అధినేత, రచయిత రే డాలియోతో మోదీ భేటీ అయ్యారు. భారత్‌లో పెట్టుబడులు మరిన్ని పెట్టాలని డాలియోను ఆహ్వానించారు.

అంతరిక్ష రంగంలో సంస్కరణలు

ప్రముఖ అస్ట్రోఫిజిసిస్ట్, రచయిత నీల్ డిగ్రాసీ టైసన్‌ను మోదీ కలుసుకున్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథం పెంచడంపై, అంతరిక్ష ప్రయోగాలపై చర్చించారు. భారత ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నేషనల్ స్పేస్ పాలసీ గురించి మోదీ వివరించారు. స్పేస్ సెక్టార్‌ను సంస్కరిస్తున్నామని తెలిపారు. అమెరికన్ గణిత శాస్త్రవేత్త నాసిమ్ నికోలస్ తాలిబ్‌తో భేటీ అయ్యారు. భారత్‌లో స్టార్టప్‌ల వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ వివరించారు. అనంతరం గ్రామీ అవార్డు విజేత, ఇండియన్-అమెరికన్ గాయకురాలు ఫల్గునీ షాతో సమావేశమయ్యారు. సంగీతం ద్వారా భారతీయులను, అమెరికన్లను ఏకం చేస్తున్నారంటూ ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు. తృణధాన్యాల ఆవశ్యకతను వివరిస్తూ ఫల్గునీ షా పాడిన 'అబండెన్స్ ఇన్ మిల్లెట్స్' అనే పాటను మోదీ ప్రత్యేకం ప్రస్తావించారు.



అబండెన్స్ ఇన్ మిల్లెట్స్ పోస్టర్ వద్ద మోదీ

ప్రజారోగ్య సంరక్షణకు పెద్దపీట

అమెరికాలో ఆరోగ్య సంరక్షణ రంగంలో విశిష్టమైన సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను కలుసుకున్నారు. దేశంలో ప్రజారోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వాడుకుంటున్నామని వెల్లడించారు. డాక్టర్ పీటర్ హోటెజ్, డాక్టర్ సునీల్ ఎ.డేవిడ్ తదితరులతో మోదీ మాట్లాడారు. దౌత్య రంగ పెద్దలు, అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు మైకేల్ ఫ్రోమాన్, డేనియల్ రస్సెల్, గురు సోలీ తదితరులతో మోదీ సమావేశమై, భౌగోళిక రాజకీయాలపై సంప్రదింపులు జరిపారు. భారత్‌లో పర్యటించాలంటూ వారిని ఆహ్వానించారు. విద్యావేత్తలనూ మోదీ కలిశారు. చంద్రికా టాండన్, నీలి బెండపూడి, ప్రదీప్ ఖోస్లా,ప్రొఫెసర్ జగ్‌మోహన్ రాజుతో సమావేశమయ్యారు. మరోవైపు, న్యూయార్క్‌లో కార్యక్రమాలు ముగించుకుని మోదీ ఆ తర్వాత వాషింగ్టన్‌కు చేరుకున్నారు.

భారత్‌లో టెస్లా కంపెనీ: మస్క్

భారత్‌కు భవ్యమైన భవిష్యత్తు ఉందని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ చెప్పారు. మోదీ మంగళవారం మస్క్‌తో సమావేశమయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఇంధనం నుంచి ఆధ్యాత్మిక వరకూ వివిధ అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. సమావేశం అనంతరం ఎలాన్ మస్క్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని చెప్పారు. భారత్‌లో టెస్లా కంపెనీని స్థాపిస్తామన్న నమ్మకం ఉందన్నారు. భారత్‌లో తాను పెట్టుబడులు పెట్టడం ఖాయమని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీకి తాను అభిమానినని మస్క్ పేర్కొన్నారు. ఈ మేరకు వీడియో స్టేట్‌మెంట్ విడుదల చేశారు. మోదీతో చర్చలు అద్భుతంగా జరిగాయన్నారు.

ఐరాసలో మోదీ గిన్నిస్ రికార్డ్ యోగా సెషన్



గిన్నిస్ రికార్డు నమోదైన సందర్భంగా ఆనందం వ్యక్తంచేస్తున్న మోదీ

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితిలో తొలిసారిగా అధికారికంగా, ప్రధాని మోదీ సారథ్యంలో సాగిన యోగా సెషన్ గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ' యోగా అనేది కాపీరైట్లు, పేటెంట్, రాయల్టీ చెల్లింపుల వంటి మేధోపర హక్కులకు అతీతం. లింగభేదం లేకుండా అన్ని వయసుల వారికి ఆరోగ్య యోగ్యతతో సంబంధం లేకుండా అందరికీ అనువైనది యోగా. నిజంగా యోగా విశ్వజనీనం, విశ్వవ్యాప్తం ' అని వ్యాఖ్యానించారు. తొలుత న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలోని ఉత్తరవైపు ప్రాంగణంలోని గాంధీజీ ప్రతిమకు మోదీ నివాళులర్పించారు. తర్వాత పలు దేశాల ప్రతినిధులకు యోగా సెషన్‌లోకి స్వాగతం పలికారు. ' యోగా కోసం అన్ని దేశాల ప్రతినిధులు ఇలా ఒక్కటిగా కలసి రావడం అద్భుతంగా ఉంది. ఈ రోజు ఇక్కడ ప్రతీ జాతీయునికీ సమ గౌరవం దక్కుతోంది' అని అన్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ 77వ సెషన్ అధ్యక్షుడు కసాబా కొరిసి, న్యూయార్క్ మేయర్ ఎరిక్, హాలీవుడ్ నటుడు రిచర్డ్ గెరే, అయ్యంగార్ యోగాతో చిరపరిచితమైన డియిద్రా డీమెన్స్, ప్రముఖ అమెరికా గాయని మేరీ మిల్బెన్‌సహా పలు ప్రపంచ దేశాల ప్రతినిధులు యోగా చేశారు. ఇలా ఒకేసారి ఒకేచోట అత్యంత ఎక్కువ దేశాలకు చెందిన వ్యక్తులు పాల్గొన్న యోగా సెషన్‌గా ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డును నమోదుచేసుకుంది. సెషన్‌లో ఐరాస ఉన్నతాధికారులు, వివిధ దేశాల రాయబారులు, దౌత్యవేత్తలు, ఐరాస సభ్యదేశాల ప్రతినిధులు, ప్రపంచ స్థాయి ప్రముఖులు, భిన్న సంస్థల వ్యక్తులు పాల్గొన్నారు. 'భిన్న పోకడలతో విచ్ఛిన్నమవుతున్న ప్రపంచం నేడు యోగా లాంటి అత్యంత అమూల్యమైన విధానం నుంచి ఎంతో నేర్చుకోవాలి. ప్రయోజనం పొందాలి' అని ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ అన్నారు.

> 'మన మధ్య ఉన్న అభిప్రాయభేదాలు, అంతరాలను, వ్యతిరేక భావాలను యోగా తో చెరిపేసుకుందాం. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తిని ఇంకోసారి ప్రపంచానికి చాటుదాం. భారత్ ఇచ్చిన పిలుపుతో 180కిపైగా దేశాల ప్రజలు ఇలా ఒకే తాటి మీదకు రావడం చరిత్రాత్మకం, అపూర్వం'
>
> \- మోదీ



హోరు వానలో బుధవారం వాషింగ్టన్ డీసీకి చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొనాలి

కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఆకాంక్ష



న్యూఢిల్లీ: మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. హింసాత్మక సంఘటనలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, వేలాది మంది నిరాశ్రయులు కావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజలే నేడు శత్రువులుగా మారిపోవడం చాలా విచారకరమని అన్నారు. భిన్న వర్గాల ప్రజలను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్న ఘన చరిత్ర మణిపూర్‌కు ఉందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. రాష్ట్రంలో అందరూ సహనం వహించాలని విజ్ఞప్తి చేశారు. హింసకు తక్షణమే తెరపడాలని, శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఆప్తులను కోల్పోయినవారికి సానుభూతి తెలిపారు. మణిపూర్ హింసాకాండలో ఇప్పటిదాకా 100 మందికిపైగా మరణించినట్లు సమాచారం. వేలాది మంది సొంత ఊళ్లను వదలేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

తీవ్రవాదం విభజిస్తుంది.. పర్యాటకం ఏకం చేస్తుంది

జీ20 పర్యాటక మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: తీవ్రవాదం విభజిస్తే పర్యాటకం ఏకం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలనూ ఏకం చేసి సామరస్య సమాజాన్ని సృష్టించే శక్తి పర్యాటక రంగానికి ఉందని ఉద్బోధించారు. 'ఒక కుటుంబం, ఒక భూమి, ఒక భవిష్యత్తు' భావన ప్రపంచ పర్యాటకానికి వర్తిస్తుందన్నారు. గోవాలో జరిగిన జీ20 పర్యాటక మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ బుధవారం వీడియో సందేశంలో ప్రసంగించారు. అందులో ఆయన ఏమన్నారంటే..

'అతిథి దేవోభవ'పైనే పర్యాటకం ఆధారం

''పర్యాటక రంగం పట్ల భారతదేశ వైఖరి 'అతిథి దేవోభవ' భావన మీద ఆధారపడింది. పర్యాటకమంటే కొత్త ప్రదేశాలు చూడటం కాదు. ఆ పరిసరాలలతో లీనమవడం. పర్యాటక రంగంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సుసంపన్న దేశ వారసత్వ సంపదను కాపాడటం భారత పర్యాటక రంగానికి కీలకం. గత తొమ్మిదేళ్లలో దేశంలోని మొత్తం పర్యాటక పర్యావరణాన్ని అభివృద్ధి చేయటంపై దృష్టి పెట్టాం. ఈరంగంలో రవాణా మౌలిక సదుపాయాలు, ఆతిథ్యం, నైపుణ్యాభివృద్ధి, చివరికి వీసా వ్యవస్థ దాకా ఎన్నో సంస్కరణలు తెచ్చాం. ఉపాధి కల్పన, సామాజిక సమ్మిళిత, ఆర్థికాభివృద్ధిలో ఆతిథ్య రంగానికి అవకాశం ఎక్కువ'' అని మోదీ అన్నారు.

అనుసంధానంతో సానుకూల ఫలితాలు: కిషన్‌రెడ్డి

పర్యాటక రంగం అత్యంత వేగంగా ఎదుగుతూ ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'ప్రపంచ పర్యాటక రంగం ద్వారా పెద్దసంఖ్యలో ఉపాధి కల్పనతోపాటుగా సామాజిక-ఆర్థిక ప్రగతి సాధ్యం. వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సమగ్రతకు పర్యాటక రంగం ఎంతగానో తోడ్పడుతోంది. ఈ పరిస్థితుల్లో యువత, మహిళలను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం ద్వారా మరింత సానుకూల ఫలితాలు సాధించవచ్చు' అని మంత్రి అభిప్రాయపడ్డారు.



టైటాన్ లోతులోకి వెళ్తున్నప్పటి దృశ్యం



టైటాన్‌లో చిక్కుకున్న ప్రముఖులు(ఫైల్)

మహా ఉత్కంఠ

అట్లాంటిక్ మహా సముద్రంలో ఇంకా దొరకని టైటాన్ జలాంతర్గామి ఆచూకీ

సముద్ర అంతర్భాగంలో శబ్దాలను గుర్తించిన కెనడా నిఘా విమానం

బోస్టన్: ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో టైటానిక్ ఓడ సందర్శన కోసం వెళ్లి గల్లంతయిన జలాంతర్గామి 'టైటాన్' జాడ ఇంకా తెలియరాలేదు. టైటాన్‌లోని ఐదుగురు సందర్శకుల పరిస్థితి ఏమిటన్న దానిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వారి ఆచూకీ గుర్తించేందుకు అమెరికా కోస్ట్ గార్డ్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి తమ కార్యాచరణను ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, సముద్ర అంతర్భాగం నుంచి శబ్దాలు వెలువడుతున్నట్లు కెనడా సైనిక నిఘా విమానం కనిపెట్టడం ఆశలు రేకెత్తిస్తోంది. టైటాన్ గల్లంతయినట్లు భావిస్తున్న ప్రాంతం నుంచి ప్రతి 30 నిమిషాలకోసారి బిగ్గరగా శబ్దాలు వెలువడుతున్నట్లు సమాచారం. అయితే, ఈ శబ్దాలు టైటాన్‌కు సంబంధించినవేనా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. టైటాన్‌లో కొంత ప్రాణవాయువు ఇంకా మిగిలే ఉందని, సందర్శకుల ప్రాణాలకు ఇప్పటికిప్పుడు అపాయం వాటిల్లకపోవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి.

గురువారం ఉదయానికల్లా ఆక్సిజన్ మాయం!

టైటాన్ ఆచూకీ కోసం జాన్ కాబోట్, స్కాండీ విన్‌ల్యాండ్, అట్లాంటిక్ మెర్లిన్ అనే మూడు పడవలను అమెరికా కోస్ట్ గార్డ్ సిబ్బంది రంగంలోకి దించారు. టైటాన్ జలాంతర్గామి ప్రస్తుతం సముద్ర ఉపరితలం నుంచి 12,500 అడుగుల(3,800 మీటర్లు) లోతున ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇది సామాన్యమైన లోతు కాదు. అక్కడిదాకా సురక్షితంగా చేరుకోవడం కష్టమైన పని అని చెబుతున్నారు. అండర్‌వాటర్ రోబోను పంపించినట్లు తెలుస్తోంది. సహాయక చర్యల కోసం అమెరికా సైన్యానికి చెందిన మూడు సి-17 రవాణా విమానాలను పంపించినట్లు యూఎస్ ఎయిర్ మొబిలిటీ కమాండ్ అధికార ప్రతినిధి చెప్పారు. ఒక పెట్రోలింగ్ విమానం, రెండు ఓడలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని కెనడా సైన్యం ప్రకటించింది. గురువారం ఉదయానికల్లా టైటాన్‌లో మొత్తం ఆక్సిజన్ ఖర్చయిపోతుంది. అప్పటిలోగా దాని జాడ తెలియకపోతే అందులోని సందర్శకులు ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఈ జలాంతర్గామి టైటానిక్ దిశగా తన ప్రయాణం ప్రారంభించింది. సరిగ్గా నాలుగు రోజులకు సరిపడా ఆక్సిజన్ మాత్రమే అందులో ఉంది. టైటాన్‌లో రెండు రకాల కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి. నీటిలోకి వెళ్లిన 1.45 గంటల లోపే అవి పనిచేయడం ఆగిపోయింది.

క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థనలు

టైటాన్ గల్లంతు కావడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఐదుగురు సందర్శకులు క్షేమంగా తిరిగిరావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వివిధ దేశాల అధినేతలు పేర్కొన్నారు. సందర్శకుల క్షేమాన్ని కోరుతూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. టైటాన్‌లో ఓషియన్‌గేట్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు స్టాక్‌టన్ రష్, బ్రిటిష్ వ్యాపారవేత్త హమిష్ హర్డింగ్, పాకిస్తాన్‌కు చెందిన తండ్రీకొడుకులు షహ జాదా, సులేమాన్ దావూద్, ఫ్రెంచ్ నావికాదళం మాజీ అధికారి పాల్-హెన్రీ నార్జియోలెట్ ఉన్నారు. వీరంతా 1912లో అట్లాంటిక్ సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ ఓడ శిథిలాలను సందర్శించడానికి టైటాన్ జలాంతర్గామిలో వెళ్లారు. ఆదివారం రాత్రి కెనడా తీరానికి 700 కిలోమీటర్ల దూరంలో అట్లాంటిక్ సముద్రంలో టైటాన్ గల్లంతయ్యింది.

కొత్త లబ్ధిదారులకు రైతుబంధు

- నమోదుకు సర్కారు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా పట్టాదార్ పాస్ బుక్ వచ్చిన రైతులకు ఈ వానాకాలం సీజన్‌లో రైతుబంధుకు అవకాశం కల్పించారు. జూన్ 16 నాటికి పాస్ బుక్ వచ్చిన ప్రతి రైతుకు రైతుబంధు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకం కింద సాయం పొందడానికి కొత్త పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సు కాపీలను స్థానిక ఏఈవోలకు అందజేయాల్సి ఉంటుంది. బుధవారం నుంచే ఏఈవోలకు రైతుబంధు పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి తెచ్చారు. సీసీఎల్ఏ డేటా ఆధారంగా రైతులను గుర్తిస్తారు. రైతు పట్టాదారు పాస్‌బుక్ వివరాలను రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. రాష్ట్రంలో సీసీఎల్ఏలో నమోదైన పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన 68.94 లక్షలకు పైగా రైతులు రైతుబంధుకు అర్హులుగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా కొత్త లబ్ధిదారుల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఈనెల 26 నుంచే రైతుబంధు పెట్టుబడి సాయం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

రామోజీ రాసిందే రసీదు!

ష్యూరిటీ పేరుతో అక్రమంగా డిపాజిట్ల సేకరణ

- పాన్ నంబర్, ఆధార్ ఉండదు
- బ్యాంకు ఖాతా ఊసే లేదు
- తనకు తోచినంత వడ్డీ రేట్ల నిర్ణయం
- ఆర్బీఐ నిబంధనలు బేఖాతర్
- మార్గదర్శి ముసుగులో 'నల్ల' దందా!

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ సంస్థలో చిట్టీపాట పాడిన చందాదారులకు ఆ చిట్టీ మొత్తాన్ని చెల్లించకుండా కొంత మొత్తాన్ని తమ వద్ద డిపాజిట్‌గా ఉంచుకుంటోంది. ఈమేరకు ఓ రసీదు ఇస్తోంది. ఆ చిట్టీకి సంబంధించి మిగిలిన చందాల చెల్లింపునకు ష్యూరిటీగా ఆ మొత్తాన్ని తమ వద్ద డిపాజిట్‌గా ఉంచుతున్నట్లు చెబుతోంది! అలా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు చందాదారుల నుంచి రసీదు రూపంలో డిపాజిట్లను సేకరిస్తోంది. ఆ డిపాజిట్లపై 4-5 శాతం వడ్డీ చెల్లిస్తామంటోంది. కొన్ని దశాబ్దాలుగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సాగిస్తున్న ఆర్థిక అక్రమాల దందా ఇదీ! చందాదారులు మునుముందు చెల్లించాల్సిన చందా మొత్తానికి ష్యూరిటీగా ఆ నగదును అట్టిపెట్టుకుంటున్నట్లు మార్గదర్శి చిట్ ఫండ్స్ తరపున రామోజీరావు తమ పత్రికలో ఈనాడు అడ్డగోలుగా వాదిస్తున్నారు. ఆర్థిక సంస్థల నిర్వహణకు సంబంధించి ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ఉల్లంఘిస్తున్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాటవేస్తున్నారు.

అవి అక్రమ డిపాజిట్లే...

ఏదైనా ఓ ఆర్థిక సంస్థ తమ ఖాతాదారుల నగదును తమ వద్ద అట్టిపెట్టుకుని దానిపై వడ్డీ చెల్లిస్తామని లిఖితపూర్వకంగా తెలిపితే వాటిని డిపాజిట్లుగానే పరిగణిస్తారు. అలా డిపాజిట్లు సేకరించాలంటే ఆర్బీఐ నిబంధనలను అనుసరించాలి. ఆ నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లు వసూలు చేయకూడదు. మార్గదర్శి మాత్రం చిట్‌ఫండ్స్ రసీదు ముసుగులో డిపాజిట్లను సేకరిస్తోంది.

ష్యూరిటీగా నగదు డిపాజిట్లు తీసుకోకూడదు

చిట్‌ఫండ్స్ సంస్థలు తమ వద్ద చిట్టీ పాడిన చందాదారుల నుంచి ష్యూరిటీ తీసుకునేందుకు కేంద్ర చిట్ ఫండ్స్ చట్టం అనుమతిస్తోంది. ఈమేరకు నిర్దిష్ట విధానాలను కూడా స్పష్టం చేసింది.

రసీదుల ముసుగులో అక్రమ డిపాజిట్లు

ఓ చందాదారుడి నుంచి రూ.2.20 లక్షలు డిపాజిట్ రూపంలో తీసుకున్న నగదుకు ప్రతిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఇచ్చిన రసీదు ఇదీ! భవిష్యత్ చందాలకు సెక్యూరిటీ పేరుతో ఇలా దశాబ్దాలుగా అక్రమంగా డిపాజిట్లను సేకరి స్తోంది. ఆర్బీఐ నిబంధనలను లెక్క చేయకుండా, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథే చ్ఛగా ఉల్లంఘిస్తోంది. - **స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ,సీఐడీ అధికారుల తనిఖీల్లో ఈ బాగోతం బట్టబయలైంది.**



మార్గదర్శి చిట్ ఫండ్స్ ష్యూరిటీ పేరిట రసీదు రూపంలో సేకరిస్తున్న డిపాజిట్ పత్రం

జాతీయ / షెడ్యూల్డ్ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల పత్రాలు, బంగారు ఆభరణాలు, లైఫ్ ఇన్సూరెన్స్ పత్రాలు, స్థిరాస్తి పత్రాలు, ముగ్గురు వ్యక్తుల హామీని ష్యూరిటీగా పరిగణించేందుకు అవకాశం ఉంది. అంతేగానీ చిట్టీ పాట కింద తాము చెల్లించాల్సిన మొత్తంలోనే కొంత మొత్తాన్ని ష్యూరిటీగా అట్టిపెట్టుకోడానికి వీలులేదు. అలా కొంత మొత్తాన్ని చిట్‌ఫండ్ సంస్థలు తమ వద్ద ఉంచుకుంటే దాన్ని డిపాజిట్ల సేకరణగానే పరిగణిస్తారు. చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లను సేకరించడం చట్ట విరుద్ధం కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే అవుతాయి.

నల్లధనం దందానే...!

ష్యూరిటీ పేరుతో సేకరిస్తున్న డిపాజిట్లకు జారీ చేస్తున్న రసీదులో కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలను ఉల్లంఘిస్తోంది. వాటిపై చందాదారుడి పాన్ నంబరు పొందుపరచడం లేదు. చందాదారుల పాస్ పుస్తకంలో వారి బ్యాంకు ఖాతా వివరాలుగానీ ఆధార్ నంబరుగానీ ఉండటం లేదు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సదరు వ్యక్తుల పాన్ కార్డ్, ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆర్బీఐ స్పష్టం చేస్తోంది. నల్లధనాన్ని అరికట్టేందుకు ఈమేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రసీదు రూపంలో అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చెలామణిలోకి తెస్తున్నట్లు సీఐడీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ(ఈడీ)కి నివేదించారు.

నా డిపాజిట్లు.. నా వడ్డీ!

దేశంలో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ సంస్థలు తమ ఖాతాదారులకు చెల్లించాల్సిన వడ్డీ రేట్లను నిర్ణయించేందుకు ఆర్‌బీఐ నిర్దిష్ట విధానాలను రూపొందించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ మాత్రం రసీదు రూపంలో తమ చందాదారుల నుంచి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లకు వడ్డీ రేటును ఎలా నిర్ణయిస్తోందో ఆ రహస్యం రామోజీకే తెలియాలి! 6 నెలల నుంచి 12 నెలల వరకైతే 4 శాతం, ఏడాది పైబడితే 5 శాతం వడ్డీ చెల్లిస్తామని రసీదులో మార్గదర్శి పేర్కొంటోంది. వడ్డీ రేటును ఏ ప్రాతిపదికన నిర్ణయించారని సీఐడీ అధికారులు ప్రశ్నిస్తే సమాధానం లేదు.

అక్రమ డిపాజిట్ల కట్టడికే బీయూడీఎస్ చట్టం

దేశంలో వివిధ రూపాల్లో సాగుతున్న అక్రమ డిపాజిట్ల దందా కట్టడికి కేంద్ర ప్రభుత్వం 2019లో బ్యానింగ్ ఆఫ్ నాన్ రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్(బీఎస్‌డీఎస్) చట్టాన్ని తెచ్చింది. ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్స్ సంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తులు యథేచ్ఛగా వివిధ రూపాల్లో అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నియంత్రణ లేని డిపాజిట్లపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా వాటిని నిషేధించేందుకు చట్టం చేసింది. కేంద్ర చట్టానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభు త్వం 2022లో మార్గదర్శకాలను జారీ చేసింది. సీఐడీ విభాగం ఆ చట్టం ప్రకారమే మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీంతో తమ బండారం బట్టబయలవుతోందని మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ గగ్గోలు పెడుతోంది.

యునెస్కో గుర్తింపు దిశగా అడుగులు

ముడుమాల్ నిలువురాళ్లను సందర్శించిన దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్



నిలువురాళ్లను పరిశీలిస్తున్న దక్కన్ హెరిటేజ్ సభ్యులు

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లో కృష్ణా నది పక్కన ఉన్న నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని దక్కన్ హెరిటేజ్ అధికారి వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్లారావు అన్నారు. బుధవారం సాయంత్రం నిలువురాళ్ల (మెగాలిత్ బరియల్స్)ను వారు సందర్శించి గుర్తింపునకు అవసరమయ్యే ఫొటోలు తీసుకున్నారు. ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చే విషయంపై ఇప్పటికే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆదిమానవులు కాలాన్ని, రుతువులను తెలుసుకునేందుకు నిలువురాళ్లను ఏర్పాటు చేసినట్లుగా ఇదివరకే పురావస్తుశాఖ వారు గుర్తించారు. ఇవి ఆసియా ఖండంలోనే మొదటివని, ఇలాంటివి కేవలం ఆఫ్రికా ప్రాంతంలో కనిపిస్తాయని గతంలోనే పుల్లారావు తెలిపారు.

'రైతుకు మద్దతు ధరల చట్టం కోసం పోరాడతాం'

ఖమ్మం మయూరిసెంటర్: తెలంగాణలో పత్తికి కేంద్రం మద్దతు ధర రూ.6 వేలు మాత్రమే అందిస్తోందని.. తద్వారా క్వింటాకు రూ.10 వేల చొప్పున ఒక తెలంగాణలోనే ఏటా పత్తి రైతులు రూ.30 వేల కోట్లు నష్టపోతున్నారని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు, ఆలిండియా కిసాన్ సభ జనరల్ సెక్రటరీ విజ్జూ కృష్ణన్ వెల్లడించారు. ఖమ్మంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉత్పత్తి ఖర్చుకు తగిన మద్దతు ధర లేక ఆంధ్రప్రదేశ్‌లో ఒక సీజన్‌లో వరి రైతులు రూ.14 వేల కోట్లు నష్టపోతున్నారని చెప్పారు. పంట ఉత్పత్తి ఖర్చులు పెరిగినా మద్దతు ధరల్లో మార్పు రాకపోవడంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని వాపోయారు. దీంతో ఉత్పత్తి ఖర్చుకు తగినట్లు మద్దతు ధరలు ప్రకటించేలా సంయుక్త కిసాన్ మోర్చా పోరాటాలకు పిలుపునిచ్చిందని విజ్జూకృష్ణన్ తెలిపారు. ఆగస్టు 9న క్విట్ ఇండియా, సెప్టెంబర్ నుంచి పాదయాత్ర, జాతాలు, ర్యాలీలు నిర్వహిస్తామని వివరించారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెలాఖరు నుంచి ఉద్యమాలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడించారు.

చేరిన వైద్య కళాశాలలోనే చదువు పూర్తి

- మరో వైద్య కళాశాలకు బదిలీ కుదరదు
- రెండేళ్లలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి
- ఎంబీబీఎస్‌లో ఎన్ఎంసీ కీలక మార్పులు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ వైద్య విద్యలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పలు కీలక మార్పులు చేసింది. 2023-24 వైద్య విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల బదిలీలు, ఇంటర్న్ షిప్, ఇతర అంశాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కౌన్సెలింగ్ ద్వారా సీటు వచ్చిన కళాశాలల్లో చేరి, రెండో ఏడాదిలో పలువురు విద్యార్థులు మరోచోటికి బదిలీ చేయించుకుంటున్నారు. ఈ విధానాన్ని ఎన్ఎంసీ ఎత్తివేసింది. ఎంబీబీఎస్ చదివిన వారు ఇకపై పదేళ్ల కాల పరిమితిలో కాకుండా రెండేళ్లలోనే ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలి. పైగా ఏ వైద్య కళాశాలలో చేరితే అక్కడే ఇంటర్న్‌షిప్‌ను చేయాల్సి ఉంటుంది. కొంతమంది తాము చదివిన కాలేజీల్లో కాకుండా.. మరోచోట చేస్తున్నారు. కాగా ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్‌లో చేరే విద్యార్థులు తప్పకుండా నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్స్ట్) రాయాల్సి ఉంటుంది. 2019లో ఎంబీబీఎస్‌లో చేరిన వారికి ఈ సంవత్సరం కూడా ప్రస్తుత విధానంలోనే పరీక్షలు జరుగుతున్నాయి. తరువాత సంవత్సరాల్లో చేరిన వారికి ఎప్పటి నుంచి 'నెక్స్ట్' విధానం అమల్లోకి వస్తుందన్న దానిపై స్పష్టత రాలేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి జాతీయ స్థాయిలో ఎన్ఎంసీ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ ఉమ్మడి ప్రవేశాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌కు రూపకల్పన చేస్తున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలకు అనుగుణంగా రాష్ట్రాల వారీగా మెరిట్ జాబితాలు త్వరలో కేంద్రం నుంచి రానున్నాయి. ఇవి వచ్చిన అనంతరం ఆరోగ్య విశ్వవిద్యాలయాలు షెడ్యూల్ ప్రకటిస్తాయి. దీనికి అనుగుణంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది.

'ఆధ్యాత్మికతతో ఒత్తిడి దూరం'

సాక్షి, హైదరాబాద్ : ఆధ్యాత్మికతతో ఒత్తిడిని అధిగమించవచ్చునని, పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణతో ఒత్తిడికి గురికాకుండా ఆధ్యాత్మికతకు సమయం కేటాయించాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పేర్కొన్నారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా...

మండలి ఎదుట అధ్యాపకుల ధర్నా

సాక్షి, హైదరాబాద్: వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల్ని తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ నేతృత్వంలో బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. 14 రోజుల్లో తమ సమస్యను పరిష్కరించకపోతే అన్ని యూనివర్సిటీల్లోనూ సమ్మె చేస్తామని మండలి చైర్మన్‌కు జేఏసీ నేతలు నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, వర్కింగ్ చైర్మన్ డాక్టర్ ఎం.రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

30న చలో ప్రగతిభవన్

- లంబాడీ హక్కుల పోరాట సమితి పిలుపు
- హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్



చలో ప్రగతిభవన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట (హైదరాబాద్): ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజన హక్కులను తుంగలో తొక్కుతూ బంధుప్రీతిని చాటుకుంటున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ సంచాలకుడు గడల శ్రీనివాస్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్), ఎస్సీ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. వెంటనే అతనిపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 30న ప్రగతిభవన్ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చలో ప్రగతిభవన్ పోస్టర్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్, బీసీ నాయకురాలు ఎస్.కె.ప్రసన్న, ఆదివాసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయం సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శ్రీనివాసరావు ప్రభుత్వాధికారిగా కాకుండా బీఆర్‌ఎస్ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు యత్నిస్తున్నాడని దీంతో తమ సమీప బంధువులను ఎలాంటి ప్రభుత్వ నోటిఫికేషన్లు లేకుండా, జిల్లా కమిటీ తీర్మానాలు లేకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఏఎన్‌ఎం ఉద్యోగ నియామకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆశయాలు నెరవేర్చకుండా స్తూపం కడితే సరిపోతుందా

బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ



సాక్షి, హైదరాబాద్: అమరుల త్యాగాలు మరిచి వారి ఆశయాలైన ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఓ స్తూపం కడితే సరిపోతుందా అని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. కేవలం స్తూపం ఏర్పాటుకే అమరులైన వారి ఆత్మలు శాంతించవన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...అన్ని ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగ ఖాళీలు భర్తీచేయడమే వారికిచ్చే అసలైన నివాళి అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉద్యమ లక్ష్యాలతో పాటు అమరుల ఆశయాల సాధనకు కృషి చేస్తామని చెప్పారు.

పీఎల్‌జీఏ సభ్యుడి హతం

అసభ్య ప్రవర్తనకు మావోయిస్టుల శిక్ష

చర్ల: మహిళా మావోయిస్టులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న పీఎల్‌జీఏ సభ్యుడిని మావోయిస్టులు ప్రజాకోర్టు నిర్వహించి హతమార్చారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకోగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పీఎల్‌జీఏ 17వ బెటాలియన్‌కు చెందిన మను దుగ్గ పార్టీలో పనిచేస్తున్న మహిళా మావోయిస్టులపై అసభ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయనపై మహిళా మావోయిస్టులు అగ్ర నాయకులకు ఫిర్యాదు చేయగా.. వారు పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. ఈ నేపథ్యాన మంగళవారం కాంకేర్ జిల్లాలోని దండకారణ్య ప్రాంతంలో ప్రజాకోర్టు నిర్వహించిన మావోయిస్టులు ఆయనను హతమార్చారు. ఈ మేరకు లేఖను కూడా మృతదేహం వద్ద వదిలారు. కాగా, మావోయిస్టులు హతమార్చిన పార్టీ పీఎల్‌జీఏ సభ్యుడు మను దుగ్గపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డు ప్రకటించింది.

టీటీడీపీ పార్లమెంటు స్థానాల అధ్యక్షుల నియామకం

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియలో భాగంగా పలు పార్లమెంటు నియోజకవర్గాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షునిగా అలీ మస్కతి, సికింద్రాబాద్ అధ్యక్షునిగా పిన్నమనేని సాయిబాబా, పెద్దపల్లి అధ్యక్షునిగా బి.సంజయ్ కుమార్‌ను నియమించారు. ఈ మూడు నియోజకవర్గాలకు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో పాటు పూర్తి కార్యవర్గాన్ని నియమించారు.

మన స్మారకం.. ఘన నిర్మాణం

తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రారంభం నేడు.. ప్రపంచంలో నాలుగో స్థానం

సాక్షి, హైదరాబాద్: ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్ర అవతరణను సాకారం చేసిన తెలంగాణ అమరవీరుల స్మారకార్థం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్మారకం గురువారం ప్రారంభం కానుంది. హుస్సేన్‌సాగర్ తీరంలో గతంలో ఉన్న లుంబినీపార్కు స్థలంలో సచివాలయ భవనానికి ఎదురుగా నిర్మించిన ఈ స్మారకాన్ని గురువారం సాయంత్రం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. అతుకుల్లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించిన ఈ కట్టడం నగరంలో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతోంది. అద్దంతో నిర్మించినట్టుండే ఈ కట్టడం ప్రపంచంలోనే నాలుగోది కావటం విశేషం. జర్మనీ తయారీ స్టెయిన్‌లెస్ స్టీల్‌ను దుబాయ్‌లో నిపుణులు ప్రీఫ్యాబ్రికేటెడ్ చేసి నగరానికి తరలించి అతికించి రూపొందించారు. కేవలం జర్మనీ తయారీ స్టెయిన్‌లెస్ స్టీల్‌కే దాదాపు రూ.50కోట్లు వ్యయం చేశారు. రూ.177 కోట్ల వ్యయంతో ఆరు అంతస్తుల్లో నిర్మించిన ఈ భవనం 26,800చ.మీ.ల విస్తీర్ణంలో రూపొందింది. 45 మీటర్ల ఎత్తుతో దీపం జ్వలిస్తున్నట్టు ప్రమిద ఆకారంలో నిర్మించిన ఈ భవనం ఆకట్టుకుంటోంది.




ప్రపంచంలో ఈ తరహా నిర్మాణాలివి..

➤ **క్లౌడ్ గేట్:** ఇది అమెరికాలోని ప్రధాన నగరాల్లో ఒకటైన చికాగోలో ఉంది. అక్కడి సముద్రం ఒడ్డున భారీ ఆకాశహర్మ్యాల ప్రతిబింబాలతో అత్యంత సుందరంగా ఉంటుంది. ఎత్తయిన భవనాలు మేఘాలను తాకేలా ఉంటాయని 'క్లౌడ్ గేట్'పేరుతో దీన్ని మిలీనియం పార్కులో ఏర్పాటు చేశారు. భారత్‌లో పుట్టి బ్రిటిష్ ఆర్కిటెక్ట్‌గా స్థిరపడ్డ అనీశ్ కపూర్ దీన్ని డిజైన్ చేశారు. లిక్విడ్ మెర్క్యురీ ఇతి వృత్తంగా రూపకల్పన చేసినప్పటికీ అది చిక్కుడు గింజ ఆకారంలో ఉండటంతో 'ది బీన్'గా ఖ్యాతి పొందింది. ఇందుకు 168 భారీ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లను వినియోగించారు. ఇది 66 అడుగుల పొడవు 33 అడుగుల ఎత్తు ఉంది. 2004లో నిర్మాణం మొదలై 2006లో ప్రారంభమైంది.



➤ **బిగ్ ఆయిల్ బబూల్:** ఇది చైనాలోని కార్మే నగరంలో కొలువు దీరింది. ఆధునిక చైనా రూపకల్పనలో అక్కడి ప్రభుత్వం 1955 ప్రాంతంలో కార్మేలో చమురు బావుల తవ్వకం చేపట్టింది. తొలి బావి 1956లో అందుబాటులోకి వచ్చింది. ఆ నగరం చమురు కేంద్రం అన్న భావన వచ్చేలా 'బిగ్ ఆయిల్ బబూల్'పేరుతో స్థానికంగా దీన్ని నిర్మించారు. చికాగోలోని క్లౌడ్ గేట్‌కు నకలుగా ఉన్నా.. చైనా మాత్రం కాదంటోంది. దాదాపు 250 స్టెయిన్‌లెస్ స్టీల్ షీట్లతో దీన్ని 2013లో రూపొందించారు. కానీ ఇది చికాగో నిర్మాణం తరహాలో లేదన్న విమర్శలు మాత్రం వినిపించాయి.



➤ **దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియం:** భారీ స్టెయిన్‌లెస్ స్టీల్ షీట్లతో నిర్మించిన మూడో కట్టడం ఇది. ఆధునిక నిర్మాణాలకు కేంద్రంగా దుబాయ్ నిలుస్తోందని చెప్పే ఉద్దేశంతో యూఏఈ ప్రభుత్వం నిర్మించింది. నాలుగు అంతస్తులుగా ఉండేలా 225 అడుగుల ఎత్తు, 17600 చదరపు మీటర్ల వైశాల్యంతో దీన్ని నిర్మించారు. ఇందులో ఎగ్జిబిషన్లు, ఇతర ప్రదర్శనలు, సదస్సులు నిర్వహిస్తారు. ఆధునిక దుబాయ్ లక్ష్యాన్ని అరబ్బీ అక్షరాల్లో తీర్చిదిద్దారు. మనం వందల ఏళ్లు బతకలేకపోయినా, మన ఆధునిక ఆవిష్కరణలు వందల ఏళ్లు మనుగడ సాగిస్తాయన్న ప్రారంభంతో ఆ పద్యం ఉంటుంది. దీన్ని 2016లోనే నిర్మించినా, 2022లో పూర్తి చేసి అధికారికంగా ప్రారంభించారు.



ట్రాక్టర్.. ఆర్టీసీ బస్సు ఢీ

- అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లిన బస్సు
- 20 మందికి తీవ్రగాయాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన
- ఘటనపై మంత్రి కేటీఆర్, వినోద్‌కుమార్ ఆరా



బోల్తాపడిన బస్సు



గాయపడిన గర్భిణి

ఇల్లంతకుంట (మానకొండూర్): ఇద్దరు డ్రైవర్ల అజాగ్రత్త 43 మంది ప్రయాణికుల ప్రాణాలమీదకు తెచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల శివారులో సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు–ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు 43 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వెళ్తోంది. మండలంలోని వల్లంపట్ల శివారుకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్– ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. దీంతో బస్సు రోడ్డుకింద ఉన్న కందకంలోకి దూసుకెళ్లి ఒకవైపు ఒరిగింది. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ హరి చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నాడని ప్రయాణికులు చెబుతున్నారు. మట్టి రోడ్డు నుంచి మెయిన్ రోడ్‌పైకి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్ కూడా వాహనాన్ని అదుపుచేయలేకపోవడంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులోని 20 మందికి తీవ్రగాయాలుకాగా, మిగతా వారికి స్వల్పగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై కొమురవెల్లి రాజేశ్, తహసీల్దార్ నరేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఏడుగురిని ఎస్సై తన వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రుల నరకయాతన..

బస్సు బోల్తాపడటంతో అందులో ఉన్న 44 మంది ఒకరిపైఒకరు పడిపోయారు. సీట్ల కింద చేతులు, కాళ్లు ఇరుక్కుపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ఎమర్జెన్సీ డోర్‌నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. రెడ్డవేని పూజ, చుక్క లావణ్య అనే ఇద్దరు గర్భిణులు గాయాలతో నరకయాతన అనుభవించారు. రహీంఖాన్‌పేటకు చెందిన రెండేళ్ల చిన్నారి సంగెం వేదశ్రీ సీటుకింద ఇరుక్కుపోయి విలవిల్లాడింది. గైని పవిత్ర, సంగెం వేదశ్రీ, సంగెం రేణుక, చుక్క అంజవ్వ, అనిత, పెంటల లక్ష్మి, మల్లయ్య, బడుగు నర్సవ్వ, గంగాధర రాజవ్వ, లింగారెడ్డి, రాములు, పండుగ లింగయ్య, సమ్మెట బాలయ్య, సింగరి శిరీష, సింగరి శ్రావణి, ఎండీ.ఇసాక్ తీవ్రంగా గాయపడ్డారు.

మంత్రి కేటీఆర్ ఆరా..

బస్సు ప్రమాదంపై మంత్రి కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణుకు ఫోన్‌చేసి ఆరా తీశారు. కలెక్టర్‌తో మాట్లాడి క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని వెంటనే నిమ్స్‌కు తరలించాలని సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సిరిసిల్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయించారు.

ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ హత్యకు కుట్ర

- ఓ గ్యాంగ్‌కు రూ.50 లక్షల సుపారీ
- కుట్రలో మరో కళాశాల చైర్మన్
- డీసీఎంతో కారును ఢీకొట్టి చంపేందుకు ప్లాన్
- రెండుసార్లు తృటిలో తప్పించుకున్న కరస్పాండెంట్

కోదాడ: ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్‌ను హత్య చేయించేందుకు కుట్రపన్ని ప్లాన్ అమలు చేయడంలో విఫలం కావడంతో పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఈ కుట్ర వెనుక మరో కళాశాల చైర్మన్‌తో పాటు ఇద్దరు ప్రభుత్వోద్యోగులు కూడా సూత్రధారులుగా ఉండటం గమనార్హం. సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈఘటన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని గేట్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ బాదే కాంతారావుకు అతని భాగస్వాములతోపాటు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నీల సత్యనారాయణకు మధ్య కొంతకాలంగా విభేదాలున్నాయి. కోర్టులలో కేసులు కూడా నడుస్తున్నాయి. కాగా, కాంతారావును చంపాలనుకుని వీరంతా కుట్రపన్ని ఓ గ్యాంగ్‌కు రూ.50లక్షల సుపారీ ఇచ్చారు. డీసీఎం వ్యాన్‌తో కాంతారావు కారును గుద్ది చంపేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న ఉదయం కాంతారావు సూర్యాపేట కోర్టుకు కారులో వెళ్లి వస్తుండగా అతడిని డీసీఎం వ్యాన్‌తో మునగాల మండలం మొద్దులచెరువు వద్ద ఢీకొట్టేందుకు యత్నించగా వీలుకాలేదు. ప్రమాదం తప్పిందని భావించిన కాంతారావు ఇంటికి వచ్చి భోజనం చేసి అదే కారులో కట్టకొమ్ముగూడెం రోడ్డులో ఉన్న కళాశాలకు బయల్దేరారు. ఇదేసమయంలో డీసీఎం వ్యానుతో బాబునగర్‌సమీపంలో మరోసారి కాంతారావు కారును ఢీకొట్టేందుకు ప్రయత్నించగా తృటిలో తప్పించుకున్న ఆయన వ్యాన్ డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ కుట్ర వెనుక కొర్ర రాంకుమార్, బైరు వెంకటేశ్వర్లు, పెండ్ర రాము, చందాకోటేశ్, బాదే లింగయ్య, తొగరు శ్రీనివాసరావు, పోకల శ్రీనివాసరావు, బుద్దే రామ్మూర్తి, బాదే రాజారావు, బాదే ఆంజనేయులు, నీల సత్య నారాయణ, గన్ను నాగేశ్వరరావుతో సహా 12 మంది సూత్రధారులు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేయగా..మిగిలిన ఐదుగురు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన వారిని బుధవారం కోదాడ కోర్టుకు హాజరుపరచగా...వారికి రిమాండ్ విధించింది. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బాలికపై బీఆర్‌ఎస్ నాయకుడి అత్యాచారం

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలికపై అదే కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొత్తపల్లి రవీందర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శక్కర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మైనర్ బాలికకు తండ్రి లేకపోవడంతోపాటు తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం రవీందర్ ఆ బాలికను వారి ఇంటి సమీపంలోని తన మేకల షెడ్డులోకి లాక్కెళ్లి కాళ్లు, చేతులు బంధించి నోట్లో గుడ్డలు కుక్కి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. కాగా, బాలిక ఈ విషయాన్ని మంగళవారం బంధువులతో తెలిపింది. వారు రవీందర్ సోదరుడైన బీఆర్‌ఎస్ బోధన్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రాధాకృష్ణ ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. దీంతో రవీందర్‌తో పాటు రాధాకృష్ణ.. విషయం బయటకు చెబితే చంపేస్తామని బాధితులను బెదిరించారు. అత్యాచారం విషయం బుధవారం బయటకు పొక్కడంతో పోలీసులు వెంటనే రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రవీందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నిందితుడి సోదరుడు రాధాకృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్యే షకీల్

బాలికపై అత్యాచారం జరిగిన విషయం తెలియటంతో ఎమ్మెల్యే షకీల్ దంపతులు బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. నిందితుడు రవీందర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని, అతని సోదరుడు రాధాకృష్ణను కూడా ఫ్లోర్‌లీడర్ పదవి నుంచి సస్పెండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకటించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

డబుల్ పేరిట డబ్బులు దండుకుని

- స్వచ్ఛంద సంస్థ పేరుతో నాలుగు జిల్లాల్లో రూ.20కోట్ల మేరకు వసూళ్లు
- రూ.4.5లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని ఆశ
- మొదటి కిస్తీగా రూ.1.65లక్షలు చెల్లింపు
- రూ.20వేల ఐరన్, సిమెంట్ పంపిణీ చేసి ఉడాయించిన వ్యక్తులు
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామంలో పిల్లర్లు వేసి వదిలిన దృశ్యం



అగ్రిమెంట్ రాసుకున్న హోలీవర్డ్ స్వచ్ఛంద సంస్థ


సాక్షి, మహబూబాబాద్/ ఇల్లందు/ గూడూరు: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు, గిరిజనుల అమాయకత్వం, పేదరికాన్ని ఆసరా చేసుకుని స్వచ్ఛంద సంస్థ ముసుగులో తక్కువ ధరకే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టిస్తామని వారి నుంచి రూ.20 కోట్ల మేర డబ్బులు దండుకున్నారు. ఇళ్లు కట్టిస్తున్నామని ఐరన్, సిమెంట్ పంపిణీ చేసి ఉడాయించేశారు. ఇంటిసామగ్రి తెస్తామని చెప్పి వెళ్లిన వారు రెండేళ్లుగా పత్తా లేకపోవడంతో బాధితులు చివరికి పోలీసుల్ని ఆశ్రయించగా అసలు విషయం బయటకొచ్చింది. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, ములుగు జిల్లాల్లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

స్వచ్ఛంద సంస్థ పేరుతో వచ్చి...

పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పి హోలీవర్డ్ సొసైటీ పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థ 2020లో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, ములుగు జిల్లాల్లో కొంత మంది ఏజెంట్లను నియమించుకుంది. కేవలం రూ.4,50,000లకే 693 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏజెంట్లను ఏజెన్సీ ప్రాంతాల్లోకి పంపించి ప్రచారం చేయించింది. వీరి మాటల్ని నమ్మేందుకుగాను పలుచోట్ల స్వచ్ఛంద సంస్థకు చెందిన అనుచరుల ఇళ్లను చూపించేవారు. తాము నిర్మించబోయే ఇళ్లకు 120 గజాల స్థలం ఉంటే చాలని, మొదటి కిస్తీగా రూ.1,65,000 చెల్లిస్తే సరిపోతుందని ప్రచారం చేయడంతో వీరిని నమ్మి డబ్బులు కట్టేందుకు మూడు జిల్లాల నుంచి గిరిజనులు ముందుకొచ్చారు. ఇలా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.15వేల నుంచి రూ.1,80,000 వరకు కట్టించుకున్నారు. ఇలా డబ్బులు చేతికిరాగానే ఇళ్లు కట్టేస్తున్నామని చెబుతూ కొంతమందికి ఐరన్, సిమెంట్ తెచ్చి పిల్లర్లు వేసి మిగతా వారిని కూడా నమ్మించారు. దీంతో మిగిలిన వారూ డబ్బులు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ విధంగా మూడు జిల్లాల్లో మొత్తం రూ.20 కోట్ల మేర వసూళ్లు చేశారు. రెండో కిస్తీ కట్టాకే మిగతా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పి సంస్థకు చెందిన ఏజెంట్లను ఉద్యోగాల నుంచి తీసేశారు. తర్వాత సంస్థ అడ్రస్‌ను కూడా మార్చేశారు. సంస్థకు చెందిన ఫోన్లను కూడా స్విచ్ఛాఫ్ చేసేశారు. రెండేళ్లుగా వీరంతా పత్తా లేకుండాపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన కొంతమంది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిగిలినవారు కూడా ఆయా జిల్లాల్లో ఫిర్యాదు చేసేందుకు వస్తున్నారు.

ఆ ఫీజు తిరిగి ఇవ్వాల్సిందే..

హైకోర్టులోఎంబీబీఎస్ విద్యార్థుల వాదన



సాక్షి, హైదరాబాద్: వైద్య కళాశాలలు 2017–20 విద్యా సంవత్సరంలో తమనుంచి ఎక్కువ మొత్తంలో వసూలు చేసిన ఫీజులు తిరిగి చెల్లించాల్సిందేనని ఎంబీబీఎస్ విద్యార్థులు హైకోర్టులో వాదించారు. 2022లో ఇదే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించేలా ఉత్తర్వులు జారీ చేయాలని వారి తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే తమ వాదనలు వినకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని, వాదనలు వినాలని వైద్య కళాశాలల యాజమాన్యాలు వాదించాయి. 2017–20 విద్యా సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వం ఫీజులు నిర్ణయిస్తూ జారీ చేసిన జీవోలను గతంలో హైకోర్టు రద్దు చేసింది. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎస్ఆర్) సిఫార్సుల మేరకు ఫీజులు ఉండాలంది. ఈ ఉత్తర్వులు అమలు కాలేదంటూ కోర్టు ధిక్కార పిటిషన్‌లతో పాటు కళాశాలలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాలని, ఎక్కువ వసూలు చేసిన మొత్తాలను విద్యార్థులకు తిరిగి చెల్లించాలన్న ఉత్తర్వుల్ని కళాశాలలు అమలు చేయలేదని సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. టీఏఎఫ్ఆర్సీ సిఫార్సుల మేరకు ఫీజులు ఉండాలన్న హైకోర్టు ఉత్తర్వులు అమలు కాలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వుల్ని సుప్రీంకోర్టు కూడా ఆమోదించిందని చెప్పారు. ప్రైవేటు కళాశాలల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీరఘురాం, దామా శేషాద్రినాయుడు వాదించారు. టీఏఎస్ఆర్సీ 2016 నుంచి ఫీజులు పెంచలేదని, ఆ కమిటీ ఫీజులను నిర్ణయిస్తే అభ్యంతరం లేదని చెప్పారు. 2017–20 విద్యా సంవత్సరాలకు సర్కార్ పెంచిన ఫీజుల పెంపు నామమాత్రమేనని వివరించారు. దీన్ని సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉందని చెప్పారు. విద్యార్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ల విచారణ సమయంలో కాలేజీల వాదనలు వినలేదని, మరోసారి వినాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం .. తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది.

'ఇది కదా... బంగారు తెలంగాణ' పుస్తకం ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల సంస్థ ప్రజాసంబంధాల అధికారి మేడిశెట్టి రమేశ్ రచించిన 'ఇది కదా... బంగారు తెలంగాణ'పుస్తకాన్ని సీఎం కేసీఆర్ బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొమ్మిదేళ్లలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సాధించిన ప్రగతి, విజయాలపై ఈ పుస్తకాన్ని రచించారు. ఈ మేరకు రచయిత రమేశ్ ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి పుస్తకాన్ని అందించారు. పౌరసరఫరాల సంస్థ రచించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయడం పట్ల సీఎం అభినందించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎస్ రావు

కేన్సర్ చికిత్సలో ఎమ్మార్ లినాక్ ఓ విప్లవం

యశోద హాస్పిటల్స్ ఎండీ జీఎస్ రావు

హైదరాబాద్: కేన్సర్ చికిత్సలో ఎమ్మార్ లినాక్ రేడియేషన్ టెక్నాలజీ నూతన విప్లవమని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఎస్ రావు అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద హాస్పిటల్స్ రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో ఎమ్మార్ – లినాక్ రేడియేషన్ టెక్నాలజీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ.. కేన్సర్ చికిత్సల్లో కీలక మార్పులు తీసుకొచ్చే లినాక్ ఎమ్మార్ యంత్రాన్ని దేశంలోనే తొలిసారిగా యశోద హాస్పిటల్స్‌లో నెలకొల్పామన్నారు. ఈ సాంకేతికతతో కేన్సర్ చికిత్సలో క్రిస్టల్ క్లియర్ ఇమేజ్ పొందవచ్చన్నారు. క్లిష్టమైన కేన్సర్లతోపాటు అన్ని రకాల కేన్సర్ చికిత్సల్లో ఇది అద్భుతంగా పనిచేస్తుందని చెప్పారు. సంప్రదాయ రేడియేషన్ థెరపీ సిస్టమ్‌తో పొందలేని ఎన్నో ప్రయోజనాలు ఎమ్మార్ లినాక్ అందిస్తుందని తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూప్రసాద్‌ను కలిసిన టీసీటీజీవోఏ నూతన కార్యవర్గం

ఖమ్మంలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

- అంతకుముందే తల్లికి ఫోన్ చేసి జాగ్రత్తలు చెప్పిన కావ్య
- యువతి స్వస్థలం భద్రాద్రి జిల్లా మద్దుకూరు



కావ్య (ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన కోడెం కృష్ణ – రమాదేవి రెండో కుమార్తె కావ్య(19) ఖమ్మంలోని పారా మెడికల్ కాలేజీలో నర్సింగ్ (ఏఎన్‌ఎం) చదువుతోంది. ఖమ్మం, బీకే బజార్‌లోని ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తూ స్నేహితురాలు సీతామహాలక్ష్మితో కలిసి అద్దె గదిలో ఉంటోంది. మంగళవారం నైట్ డ్యూటీకి వెళ్లి వచ్చిన ఆమె బుధవారం ఉదయం నిద్రపోయింది. స్నేహితురాలు సీతామహాలక్ష్మి విధులకు వెళ్లింది. తరువాత కావ్య మరో స్నేహితురాలు తనుశ్రీ వచ్చి కాసేపు మాట్లాడి తిరిగి కిందకు వెళ్తుండగా పెద్ద శబ్దం వచ్చింది. ఏం జరిగిందోనని తనుశ్రీ వెళ్లి చూడగా కావ్య ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారిని పిలవడంతో వచ్చి కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. తాను మాట్లాడినప్పుడు కావ్య నీరసంగా ఉందని తనుశ్రీ తెలిపింది. ఘటనకు ముందు కావ్య తనకు ఫోన్ చేసి జాగ్రత్తలు చెప్పిందని తల్లి రమాదేవి వెల్లడించింది. తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదంది. తల్లి ఫిర్యాదుతో ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	195	63,523
నిఫ్టీ ▲	40	18,857

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,505	▽	162
డోజోన్స్	34,016	▽	38
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,559	▽	10
డాక్స్	16,023	▽	88
షాంఘై	3,198	▽	42
నికాయ్	33,575	▲	186

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,864	▲	418
బంగారం (99.5 స్వచ్ఛత)	58,628	▲	417
వెండి (కిలో)	70,133	▽	1,958

శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి పిరమల్ ఔట్

బ్లాక్‌డీల్స్‌తో 8.34% వాటా విక్రయం



ముంబై: యూఎస్ పీఈ దిగ్గజం టీపీజీ తదుపరి తాజాగా శ్రీరామ్ ఫైనాన్స్‌లో పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ వాటా విక్రయాన్ని చేపట్టింది. ఓపెన్ మార్కెట్ ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్‌లో గల మొత్తం 8.34 శాతం వాటాను పిరమల్ విక్రయించింది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎంఎఫ్, కొటక్ మహీంద్రా ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇన్సూరెన్స్, బ్లాక్‌రాక్, బీఎన్‌పీ పరిబాస్, సొసైటీ జనరాలి తదితర సంస్థలకు 3.12 కోట్లకుపైగా షేర్లను విక్రయించింది. బ్లాక్ డీల్స్ ద్వారా రూ. 1,545 ధరలో రూ. 4,824 కోట్లకు వాటాను ఆఫర్ చేసింది. సోమవారం శ్రీరామ్ ఫైనాన్స్‌లో 2.65% వాటాను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ. 1,390 కోట్లకు టీపీజీ విక్రయించిన సంగతి తెలిసిందే. ఎంఎఫ్‌లు, సంస్థాగత ఇన్వెస్టర్లు వీటిని కొనుగోలు చేశాయి. కాగా.. బ్లాక్‌డీల్ వార్తల ప్రభావంతో బుధవారం ఎన్‌ఎస్‌ఈలో శ్రీరామ్ ఫైనాన్స్ షేరు 11.3% దూసుకెళ్లి రూ. 1,736 వద్ద నిలిచింది. ఇక మంగళవారం 6% జంప్‌చేసి రూ. 838కు చేరిన పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ బుధవారం మరింత అధికంగా 14.2% దూసుకెళ్లి రూ.958 వద్ద ముగిసింది.

పునర్వ్యవస్థీకరణతో

శ్రీరామ్ గ్రూప్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ తదుపరి పిరమల్ ఎంటర్‌ప్రైజెస్‌కు గ్రూప్‌లోని పలు కంపెనీలలో షేర్లు లభించాయి. ఈ బాటలో శ్రీరామ్ ఫైనాన్స్‌లో 8.34 శాతం వాటాను పొందగా.. శ్రీరామ్ జీఐ హోల్డింగ్స్, ఎల్ఐ హోల్డింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్‌లోనూ 20 శాతం చొప్పున వాటాలు లభించాయి. దీంతో శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 13.33 శాతం, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 14.91 శాతం వాటాను సొంతం చేసుకుంది.

రెండేళ్లలో 35 లక్షలకు ట్యాలీ కస్టమర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ట్యాలీ సొల్యూషన్స్ వచ్చే రెండేళ్లలో తమ కస్టమర్ల సంఖ్యను 35 లక్షలకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఇది 23 లక్షలుగా ఉంది. తెలంగాణలో 1 లక్ష పైగా, ఆంధ్రాలో 70వేల పైచిలుకు కస్టమర్లు ఉన్నారు. కొత్త ట్యాలీ ప్రైమ్ 3.0 వెర్షన్‌ని ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ (సౌత్ జోన్) భువన్ రంజన్ బుధవారం మీడియాకు ఈ విషయాలు తెలిపారు. తాజా వెర్షన్‌ను జీఎస్‌టీలో మార్పులు, చిన్న.. మధ్య తరహా సంస్థల (ఎస్‌ఎంఈ) అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దినట్లు ఆయన చెప్పారు. అలాగే డిజిటల్ పేమెంట్ల ద్వారా సత్వర వసూళ్లకు ఉపయోగపడేలా క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ట్యాలీ సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు శిక్షణ కూడా కల్పిస్తున్నామని రంజన్ చెప్పారు.



ఆకర్షణీయ ఎంప్లాయర్ బ్రాండ్.. టాటా పవర్

- తర్వాతి స్థానాల్లో అమెజాన్, టాటా స్టీల్
- రాండ్‌స్టాడ్ ఇండియా నివేదిక



ముంబై: దేశీయంగా అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ (ఉద్యోగాలు కల్పించే సంస్థ) బ్రాండ్‌గా టాటా పవర్ కంపెనీ అగ్రస్థానంలో నిల్చింది. ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్, ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ వరుసగా రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి. మానవ వనరుల సర్వీసుల సంస్థ రాండ్‌స్టాడ్ ఇండియా తమ వార్షిక నివేదిక 'రాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్‌ఈబీఆర్) 2023'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆర్థిక స్థితి, మంచి పేరు, కెరియర్‌లో పురోగమించేందుకు అవకాశాలు కల్పించడం వంటి మూడు అంశాల ప్రాతిపదికగా రాండ్‌స్టాడ్ ర్యాంకులు ఇచ్చింది. దీని ప్రకారం 2022లో 9వ స్థానంలో ఉన్న టాటా పవర్ తాజాగా నంబర్ వన్ స్థానానికి చేరింది. నివేదిక ప్రకారం ఉద్యోగులు అత్యంత ఆకర్షణీయమైన రంగంగా ఆటోమోటివ్‌కు (77 శాతం) ఓటేశారు. ఐటీ, ఐటీఈఎస్, టెలికం (76 శాతం) .. ఎఫ్‌ఎంసీజీ, రిటైల్, ఈ–కామర్స్ (75 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మరిన్ని విశేషాలు..

- టాప్ 10 కంపెనీల్లో నాలుగో స్థానంలో టీసీఎస్.. ఆ తర్వాత వరుసగా మైక్రోసాఫ్ట్, శాంసంగ్ ఇండియా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, ఐబీఎం, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నాయి. అత్యంత ఆకర్షణీయ స్టార్టప్ ఎంప్లాయర్‌గా బిగ్ బాస్కెట్ నిల్చింది.
- ఎంప్లాయర్‌ను ఎంచుకునేటప్పుడు ఉద్యోగ–వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం, కంపెనీకి ఉన్న పేరు ప్రతిష్టలు, ఆకర్షణీయమైన జీతభత్యాలకు ఉద్యోగార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలు ఎక్కువగా ఉద్యోగ–వ్యక్తిగత జీవితం మధ్య సమతూకాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- అదనపు ఆదాయం కోసం వేరే అసైన్‌మెంట్లు లేదా అదనంగా మరో ఉపాధి మార్గాన్ని ఎంచుకునేందుకు అనుమతించే కంపెనీలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయని 91 శాతం మంది ఉద్యోగులు పేర్కొన్నారు.
- సిబ్బంది ఆధారంగానే వ్యాపారంలో విజయం సాధించగలమని, పెట్టుబడి ఒక్కటే సరిపోదని ప్రపంచవ్యాప్తంగా సంస్థలు గుర్తిస్తున్నాయి. అలాగే, ఉద్యోగులు కూడా తాము ఏ బ్రాండుతో కలిసి పని చేయాలి, దీర్ఘకాలికంగా పని–వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం ఎలా ఉంటుంది అనే అంశాలపై మరింతగా ఆలోచిస్తున్నారు.

దేశంలో 5జీ హవా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో 2028 చివరి నాటికి మొబైల్ చందాదార్లలో దాదాపు 57 శాతం వాటా 5జీ కైవసం చేసుకోనుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న 5జీ మార్కెట్‌గా భారత్ అవతరిస్తుందని ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక వెల్లడించింది. '2022 డిసెంబర్ చివరినాటికి దేశంలో 5జీ చందాదార్లు ఒక కోటి ఉన్నట్టు అంచనా. భారత్‌లో 2022 అక్టోబరులో 5జీ సేవలు ప్రారంభం అయ్యాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద భారీ నెట్‌వర్క్ విస్తరణ జరుగుతోంది' అని ఎరిక్సన్ నివేదిక వెల్లడించింది.



అంతర్జాతీయంగా 150 కోట్లు..

కొన్ని మార్కెట్లలో భౌగోళిక రాజకీయ సవాళ్లు, స్థూల ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ.. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లు 5జీలో పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. 2023 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా 150 కోట్ల మొబైల్ చందాదార్లు 5జీ వేదికపైకి రానున్నారు. ఉత్తర అమెరికాలో 5జీ చందాదార్ల వృద్ధి గత అంచనాల కంటే బలంగా ఉంది. ఈ ప్రాంతంలో 2022 చివరి నాటికి 5జీ విస్తృతి 41 శాతం ఉంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రతి స్మార్ట్‌ఫోన్‌కు నెలవారీ అంతర్జాతీయ సగటు డేటా వినియోగం 20 జీబీ కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా' అని నివేదిక వివరించింది.

సరికొత్త శిఖరాలకు సెన్సెక్స్

- ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు
- ముగింపులో నిఫ్టీ సైతం ఆల్‌టైం హై
- సూచీల ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- రాణించిన బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆర్థిక షేర్లు
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: స్టాక్ మార్కెట్‌లో రెండో రోజూ బుల్ దూకుడు కొనసాగింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో బుధవారం సెన్సెక్స్ ఇంట్రాడే, ముగింపులో సరికొత్త శిఖరాల్ని అధిరోహించింది. నిఫ్టీ ఆల్‌టైం హై స్థాయి(18,888)ని అందుకునే ప్రయత్నం చేసినా., గరిష్టం స్థాయిల నిరోధం ఎదురవడంతో 12 పాయింట్లు దూరంలో నిలిచింది. అయితే ముగింపులో మాత్రం కొత్త రికార్డును నమోదు చేసింది. దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడంతో పాటు భారత వృద్ధి అవకాశాలపై భరోసా అంశాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, టీసీఎస్, కోటక్ బ్యాంక్ తదితర లార్జ్‌క్యాప్ షేర్లు రెండుశాతం వరకు లాభపడి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. ఉదయం సెన్సెక్స్ 139 పాయింట్ల లాభంతో 63,467 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ప్రారంభంలోనే కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 261 పాయింట్లు 63,588 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. దీంతో గతేడాది డిసెంబర్ ఒకటో తేదీన నమోదైన 63,583 ఆల్‌టైం హై స్థాయి కనుమరుగైంది. కొత్త రికార్డు నమోదు తర్వాత లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో సెన్సెక్స్ కొంతమేర లాభాల్ని కోల్పోయింది. చివరికి 195 పాయింట్ల లాభంతో 63,523 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు కూడా సూచీకి కొత్త ఆల్‌టైం హై కావడం విశేషం. నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 18,849 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 59 పాయింట్లు ఎగసి 18,876 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 40 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ట ముగింపు 18,857 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు అరశాతం చొప్పున ర్యాలీ చేశాయి. లాభాల మార్కెట్లోనూ ఆటో, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,013 కోట్ల షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.550 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ చైర్మన్ టెస్టిమోనీ ప్రసంగం(జూన్ 21, 22) నేపథ్యంలో ఇన్వెస్టర్లు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సూచీల రికార్డు ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరింది. బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం స్థాయి రూ.294.49 లక్షల కోట్లకు చేరింది.
- నోవార్డిక్ ఏవియేషన్ క్యాపిటల్‌తో సెటిల్‌మెంట్ పరస్పర అంగీకార ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో స్పైస్‌జెట్ షేరుకు రెక్కలొచ్చాయి. ట్రేడింగ్‌లో ఏడుశాతం లాభపడి రూ.29.40 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 4% లాభంతో రూ.28.63 వద్ద స్థిరపడింది.

ఇక 'మెడ్‌ప్లస్' ఔషధాలు

- 50–80 శాతం తగ్గింపుతో విక్రయం
- మెడ్‌ప్లస్ ఎండీ మధుకర్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల విక్రయంలో ఉన్న హైదరాబాద్ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్.. సొంత బ్రాండ్‌లో మందుల అమ్మకాల్లోకి ప్రవేశించింది. 50–80% డిస్కౌంట్‌తో వీటిని విక్రయిస్తున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. కంపెనీ సీవోవో చెరుకుపల్లి భాస్కర్ రెడ్డి, చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ చేతన్ దీక్షిత్‌తో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. వివిధ చికిత్సలు, దీర్ఘకాలిక జబ్బులకువాడే 500లకుపైగా పేటెంట్‌యేతర ఔషధాలను మెడ్‌ప్లస్ బ్రాండ్‌లో ప్రవేశపెట్టినట్టు మధుకర్ చెప్పారు. జీఎంపీ, ఈయూ జీఎంపీ ధ్రువీకరణ పొందిన ప్లాంట్లలో మందులు తయారవుతున్నట్టు వివరించారు.

ఏటా 1,000 స్టోర్లు..:

ప్రతి ఏటా మెడ్‌ప్లస్ ఫార్మసీ విభాగంలో 1,000 రిటైల్ ఔట్‌లెట్లను తెరుస్తామని మధుకర్ రెడ్డి తెలిపారు. 'వీటి ఏర్పాటుకు ఏటా సుమారు రూ.300 కోట్లు అవసరం అవుతాయి. ఏడు రాష్ట్రాల్లోని 552 నగరాలు, పట్టణాల్లో ప్రస్తుతం 3,822 స్టోర్లు ఉన్నాయి. ఈ ఏడాదే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో అడుగుపెడుతున్నాం. 2022–23లో రూ. 4,550 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయం ఆర్జించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం 25% వృద్ధి ఆశిస్తున్నాం. డిస్కౌంట్ల వల్ల లాభాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండదు' అని వెల్లడించారు. సంస్థకు 22 వేల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు.



మధుకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి (కుడి)

ఎన్‌ఎండీసీలో తగ్గిన ఎల్‌ఐసీ వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీలో 2.07 శాతం వాటాను జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ రూ.649 కోట్లకు విక్రయించింది. దీంతో ఎన్‌ఎండీసీలో ఎల్‌ఐసీ వాటా 9.62 శాతానికి వచ్చి చేరింది. 2023 మార్చి 14 నుంచి జూన్ 20 మధ్య 6.06 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో ఒక్కొక్కటి సగటున రూ.107.59 చొప్పున ఎల్‌ఐసీ విక్రయించింది.



భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

పీజేటీఎస్‌ఏయూలో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ,శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీలతోపాటు అనుబంధ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బైపీసీ స్ట్రీమ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది.

డిగ్రీ కోర్సులు-సీట్ల వివరాలు

» బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్(నాలుగేళ్లు)-720 సీట్లు. » బీఎస్సీ(ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్(నాలుగేళ్లు)-43 సీట్లు. » బీవీఎస్సీ అండ్ ఏహెచ్ (ఐదున్నరేళ్లు)-174 సీట్లు. » బీఎఫ్‌ఎస్సీ(నాలుగేళ్లు)-39 సీట్లు. » బీఎస్సీ(ఆనర్స్)హార్టికల్చర్ (నాలుగేళ్లు)-204 సీట్లు.

» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్)తోపాటు టీఎస్ ఎంసెట్-2023 ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** బీవీఎస్సీ ఏహెచ్ కోర్సుకు 17 నుంచి 25 ఏళ్లు, ఇతర కోర్సులకు 17 నుంచి 22 ఏళ్లు మధ్య ఉండాలి.

» **ఎంపిక:** టీఎస్ ఎంసెట్-2023లో అభ్యర్థులు పొందిన ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.07.2023.

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 18.07.2023 నుంచి 19.07.2023 వరకు

» **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశాలు

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సంస్థ 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి..జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష–2024కు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి.

» **వయసు:** దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2012 నుంచి 30.07.2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలి.

» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు(మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్)ఉంటాయి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.08.2023

» **వెబ్‌సైట్:** cbseitms.rcil.gov.in

సింగరేణి కాలరీస్‌లో అప్రెంటిస్‌లు

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, హెచ్‌ఆర్‌డీ విభాగం.. 2023–24 సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్‌లకు దరఖాస్తులు కోరుతోంది.

» **ట్రేడులు:** ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్‌లు, టర్నర్, మెషినిస్ట్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (సివిల్), మెకానిక్ డీజిల్, మౌల్డర్, వెల్డర్.

» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

» **స్టైపెండ్:** ట్రేడును బట్టి నెలకు రూ.7,700 నుంచి రూ.8050 వరకు చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన సీనియారిటీ ఆధారంగా ఎంపిక చేస్తారు.సీనియారిటీ ప్రకారం అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఐటీఐ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

» **దరఖాస్తు విధానం:** ఎస్‌సీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని హార్డ్‌కాపీ, సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి రిజిస్టర్డ్ పోస్టు /కొరియర్/వ్యక్తిగతంగా ఏదైనా ఎంవీటీసీ కేంద్రాల్లో అందజేయవచ్చు.

» **వెబ్‌సైట్:** www.scclmines.com

బెల్ బెంగళూరులో 82 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఆధ్వర్యంలోని ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 82 »**పోస్టుల వివరాలు:** ట్రెయినీ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు.

» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్,ఎలక్ట్రానిక్స్–టెలికమ్యూనికేషన్,కమ్యూనికేషన్,టెలికమ్యూనికేషన్,మెకానికల్ తదితరాలు.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 నుంచి 32 ఏళ్లు ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్(హెచ్‌ఆర్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ సెంటర్(పీడీఐసీ), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్రొఫెసర్. యూ ఆర్ రావు రోడ్, నాగాలాండ్ సర్కిల్ దగ్గర, జలహళ్లి పోస్టు, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 28.06.2023.

» **వెబ్‌సైట్:** www.bel-india.in

ఐడీఆర్‌బీటీలో బ్యాంకింగ్ టెక్నాలజీ కోర్సు

ఐడీఆర్‌బీటీ.. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ. దీన్ని భారత కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐ ఏర్పాటుచేసింది. ఐడీఆర్‌బీటీ.. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(పీజీడీబీటీ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో చేరిన అభ్యర్థులకు బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలకు అవసరమైన లేటెస్ట్ టెక్నాలజీపై శిక్షణ అందుతుంది. పీజీడీబీటీ కోర్సులను పూర్తి చేసుకున్నవారు బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల అవకాశాలను అందుకునే వీలుంది. ఐడీఆర్‌బీటీ అందించే పీజీడీబీటీ కోర్సు పూర్తి వివరాలు..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)..1996లో హైదరాబాద్‌లో ఐడీఆర్‌బీటీని ఏర్పాటుచేసింది. ఈ సంస్థ భారతదేశంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అవసరమైన సాంకేతికతను అందించడంతోపాటు టెక్నాలజీపై పరిశోధనలు కొనసాగిస్తుంది. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ రంగాలకు నైపుణ్యాలున్న మానవ వనరులకు డిమాండ్ ఏర్పడింది. దీంతో 2016లో ఐడీఆర్‌బీటీ.. బ్యాంకింగ్ టెక్నాలజీ పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించింది. ఇప్పటివరకూ ఆరు బ్యాచ్‌లు పూర్తికాగా.. తాజాగా ఏడో బ్యాచ్‌లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఏడో బ్యాచ్ జూలైలో ప్రారంభం కానుంది.

» పీజీడీబీటీ ప్రవేశాలకు ప్రకటన విడుదల

మొత్తం సీట్లు

40(ఇందులో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు 10 స్పాన్సర్డ్ సీట్లు కేటాంచారు)

అర్హతలు

పీజీడీబీటీ కోర్సులో ప్రవేశాలు కోరుకునే అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బీటెక్ లేదా ఏదైనా సబ్జెక్టులో ప్రథమ శ్రేణిలో పీజీ ఉత్తీర్ణత సాధించాలి. 10+2+4 విధానంలో చదివిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అలాగే అభ్యర్థులు గేట్/క్యాట్/ జీమ్యాట్/జీఆర్‌ఈ/సీమ్యాట్/గ్జాట్/మ్యాట్/ఏటీఎంఏల్లో ఏదో ఒక పరీక్ష స్కోరు సాధించడం తప్పనిసరి.

ఎంపిక ఇలా

వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి..అనంతరం గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి.. వాటిలో చూపిన ప్రతిభ ఆధారంగా కోర్సులోకి తీసుకుంటారు. కోర్సు మొత్తం ఫీజు రూ.ఐదు లక్షలు. నాలుగు విడతల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



కోర్సు స్వరూపం

పీజీడీబీటీ ఏడాది కోర్సు. ఫుల్‌టైం విధానంలో ఉంటుంది. మూడు నెలలకు ఒక టర్మ్ చొప్పున 4 టర్మ్‌లుగా కోర్సు ఉంటుంది. ఇందులో లెక్చరర్లు,సెమినార్లతోపాటు ఐటీ నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ లెర్నింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. మొత్తం నాలుగు టర్మ్‌ల్లో చివరి టర్మ్‌లో ప్రాజెక్ట్ కేటాయించారు. కోర్సులో భాగంగా టెక్నాలజీని ఉపయోగించి.. బ్యాంకింగ్, ఆర్థికసంస్థల ఉత్పాదకత పెరిగేలా బోధన ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపయోగిస్తున్న టెక్నాలజీపై అవగాహన కల్పిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, క్రిప్టోగ్రఫీ, ఐవోడీ, బిగ్ డేటా, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, మొబైల్ బ్యాంకింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, పేమెంట్, సిస్టమ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. కోర్సును విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ప్రధానం చేస్తారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

ఈ కోర్సును పూర్తిచేసుకున్న వారు క్యాంపస్ స్థాయిలోనే ఉద్యోగావకాశాలను అందుకోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీబీఐ, బంధన్, కరూర్ వైశ్య, ఫెడరల్, కోటక్, సౌత్ ఇండియా, ఎస్‌బీసీఐ తదితరం సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు సగటున రూ.9 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 24.06.2023
- వెబ్‌సైట్: https://www.idrbt.ac.in

ఆర్మీలో కొలువుతోపాటు బీటెక్

ఇంటర్ ఉత్తీర్ణులు ఆర్మీలో లెఫ్టినెంట్ ఉద్యోగంతోపాటు బీటెక్ పట్టా అందుకునే చక్కటి అవకాశం. ఇంటర్ ఎంపీసీ విద్యార్థుల కోసం ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారిని శిక్షణ కోసం తీసుకుంటారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇటు బీటెక్ డిగ్రీతోపాటు అటు ఆర్మీలో లెఫ్టినెంట్ కొలువు సొంతమవుతుంది. ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ పూర్తి వివరాలు..

- మొత్తం ఖాళీలు: 90

అర్హతలు

- ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టులతో 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ మెయిన్ స్కోరు తప్పనిసరి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» మొత్తం ఖాళీల సంఖ్య 90

» ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు చక్కటి అవకాశం

» ఎంపికైతే నెలకు రూ.లక్ష వరకూ వేతనం

- వయసు: 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్ల మధ్య ఉండాలి. 2004 జూలై 2-2007 జూలై 1 మధ్య జన్మించిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

ఎంపిక ఇలా

ఇంటర్ మార్కులు, జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా ఎంపికైన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్‌ఎస్‌బీ) ఆధ్వర్యంలో బెంగళూరులో అయిదు రోజుల పాటు రెండు దశల్లో సైకాలజికల్ టెస్టులు,గ్రూప్ టాస్క్‌లు,ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. మొదటి రోజు స్టేజ్-1 స్క్రీనింగ్(ఇంటెలిజెన్స్) పరీక్షల్లో అర్హత సాధించిన వారిని స్టేజ్-2కి ఎంపిక చేస్తారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే వివిధ పరీక్షల్లో.. అన్ని విభాగాల్లోనూ రాణించిన అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేస్తారు.

శిక్షణ

ఎంపికైన వారికి మొత్తం అయిదేళ్ల శిక్షణ ఉంటుంది. ఇందులో ఏడాది పాటు ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ–గయాలో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్ నిర్వహిస్తారు. అనంతరం నాలుగేళ్లపాటు టెక్నికల్ ట్రైనింగ్ పుణె, సికింద్రాబాద్, మావ్‌ల్లోని ఆర్మీ కేంద్రాల్లో ఏదో ఒకచోట కొనసాగుతుంది. ఇందులో రెండు దశలు..ఫేజ్-1 మూడేళ్ల ప్రీ కమిషన్ ట్రైనింగ్, ఫేజ్-2 ఏడాది పోస్ట్ కమిషన్ ట్రైనింగ్ ఉంటాయి. మూడేళ్ల ఫేజ్-1 శిక్షణ అనంతరం అభ్యర్థులకు నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ లభిస్తుంది.

బీటెక్ డిగ్రీ

నాలుగేళ్ల శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదా సొంతమవుతుంది. ట్రైనింగ్,కోర్సు పూర్తయిన తర్వాత వీరికి ఇంజనీరింగ్(బీటెక్) డిగ్రీని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రధానం చేస్తుంది. అనంతరం వీరిని పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకుంటారు.

వేతనాలు

లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరిన వారికి లెవల్-10 ప్రకారం మూలవేతనం లభిస్తుంది. ఇలా ఎంపికైన వారికి ప్రతి నెల రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే కింద రూ.15,500 ప్రతి నెల అందుతాయి. వీటికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ప్రోత్సాహకాలు దక్కుతాయి. విధుల్లో చేరిన మొదటి నెల నుంచే అన్ని కలుపుకొని సీటీసీ రూపంలో నెలకు దాదాపు రూ.లక్ష అందుకోవచ్చు.



ఉన్నత హోదా

ఈ పోస్టులకు ఎంపికైన వారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో చేరిన రెండేళ్ల తర్వాత కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:జూన్30, 2023
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

మనుషుల అశ్రద్ధతోనే పర్యావరణానికి ముప్పు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: మనుషుల అశ్రద్ధతోనే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభమైన ప్రపంచ అలర్జీ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం డీజీపీ కార్యాలయంలో ప్రముఖ ఊపిరితిత్తుల స్పెషలిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ నేతృత్వంలో 'పావురాల రెక్కలు – పావురాల విసర్జన- ఎలర్జీ నిర్ధారణ- పరీక్షలు' క్యాంపెయిన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పావురాలతో ప్రబలే అలర్జీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అలర్జీ స్పెషలిస్ట్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని అశ్విని అలర్జీ సెంటర్‌లో పావురాల వల్ల కలిగే ప్రాణాంతకరమైన వ్యాధి 'హైపర్ సెన్సిటివిటీ నీమోనైటిస్' ప్రాథమిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు వెయ్యి మందికి ఉచితంగా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.



వాతావరణ మార్పుతోనే విపత్తులు

- ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియాదే కీలకపాత్ర
- ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ ఎ.వాణీప్రసాద్

సాక్షి, హైదరాబాద్: వాతావరణంలో వస్తున్న మార్పులతోనే విపత్తులు సంభవిస్తాయని పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్ ఎ.వాణీప్రసాద్ అన్నారు. ఏళ్లుగా వాతావరణంలో వస్తున్న విపరీత మార్పుల ప్రభావంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ఇందులో మీడియా పాత్ర అత్యంత కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి జర్నలిస్టులు విశ్లేషణాత్మక కథనాలు అందించాలన్నారు. వాతావరణ మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై జర్నలిస్టులకు లోతైన అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్, వ్యూస్ ఇండియా సంస్థ సంయుక్తంగా రెండ్రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో జరిగిన వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ ప్రజా వ్యవహారాల అధికారి జోనాథన్ ఓర్, వాణీప్రసాద్ ప్రారంభించారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 91

గురువారం 22-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

వరలక్ష్మికి గాత్రం దేవుడిచ్చిన వరం.
గురువులు లేరు... శిక్షణ లేదు.
రేడియో ఆమెకు పాటలు నేర్పింది.
రేడియో ఆమెచేత పాడించుకుంది.
ఆలయాలు ఆమె పాటలకు వేదికనిచ్చాయి.
ఇప్పుడామె ముంబయిలో తెలుగు స్వరం.

ఆమె పాటకు అరవై ఏళ్లు


వరలక్ష్మి

వరలక్ష్మి నారాయణమ్ పుట్టిల్లు గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణ కోడూరు. రేడియోలో వచ్చిన పాటలు వింటూ పాడడం నేర్చుకున్నారు. అందుకే కాబోలు పాట పాడాలనే అభిలాష ఉన్న వాళ్లను ఏర్చికూర్చి, వాళ్లకు పాడడంలో మెళకువలు నేర్పించి, వారిని ఒక వేదిక మీదకు తీసుకువచ్చి పాడించారు. ఘంటసాల జయంతి రోజున ఘంటసాల పాటలు పాడడానికి మహామహులైన గాయకులు పోటీ పడుతుంటారు. కరతాళ ధ్వనులలో ఉప్పొంగిపోతుంటారు. జనం వారినే చూస్తారు, వారికే హారతులు పడుతుంటారు. కానీ... పాడాలనే తపన ఉన్న అనేక మంది ఆశావహుల ముఖాలను చూశారామె. వారిలో గృహిణులున్నారు. డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్‌లు కూడా ఉన్నారు. ఇలాంటి గానాభిలాషులతో ఘంటసాల జయంతిని ప్రత్యేకంగా నిర్వహించేవారు వరలక్ష్మి. బీఈడీ చేసిన వరలక్ష్మి పాఠాలు చెప్పడంలో స్వరం మాధుర్యం కోల్పోతుందేమోనన్న భయంతో పాటల కోసం పాఠాల ఉద్యోగానికి దూరమయ్యారు. పాట పాడక పోతే తోచదు. ఇప్పుడు ముంబయిలో నివసిస్తున్నప్పటికీ అక్కడి తెలుగు వారిని ఒక చోటకు చేర్చడానికి పాటనే మాధ్యమంగా చేసుకున్నారామె. అరవై ఐదేళ్ల వరలక్ష్మి అరవై ఏళ్ల తన పాటల ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

పాట చాలా ఇచ్చింది!

''నేను పాట కోసం జీవితాన్ని అంకితం చేశాననే ప్రశంస సంతోషంగా ఉంటుంది. కానీ పాటకు నేను చేసిన సేవకంటే పాట నాకిచ్చిన గుర్తింపు, గౌరవమే పెద్దది. పాట నాకెంతో ఇచ్చింది. ఐదేళ్ల వయసులో గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఘంటసాల గారితో కలిసి 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాడాను. నాలో గాయని ఉందని గుర్తించిన స్కూల్ టీచర్‌లు ఏ కార్యక్రమం అయినా నాతో పాడించేవారు. ఇక కాలేజ్‌లో మ్యూజిక్ ఒక సబ్జెక్ట్‌గా తీసుకున్నాను. మా సరోజిని మేడమ్ ఎక్కడ పోటీలు జరిగినా నన్ను పంపేవారు. సినీనటి సుమలత మ్యూజిక్‌లో నా క్లాస్‌మేట్. ఆ పరిచయం ఉన్నప్పటికీ నేను సినిమా గానం వైపు వెళ్లలేదు. రేడియోలో 'బి గ్రేడ్' సింగర్‌గా సెలెక్ట్ అయ్యాను. 'ఈ మాసపు పాట, లలిత గీతాలు' లెక్కలేనన్ని పాడాను. టీవీలో తరిగొండ వెంగమాంబ కీర్తనలు, సమస్త దేవతా కీర్తనలను పాడడంతోపాటు బాణీలు కూడా కట్టాను.

ఆరు సొంత ఆల్బమ్‌లు చేశాను. మా రోజుల్లో ఇప్పుడున్నన్ని సౌకర్యాల్లేవు. చాలా మంది మహిళలకు తమ పాటలను రికార్డు చేసుకోవాలనే కోరిక ఉన్నప్పటికీ ఇంట్లో సహకారం లేక ఆశను చంపేసుకునేవారు. అలా నా దృష్టికి వచ్చిన వారందరి చేత సొంత ఆల్బమ్‌లు చేయించగలిగాను. పెళ్లి తర్వాత మా వారి ఉద్యోగరీత్యా మచిలీపట్నంలో ఉన్నంత కాలం నా పాటయానం ఇన్నర్ వీల్ సర్వీస్‌తో కలగలిసిపోయి సాగింది. మా అబ్బాయి చదువు కోసం తిరుపతికి మారాం. అప్పుడు మరో మలుపు తీసుకుంది. తిరుపతిలో ఉన్నంత కాలం 'ఘంటసాల స్వరాభిషేకం' కార్యక్రమంలో వందల మందితో అన్నమాచార్య కీర్తనలు, సాధారణ పాటలు పాడించాను. వీటన్నింటిలో నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన సంఘటన తిరుమలలో జరిగింది.



నేను, నా ఫోన్ ఉంటే చాలు. ఎక్కడికైనా వెళ్లి పాడతాను. దేశవిదేశాల్లోనూ నా స్వరం వినిపించే అవకాశం వచ్చింది.

గిరులు ప్రతిధ్వనించాయి

తిరుమల రేడియో స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. వామన చరిత్ర పారాయణం చేశాను. తిరుమలలోనే మరో సంఘటన వేదపాఠశాలలో జరిగింది. మా వదిన తిరుప్పావై పాటలను తెలుగులో రాశారు. ఆ పాటలకు నేను ట్యూన్ కట్టాను. ముప్పైవ పాట ట్యూన్ చేస్తున్నప్పుడు అనుకోకుండా తిరుపతిలోనే ఉన్నాను. వేదపాఠశాల నుంచి ఆహ్వానం వచ్చింది. గోవిందనామాలతో మొదలుపెట్టి తిరుప్పావై పాశురాలన్నీ పాడాను. అప్పుడు వేదపాఠశాల గురువులు, ఐదు వందల మంది విద్యార్థులు గొంతుకల్లో పలికిన ఆశీర్వచనం తిరుమల గిరుల్లో ప్రతిధ్వనించింది. పాటను కమర్షియల్‌గా మార్చకుండా కళగా గౌరవిస్తే భగవంతుడు తనవంతుగా ఇను మిక్కిలిగా ఇస్తాడని నమ్ముతాను.

రెమ్యూనరేషన్ ఇవ్వలేని వాళ్ల కోసం సొంత ఖర్చులతో వెళ్లి పాడిన సందర్భాలున్నాయి. అందుకే నాకు ఆహ్వానాలు కూడా ఎక్కువే వస్తుంటాయి. తెలుగు నేల మీద ఆలయాలన్నీ నా పాటను ఆహ్వానం పలికాయనే చెప్పాలి. ఆర్కెస్ట్రాతో వెళ్తే తప్పనిసరిగా ఖర్చులుంటాయి. అందుకే చెన్నైకి వెళ్లి ట్రాక్‌లు రికార్డు చేయించుకున్నాను. నేను, నా ఫోన్ ఉంటే చాలు. ఎక్కడికైనా వెళ్లి పాడతాను. దేశవిదేశాల్లోనూ నా స్వరం వినిపించే అవకాశం వచ్చింది.

మెండైన ప్రోత్సాహం

పాట కోసం నేను టీచర్ ఉద్యోగాన్ని వదులుకుంటానంటే మా వారు రెండో మాటకు తావులేకుండా ప్రోత్సహించారు. ఆయన కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. మా అబ్బాయికి రిలయెన్స్‌లో ఉద్యోగం. తను పాడతాడు కానీ వృత్తిగా కాదు. మనుమరాళ్లిద్దరికీ మంచి గొంతు ఉంది. వాళ్లకు నేర్పించాలనే ప్రయత్నం చేస్తున్నాను. కానీ పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్లు నా దగ్గర క్రమశిక్షణగా కూర్చుని పాడలేకపోతున్నారు. రెండు పాటలు పాడి 'ఇక ఆడుకుంటాం నానమ్మా' అని వెళ్లిపోతారు'' అన్నారామె నవ్వుతూ.

అరవై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో మాధుర్యం ఏ మాత్రం తగ్గలేదు. 'పాట కోసం గొంతు సవరించుకోని రోజు నాకు అనారోగ్యం వచ్చినట్లు. ఇంత వరకు ఒక్కరోజు కూడా ముసుగుపెట్టి పడుకున్నది లేదు. పాటలోనే నా ఆరోగ్యం, పాటతోనే నా జీవితం' అన్నారు వరలక్ష్మి నారాయణమ్.

– వాకా మంజులారెడ్డి

బ్యూటిప్



అరటి తొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టుచేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చిపాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసుకుని, ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. అరటిలో పండులో ఉన్న విటమిన్ బి6, బి12, ప్రొటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండు సార్లు వేసుకోవడం వల్ల ముఖ చర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.

ఎంపవర్‌మెంట్

రూబీ సిన్హా ప్రారంభించిన 'షీ ఎట్ వర్క్' డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఎంతోమంది ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు జ్ఞానకేంద్రంగా మారింది. 'అదిగో దారి' అని దారి చూపే దిక్సూచి అయింది. 'ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలు పెట్టారా? అయితే మీ దగ్గర ఉన్న శక్తిని బయటికి తీసుకురావల్సిన సమయం వచ్చింది. ఒక్కరిగా ప్రయాణం మొదలు పెట్టి వందలాదిమందికి స్ఫూర్తి ఇస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. వారిలో మీరు ఒకరు ఎందుకు కాకూడదు!' అంటూ ఔత్సాహిక వ్యాపారవేత్తలను ఉత్సాహపరిచే రూబీ సిన్హా తాజాగా బ్రిక్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఉమెన్ వర్టికల్ అధ్యక్షురాలిగా నియామకం అయింది...

నిలువెత్తు గెలుపు పాఠం


రూబీ సిన్హా

ఢిల్లీకి చెందిన రూబీ సిన్హా జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసిన తరువాత జర్నలిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టింది. మరోవైపు వారాంతాలలో ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసేది. ఏమాత్రం తీరిక దొరికినా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసేది. షార్ట్ ఫిల్మ్స్ తీసేది.

అడ్వర్‌టైజింగ్ దిగ్గజాలతో కలిసి పనిచేయడం ఆమెకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది.

ఒక బిడ్డకు తల్లి అయిన రూబీ ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. కొంత కాలం తరువాత స్నేహితులలో ఒకరు ఇండిపెండెంట్ పీఆర్ కన్సల్టెంట్‌గా ప్రయత్నించమని సలహా ఇచ్చారు. ఈ సలహా రూబీకి బాగా నచ్చింది. అలా మొదలైన ప్రయాణమే తనను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

'అనుభవమైతేగానీ తత్వం బోధపడదు' అన్నట్లు రూబీ సిన్హా ఎంటర్‌ప్రెన్యూర్ అయిన తరువాతగానీ మహిళ వ్యాపారవేత్తలు ఎదుర్కొనే సమస్యలు అర్థం కాలేదు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 'కమ్యూన్ బ్రాండ్ సొల్యూషన్స్' ద్వారా కమ్యూనికేషన్ ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా

సమన్వయం

వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం అనేది ఒక కళ. ఆ కళలో మనం ఆరితేరాలి. అప్పుడే మన ప్రయాణం సజావుగా సాగుతుంది. టైమ్‌కు ఆఫీసుకు రావడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, మా అమ్మాయితో కలిసి స్కూల్‌లో జరిగే ఫంక్షన్‌కు వెళ్లడానికీ అంతే ప్రాధాన్యత ఇస్తాను. కంపెనీకి సంబంధించిన విషయాలపై సహ ఉద్యోగులతో చర్చించడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, అమ్మాయి దగ్గర కూర్చొని హోంవర్క్ చేయించడానికీ అంతే ప్రాధాన్యత ఇస్తాను.

- రూబీ సిన్హా

తాను ఒంటరిగానే ప్రయాణం పెట్టింది.

'బడ్జెట్, క్యాష్ ఫ్లో మేనేజ్‌మెంట్ నుంచి ప్రతిభావంతులైన ఉద్యోగులను ఎంపిక చేసుకోవడం వరకు ఎం



గెలుపు జెండా ఎగరేసింది. అయితే తన విజయానికే పరిమితమై సంతృప్తి పడకుండా ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'షీ ఎట్ వర్క్' ద్వారా ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చి ముందుకు నడిపించింది.

'ప్రతి స్టార్టప్ ఐడియా సక్సెస్ కావాలని ఏమీ లేదు. కానీ ఎందుకు సక్సెస్ కాలేము అనే పట్టుదల ఉండే మాత్రం కచ్చితంగా సక్సెస్ అవుతాం. మన దేశంలో ఎంతో ప్రతిభ, సృజనాత్మకత ఉంది. వోలా క్యాబ్స్ నుంచి ఫ్లిప్‌కార్ట్ వరకు ఎన్నెన్నో విజయాలు ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి చాలు'... ఇలాంటి మాటలు ఎన్నో 'షీ ఎట్ వర్క్'లో కనిపిస్తాయి.

'ఒంటరి ప్రయాణం కష్టాలతో కూడుకున్నది. అయితే ఆ ప్రయాణం నీకు కొత్త శక్తి ఇస్తుంది' అనే మాట రూబీకి చాలా ఇష్టం.

'ఎంటర్‌ప్రెన్యూర్ ముందు ఎన్నో సవాళ్లు ఉంటాయి. అయితే అవేమీ జటిలమైన సవాళ్లు కాదు. ప్రతి సవాలు ఒక పాఠం నేర్పుతుంది. అలా నేను ఎన్నో నేర్చుకున్నాను. ఎంటర్‌ప్రెన్యూర్ టీమ్ కెప్టెన్‌గానే కాదు టీమ్ మెంబర్‌గా కూడా వ్యవహరించాలి. టీమ్‌తో కలిసిపోయి వారికి ఉత్సాహాన్ని ఇవ్వాలి' అంటుంది రూబీ.

నేర్చుకోవడానికి చిన్నా,పెద్దా తేడా అనేది ఉండదు.

'నేను ఒకరి దగ్గర నేర్చుకోవడం ఏమిటి' అనే అహం అడ్డొస్తే అదే అడ్డుగోడగా మారుతుంది. అయితే రూబీకి అలాంటి అహాలు లేవు.

'ఈ తరానికి అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం, తెలివితేటలు, చురుకుదనం ఉన్నాయి. వారి నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకుంటాను' అంటుంది రూబీ.

'భవిషత్ దార్శనికత, వ్యూహ చతురత, అంకితభావం రూబీ సిన్హా బలాలు' అంటున్నారు బ్రిక్స్ సీసీఐ డైరెక్టర్ జనరల్ మధుకర్.

భౌగోళిక సరిహద్దులకు అతీతంగా స్త్రీ సాధికారతకు సంబంధించిన లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడానికి బ్రిక్స్ సీసీఐ, ఉమెన్ వర్టికల్ ఏర్పాటయింది. ఇప్పుడు ఈ విభాగానికి రూబీ సిన్హా రూపంలో అంతులేని బలం చేకూరింది.

విద్యార్థికి పరీక్షే కీలకం
అది రాయలేని పరిస్థితి ఉంటే?
దివ్యాంగులు అయి ఉంటే?
సహాయకులు కావాలి.
కాని పరీక్ష రాసి పెట్టడానికి
అందరూ పనికి రారు.
అందుకు ఎంతో ఓర్పు,
సహనం, సేవాభావం కావాలి.
బెంగళూరుకు చెందిన పుష్ప
అలాంటి విద్యార్థుల కోసం
దాదాపు వేయికి పైగా పరీక్షలు రాసింది.
ఆమె పరిచయం.

పరీక్షలకు వారధి




దివ్యాంగ విద్యార్థుల కోసం పరీక్ష రాస్తున్న పుష్ప

బెంగళూరుకు చెందిన 35 ఏళ్ల పుష్ప ఎస్ ఎం ఇప్పటికి 1086 పరీక్షలు రాసింది. ఆమె కోసం కాదు. దివ్యాంగుల కోసం, కలం పట్టుకునే వీలు లేని కండరాల సమస్య ఉన్నవారి కోసం, పరీక్షల ముందు యాక్సిడెంట్‌లకు గురయ్యి రాసే వీలు లేని వారి కోసం... ఆమె పరీక్షలు రాస్తూనే ఉంది. ఇంకా రాయాలనే అనుకుంటోంది. 'ఒక దివ్యాంగ పిల్లవాడికి మీరు పరీక్ష రాసిపెట్టండి. రిజల్ట్స్ వచ్చి ఆ పరీక్ష పాసయ్యాక ఆ పిల్లవాడి కళ్లల్లో కనిపించే కృతజ్ఞతకు మీరు విలువ కట్టలేరు' అంటుంది పుష్ప.

2007లో అనుకోకుండా

ఆ రోజు పుష్ప రోజూ వెళ్లే బస్సులో కాకుండా నడిచి ఇంటికి వెళ్లాలనుకుంది. ఆ నడకే ఆమె జీవితాన్ని మార్చింది. దారిలో ఒక అంధ కుర్రవాడు రోడ్డు దాటించమని సహాయం అడిగాడు. పుష్ప రోడ్డు దాటిస్తూ మాట కలిపింది. ఆ కుర్రవాడు వచ్చే నెలలో ఎస్ఎస్ఎల్‌సి పరీక్షలు రాయనున్నాడు. 'నాకు మీరు పరీక్షలు రాసి పెడతారా?' అని అడిగాడు. పుష్ప ఆలోచనలో పడింది. 'మీలాంటి వాళ్లు మా కోసం ముందుకొస్తే మేము మా జీవితంలో ముందుకెళతాం' అని ఆ అబ్బాయి అన్నాడు. ఆ మాట ఆమె మీద చాలా ప్రభావం ఏర్పరిచింది. 'అప్పటి వరకూ నా జీవితానికి అర్థమేమిటా అనే ఆలోచన ఉండేది. ఆ క్షణాన ఇలాంటి వారికి సాయం చేయడానికే పుట్టానేమో అనుకున్నాను' అంటుంది పుష్ప.

అంత సులభం కాదు

దివ్యాంగులకు, అంధులకు, సెరిబ్రల్ పాల్సీ.. డౌన్ సిండ్రోమ్... డిస్‌లెక్సియ వంటి బుద్ధిమాంద్యం సమస్యలు ఉన్నవారు పరీక్షలు రాయాలంటే వారికి లేఖకులుగా ఉండటం అంత సామాన్యం కాదు. 'ముందు మీకు ఓపిక ఉండాలి. వాళ్లు ప్రశ్నను మళ్లీ మళ్లీ చదివి వినిపించమంటారు. ఒక్కోసారి నేను ఒక ప్రశ్నను ముప్పై నలభైసార్లు చదివి వినిపించిన సందర్భాలున్నాయి. అలాగే మీకు శ్రద్ధగా వినే శక్తి ఉండాలి. జవాబు చెప్పే పిల్లలు కొందరు మరీ నెమ్మదిగా, కొందరు మరీ వేగంగా చెప్తారు. అర్థం చేసుకుని రాయాలి. వారు రాసే సబ్జెక్ట్‌లు మీరు చదివినవి కావు. అందుకని కూడా మీరు జవాబులను పూర్తిగా అర్థం చేసుకుంటూ రాయాల్సి వస్తుంది. మనల్ని పర్యవేక్షిస్తుంటారు. కాబట్టి గ్రామర్ వంటివాటిల్లో చిన్న సాయం చేయొచ్చు కాని మన తెలివి వారికి అందివ్వలేం. నిజాయితీ ముఖ్యం' అంటుంది పుష్ప. ఆమె ఇప్పటి వరకూ పది, ఇంటర్, డిగ్రీ, పిహెచ్‌డి, బ్యాంకు పరీక్షలు... ఇలాంటివి ఎన్నో రాసి పెట్టింది.

అడిగిన వెంటనే సెలవు

పుష్ప బెంగళూరులో ఒక ఐటి కంపెనీలో పని చేస్తుంది. లేఖకురాలిగా ఆమెకు ఉన్న డిమాండ్‌ను చూసి ఐటి కంపెనీ ధారాళంగా సెలవులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఇది మంచి పనే అని మెచ్చుకుంటోంది. పుష్ప ఇంగ్లిష్, హిందీ, కన్నడ, తెలుగు, తమిళ భాషల్లోని విద్యార్థుల కోసం పరీక్షలు రాసి పెడుతోంది. ఇలాంటి విద్యార్థుల కోసమే తెలుగు, తమిళ భాషలను షార్ట్ టర్మ్ కోర్సులు చేసి నేర్చుకుంది. 'నా బాల్యంలో మా నాన్న రోజు కూలీగా ఉండేవాడు. ఆయనకు ప్రమాదం జరిగి మంచాన పడితే మంచి మనసున్న వారి సాయంతో చదువుకున్నాను. ఇప్పుడు ఆ బాకీని ఇలా తీర్చుకుంటున్నాను' అంటుంది పుష్ప.

ఇంత అద్భుతమైన సేవ చేస్తున్నది కాబట్టే 2019లో నాటి రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కార్ అందుకుంది.

ఫేక్ హ్యాపీనెస్

నిజజీవితంలో కాకుండా డిజిటల్ మీడియా ద్వారా సంతోషాన్ని ప్రదర్శించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి దూరమవుతూ, తాము అంతా సంతోషంగా ఉన్నట్టు నటిస్తూ 'ఫేక్ హ్యాపీనెస్'ను క్రియేట్ చేస్తుంటారు కొందరు. అది ఫేక్ అని తెలియని వాళ్లు, తాము కూడా తమ ఫేక్ హ్యాపీనెస్ ను మరింత క్రియేటివ్‌గా పోస్ట్ చేస్తుంటారు. వ్యసనంలా మార్చే ఈ చట్రంలో రోజుకు ఎంతోమంది చేరుతున్నారు.

అవగాహనా లోపం

మనమంతా మన చుట్టూ ఉన్నవారితో కలిసి జీవిస్తున్నాం. ఇందులో కొందరు తమపై తమకు సరైన అవగాహన లేని కారణంగా ఎదుటివారిని అనుకరించడం, విలువలు లేని వారి ప్రవర్తనలను కాపీ చేయడం చూస్తుంటాం. అంటే, ఉదాహరణకు.. స్నేహితుల్లో ఒకరు పొగతాగడాన్ని చూస్తూ, కొన్నాళ్లకు ఆ గ్రూప్‌లో ఉన్న మిగతావారూ అదేపని చేస్తుంటారు. ఇది సమయాన్ని వృథా చేస్తుంది. మానసికంగా, శారీరకంగా చెత్తను తయారు చేస్తుంది. ఇదే సోషల్ మీడియా విషయంలోనూ జరుగుతుంది. చాలా మంది ఒకే రకమైన కంటెంట్‌ను చూడటానికి అలవాటు పడుతున్నారు అది నిజం కాదని స్పష్టంగా తెలిసినప్పటికీ. ఏదో ఆనందం కోసం చూస్తున్నాం అంటారు. అదే కంటెంట్‌ను చూస్తూ కొంతకాలానికి తామూ కూడా అదే రకమైన కంటెంట్‌ను పోస్ట్ చేస్తారు. ఒకరిని చూసి ఒకరు ఫేక్ కంటెంట్‌ను సోషల్‌మీడియాలో వదిలితే.. కొన్నాళ్లకు ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియకుండా పోతుంది.

ఆత్మగౌరవ సమస్య

మీలో ఆత్మబలం లేకపోతే ఇతర వ్యక్తులపై ఆధారపడతారు. అప్పుడు ఇతరులు మీ గురించి ఏమనుకుంటున్నారో అని మీరు ఎప్పుడూ బాధ, భయపడుతూ ఉంటారు. నిజానికి చుట్టూ ఉన్నవాళ్లకు మన గురించి పట్టించుకునేంత తీరిక లేదు. మన సొంత అవగాహనే తప్ప ఎవరూ ఎవరికీ తీర్పులు చెప్పరు. ఆత్మగౌరవ సమస్యలు ఉన్న ఎవరైనా సోషల్‌మీడియా ద్వారా తమ జీవితం గొప్పగా, సంతోషకరంగా ఉందని నిరూపించడానికి ప్రయత్నించవచ్చు. డిప్రెషన్‌తో పోరాడుతున్న ఎవరైనా ఇప్పటికీ అంతా బాగానే ఉన్నట్లు నటించడానికి సోషల్‌మీడియాను ఉపయోగించవచ్చు. వారి బంధాల గురించి, సంతోషకరంగా గడిపిన సందర్భాలను ఫొటోలతో సహా పోస్ట్ చేయవచ్చు. అవే నిజం అనుకోవడానికి లేదు. వాటికి ప్రతిగా మరికొందరు తాము సంతోషంగా ఉన్న ఎప్పటి సందర్భాన్నో ఇప్పుడు పంచుకోవచ్చు. ఇలాంటి విధానాల వల్ల ఆత్మగౌరవం, బలం పెరగవు అని గుర్తుంచుకోవాలి.

ఫేక్ సర్కిల్

సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ప్రతిదీ ఏదైనా డిలీట్ చేయలేరు. దశాబ్దాలుగా ఇంటర్నెట్‌లో కనిపించే అవకాశం ఉంది. మీరు మీ మెసేజ్‌ను లేదా ఫొటోని డిలీట్ చేయవచ్చు. అయితే, ఇంటర్నెట్‌లో స్క్రీన్‌షాట్, డౌన్‌లోడ్ వంటి సాధనాలపై మీ కంట్రోల్ ఉండదని గుర్తించాలి. మీ ప్రొఫైల్‌ని ఆర్ట్ గ్యాలరీగా పరిగణించాలి. అంటే, మీ సొంత భావోద్వేగాలతో సహా గొప్పగా కనిపించని దేన్నీ పోస్ట్ చేయరని అర్థం. కానీ, కాలక్రమేణా ఫేక్ హాపీనెస్ షేరింగ్ ఒక అలవాటుగా మారచ్చు. అలాంటప్పుడు కొన్నాళ్లకు ప్రొఫైల్‌లోని మొత్తం కంటెంట్ ఫేక్ అవ్వచ్చు. దీనిని కొన్నాళ్లుగా చూస్తున్న మీ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు కూడా అదే అలవాటుగా మార్చుకుంటే... ఫేక్ హాపీనెస్ చట్రం క్రియేట్ అవుతుంది.

గుర్తింపు కోరుకోవడం

ఈ ఆలోచన అత్యంత ప్రమాదకరమైనది. సోషల్ మీడియాను అదే పనిగా ఉపయోగించడం వల్ల కలిగే ప్రమాదాలలో ఇది ఒకటి. కాలక్రమేణా మిమ్మల్ని మీ ఆన్‌లైన్ ప్రొఫైల్‌తోనే జనాలు గుర్తించవచ్చు. అప్పుడు మీ ప్రొఫైల్ మీరు కావచ్చు. మన మనసుకు ఏది నిజం, ఏది అబద్ధం.. వాటి మధ్య ఉంటే తేడా అన్నీ తెలుసు. కానీ, అది ఒక్కటే సరిపోదు. సోషల్ మీడియాలో తమ సొంత ఇమేజ్‌తో గుర్తింపు పొందేందుకు ఇష్టపడే ఎవరైనా చివరికి వారి సొంత నిజ జీవితాన్ని, నిజమైన అవసరాలను విస్మరించవచ్చు. మీరు సంతోషంగా లేని సమయాల్లో గుర్తింపు పోతుందేమో అనే ఆలోచనతో ఫేక్ హ్యాపీనెస్ ఫొటోలను, వీడియోలను పోస్ట్ చేయవచ్చు. మీరు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయినా, దానిపై ఆధారపడే వ్యాపారాన్ని చేస్తుండవచ్చు. కానీ, అన్నింటి కన్నా జీవితంపై దృష్టి పెట్టడం ఇప్పుడే మొదలవ్వాలి. ఎందుకంటే జీవితం ఆన్‌లైన్‌లో కాదు ఆఫ్‌లైన్‌లోనే ఉంటుంది.

వ్యసనం

లైక్‌లు, కొత్త ఫాలోవర్లు, నోటిఫికేషన్లను చూడటం గొప్ప అనుభూతిని ఇస్తుంది. మీరు చేసిన పోస్ట్‌కి వచ్చిన కామెంట్స్‌కు రిప్లై కూడా ఇవ్వండి. వచ్చే నోటిఫికేషన్స్‌కి అడిక్ట్ అవకండి. మీరు చేసిన పోస్ట్‌కు కామెంట్స్, వ్యూస్, లైక్స్.. నంబరింగ్‌పై దృష్టి పెట్టకండి. సంతోషకరమైన ఫొటోలను పోస్ట్ చేయడం వల్ల వచ్చే లైక్‌లు, వ్యూస్ పెరుగుతుంటే వాటి వల్ల వచ్చేదేంటో ఊహించండి. లైక్స్ ఎన్ని ఎక్కువ వస్తే అంత బలం పొందినట్టుగా అనిపిస్తుంది. దీనివల్లే మళ్లీ మళ్లీ అదే పని చేయాలనుకుంటారు.

సైబర్ టాక్




పొంచి ఉండే స్కామర్లు

మీరు ఫేక్‌హ్యాపీనెస్ కోసం ప్రయత్నిస్తుంటే మిమ్మల్ని నకిలీ ఖాతాలతో మోసం చేసేవారూ ఉండచ్చు..

- మీరు చేసే పోస్ట్‌లకు ఉన్న ఫలంగా ఎక్కువ లైక్స్, వ్యూస్ వస్తే అనుమానించండి. ఎందుకంటే, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్స్ మిమ్మల్ని ట్రాప్ చేసే అవకాశం ఉంది. దీని ద్వారా మీతో పరస్పర చర్యలు జరిపి, దారితప్పించవచ్చు..
- వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేలా లేదా ఆర్థిక స్కామ్‌లలో పాల్గొనేలా మోసగించవచ్చు.
- స్కామర్లు ఫేక్ స్పాన్సర్‌షిప్ అవకాశాలను అందిస్తూ, వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవచ్చు.
- పాస్‌వర్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలు మొదలైన సమాచారాన్ని పంచుకునేలా మోగిసించవచ్చు.

మోసగించబడుతున్నాం అని గుర్తిస్తే వెంటనే...
ఈ క్రింది సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో రిపోర్ట్ చేయండి.
* https://help.twitter.com/en/safety-and-security/report-a-tweet
* https://www.facebook.com/help/1380418588640631
* https://www.linkedin.com/help/linkedin/answer/a1344213/recognize-and-report-spam-inappropriate-and-abusive-content?lang=en * https://help.instagram.com/192435014247952
* https://faq.whatsapp.com/1142481766359885/?cms_platform=android
పరిస్థితి తీవ్రత ఎక్కువగా ఉంటే.. https://www.cybercrime.gov.inలలో రిపోర్ట్ చేయండి.


ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 91

గురువారం 22-6-2023



హస్తినలో బంగారు బోనం

బంగారు బోనాలు సమర్పించిన బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ ఎంపీలు -6లో



సాహితీ సభలు షురూ

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలన్న ఎమ్మెల్సీ కవిత -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్వపరిపాలనలో ఆధ్యాత్మిక వైభవం

- 2,043 దేవాలయాల్లో ధూప, దీప నైవేద్య పథకం అమలు
- మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి వెల్లడి
- యాదాద్రిలో ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

యాదగిరిగుట్ట: స్వపరిపాలనలో తెలంగాణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, ఆలయాలు, పండుగలు, వేడుకలకు ప్రాధాన్యం కల్పించడంతో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోందని మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్రత మండపంలో రాష్ట్ర దేవాదాయ శాఖ తరపున నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2,043 దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం

మిగతా 2వ పేజీలో ▶



కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీ ముందు ఈడీ అధికారుల వాహనాలు



మేడ్చల్ జిల్లాలోని మెడిసిటీ వైద్య కళాశాలలో సోదాలకు వెళుతున్న అధికారులు



చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాల వద్ద అధికారులు

స్వాగత యాత్ర షురూ!

మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ మంత్రి జూపల్లిలకు కాంగ్రెస్ ఆహ్వానం

- వారి నివాసాలకు వెళ్లిన టీపీసీసీ చీఫ్ రేవంత్, స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి
- జూపల్లి నివాసంలో రేవంత్, కోమటిరెడ్డిలతో భేటీ అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ నేతలు
- పొంగులేటి ఇంట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతల సమావేశం
- పొంగులేటి, జూపల్లి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పార్టీలోకి వస్తారన్న రేవంత్
- ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకున్నామని, త్వరలో అధికారికంగా వెల్లడిస్తామన్న పొంగులేటి



పొంగులేటి నివాసంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇతర పార్టీల నేతలను తమ పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. హస్తం పార్టీలో చేరాల్సిందిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ అసంతృప్త నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ మరో అసంతృప్త నేత జూపల్లి కృష్ణారావులకు పిలుపునిచ్చింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు బుధవారం వారి నివాసాలకు వెళ్లి మరీ ఆహ్వానం పలికారు. జూపల్లి, పొంగులేటితో చాలా కాలం నుంచి కలిసి ఉంటున్న నాయకులు, కేడర్ సమక్షంలో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో మాజీ ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడు రామసహాయం సురేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం పొంగులేటి, జూపల్లి శిబిరాలు సానుకూలంగా స్పందించడంతో ఆ ఇద్దరు కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమే కానుంది.

వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఏఐసీసీ

పొంగులేటి, జూపల్లిలను పార్టీలోకి ఆహ్వానించే క్రమంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా పావులు కదిపింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రమే

మిగతా 2వ పేజీలో ▶

మెడికల్ కాలేజీలపై ఈడీ దాడులు

మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ సీట్లను బ్లాక్ చేసి అమ్ముకున్నారనే ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు

- ఈ అంశంపై గతంలోనే ఫిర్యాదు చేసిన కాళోజీ యూనివర్సిటీ?
- మొత్తం 11 కళాశాలల్లో సోదాలు చేసిన అధికారులు
- విద్యార్థుల అడ్మిషన్లు, బ్యాంకు లావాదేవీలపై ఆరా
- పలు కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, డాక్యుమెంట్లు స్వాధీనం
- నేడు కూడా తనిఖీలు చేసే అవకాశం ఉందన్న ఈడీ వర్గాలు

సాక్షి, హైదరాబాద్/మహబూబ్‌నగర్ క్రైం/చేవెళ్ల: మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ సీట్లను బ్లాక్ చేసి అమ్ముకున్నారనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝళిపించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకకాలంలో పదకొండు మెడికల్ కాలేజీలు, కార్పొరేట్ ఆఫీసులు కలిపి 22 ప్రాంతాల్లో దాడులు చేసింది. గురువారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశం ఉన్నట్టు సమాచారం. నీట్ ఫలితాలు వచ్చి, మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఈడీ దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కాలేజీలన్నీ రాజకీయ నాయకులు, వారి అనుయాయులవే కావడం గమనార్హమని వైద్యవర్గాలు చెప్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా సోదాలు

ఈడీ అధికారులు హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కామినేని మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మేడ్చల్ మండలం

మిగతా 2వ పేజీలో ▶

మరో 'పాతిక' చేతివైపు!

- జాబితాలో పొంగులేటి, జూపల్లితో పాటు మరికొందరు..
- కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్, బీజేపీ అసంతృప్త, 'ఉక్కపోత'నేతల చూపు!
- అన్ని జిల్లాల నుంచి పార్టీలో చేరికలు ఖాయమంటున్న టీపీసీసీ వర్గాలు
- టీజేఎస్, వైఎస్సార్‌టీపీలు కాంగ్రెస్‌లో విలీనమవుతాయని రాజకీయ వర్గాల్లో చర్చ

- వివరాలు 2లో



కుప్పకూలిన ఫ్లైఓవర్ శ్లాబ్

- ఇంజనీర్ సహా 9 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- కాంక్రీట్ లారీని రివర్స్ తీస్తుండగా సపోర్ట్ రాడ్స్‌కు తగిలి ప్రమాదం
- ఎల్బీనగర్ సాగర్ రింగ్‌రోడ్డు వద్ద ఘటన
- కిమ్స్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/ఎల్బీనగర్/లింగోజిగూడ: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ సాగర్ రింగ్ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ ర్యాంపు శ్లాబ్ కుప్పకూలింది. ఈ ఘటనలో సైట్ ఇంజనీర్‌తోపాటు మరో ఎనిమిది మంది కార్మికులకు గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఇంజనీర్ మినహా గాయపడ్డవారంతా ఇతర రాష్ట్రాల కార్మికులేనని అధికారులు తెలిపారు.

కాంక్రీటు లారీ తగలడంతో..

సాగర్ రింగ్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా బైరామల్‌గూడ చెరువు మీదుగా ర్యాంప్ నిర్మిస్తున్నారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ర్యాంప్ శ్లాబ్ పనులు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రెడీమిక్స్ కాంక్రీటు లారీని రివర్స్ తీస్తుండగా.. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో శ్లాబ్‌కు సపోర్ట్‌గా ఉన్న ఇనుప రాడ్‌లకు తగిలింది. దీనితో నిర్మాణంలో ఉన్న ర్యాంప్ శ్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో రంగారెడ్డి జిల్లాకు చెందిన సైట్ ఇంజనీర్ గోపాలకృష్ణతోపాటు ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు చెందిన కార్మికులు రోహిత్‌కుమార్(25), పునీత్‌కుమార్ (25), శంకర్‌లాల్ (25), జితేందర్‌కుమార్(26), రవికుమార్(26), హరేరామ్‌కుమార్(22), రత్నేష్‌కుమార్, కమల్‌ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో తలకు

మిగతా 2వ పేజీలో ▶

కలసికట్టుగా విపత్తుల నివారణ

వడగాడ్పుల ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం సమీక్ష

- హాజరైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు ప్రభావిత రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు



సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్: విపత్తుల సమయంలో సత్వరం స్పందించడం, ఎదుర్కోవడం వంటి చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపడితే ఎలాంటి మరణాలు సంభవించకుండా చూసుకోవచ్చని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఇరు ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ఆశించిన ఫలితాన్ని పొందవచ్చని బిపర్జోయ్ తుఫానుకు సంబంధించి ఇటీవలి సన్నాహక చర్యల్లో భారత్ నిరూపించిందని తెలిపారు. కొనసాగుతున్న వడగాడ్పులు, వేడి సంబంధిత అనారోగ్యాలపై ప్రజారోగ్య సంసిద్ధతను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు ప్రభావిత రాష్ట్రాల

మిగతా 2వ పేజీలో ▶



హైదరాబాద్‌లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన రహదారి

నేడో రేపో నైరుతి రాక!

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల కదలిక కాస్త చురుకుగా ఉంది. నేటి సాయంత్రం లేదా శుక్రవారం ఉదయం రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల కదలికలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉండటంతో రానున్న రెండ్రోజుల్లో ద్వీపకల్ప దక్షిణ భారతదేశంలోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వానలు నమోదయ్యే అవకాశంఉందని, ఒకట్రెండు చోట్ల

మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్‌లో లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్

- తొలి విడతలో 600 ఉద్యోగాలు
- మంత్రి కేటీఆర్ హర్షం



సాక్షి, హైదరాబాద్: యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. మంత్రి కేటీ రామారావు మే నెలలో జరిపిన యూకే పర్యటనలో భాగంగా జరిగిన భేటీలో.. తెలంగాణలో పెట్టుబడులకు లాయిడ్స్ ఆసక్తి వ్యక్తం చేసింది. తర్వాత ఐదు వారాల వ్యవధిలోనే రాష్ట్రంలో పెట్టుబడికి సంబంధించి కీలక ప్రకటన చేసింది. వ్యాపార అనుకూలతలు, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతోనే హైదరాబాద్‌లో తమ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఆర్థిక సేవలు అందించడంలో అగ్రస్థానంలో ఉన్న లాయిడ్స్ బ్యాంకుకు సుమారు 2.60 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారు. కాగా హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ ఖాతాదారులకు దీర్ఘకాలం పాటు సుస్థిర సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని లాయిడ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాన్‌వాన్ కేమెనడే తెలిపారు. హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న మానవ వనరులు, ఆవిష్కరణల రంగంలో వారు చూపుతున్న ప్రతిభ తమ సంస్థ పురోగతికి ఉపయోగపడుతుందన్నారు. కాగా హైదరాబాద్‌లో లాయిడ్స్ బ్యాంక్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ఏర్పాటు ద్వారా లాయిడ్స్ తొలి ఆరు నెలల్లోనే 600 మందిని ఉద్యోగాల్లోకి తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగం వాతావరణాన్ని లాయిడ్స్ బ్యాంక్ టెక్నాలజీ సెంటర్ బలోపేతం చేస్తుందని అన్నారు.

జాగా ఉంటే చాలు.. పక్కా ఇల్లు

'గృహలక్ష్మి' పథకంలో ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు

- ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల కేటాయింపు
- నిబంధనలు, పరిమితుల చట్రం పెద్దగా లేకుండా లబ్ధిదారుల ఎంపిక
- ప్రస్తుతానికి కేంద్ర గృహనిర్మాణ పథకంతో లింకు లేకుండా కొనసాగింపు?
- జాప్యం జరగొద్దన్న ఉద్దేశంతో సొంత నిధులతోనే కొనసాగించే యోచన
- వంద శాతం సబ్సిడీతో నిధుల మంజూరు
- వచ్చే నెలలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: తెల్ల రేషన్ కార్డు ఉండి.. ఎంతోకొంత సొంత జాగా ఉంటే చాలు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు కానుంది. గతంలో ఆర్‌సీసీతో నిర్మించిన సొంత ఇల్లు లేకుంటే చాలు దరఖాస్తు చేసుకోవచ్చు. అదిగో ఇదిగో అంటూ ఏడాదిన్నరగా కాలయాపన చేస్తూ వచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు గృహలక్ష్మి పథకాన్ని పట్టాలెక్కించేందుకు సిద్ధమైంది. దానికి సంబంధించిన మార్గదర్శకాల ఉత్తర్వును బుధవారం జారీ చేసింది. వచ్చే నెలలో పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. కుదిరితే ఈ నెలాఖరుకే ప్రారంభించాలన్న ఉద్దేశంతో ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాల్సిందిగా ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

ఎలాంటి పరిమితులు లేకుండా..

ఎన్నికలకు ఎక్కువ సమయంలేని తరుణంలో ఈ పథకం ప్రారంభిస్తున్న ప్రభుత్వం, ఎంపిక ప్రక్రియలో ఎక్కువ పరిమితులు పెట్టొద్దని నిర్ణయించింది. సాధారణంగా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే పథకాల్లో నిర్ధారిత పరిమాణంలో సొంత జాగా ఉండాలన్న నియమాన్ని పెడతారు. కానీ గృహలక్ష్మిలో అలాంటి పరిమితులు లేకుండా, కాంగ్రెస్ హయాంలో అమలైన ఇందిరమ్మ తరహాలో అమలుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు..

ఈ పథకం కింద రాష్ట్రంలో 4 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రస్తుతానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లను మంజూరు చేస్తారు. మరో 43 వేల ఇళ్లను స్టేట్ రిజర్వ్ పరిధిలో ఉంచుతారు. వాటిని ముఖ్యమంత్రి సందర్భాన్ని బట్టి మంజూరు చేస్తారు.

వంద శాతం సబ్సిడీగా..

ఈ పథకం కింద ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.3 లక్షల మొత్తాన్ని మంజూరు చేస్తుంది. వంద శాతం సబ్సిడీగా అందజేస్తుంది కాబట్టి ఆ మొత్తాన్ని లబ్ధిదారు తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇందుకు మొత్తం రూ.12 వేల కోట్లు ఖర్చవుతాయి. ఈ మొత్తంలో 7,350 కోట్లను ప్రభుత్వం నేరుగా కేటాయిస్తుంది. మిగతా మొత్తాన్ని పట్టణ ప్రాంత గృహనిర్మాణం కింద, గ్రామీణ ప్రాంత గృహనిర్మాణం కింద రుణాల రూపంలో సమకూర్చుకుంటుంది.

బీసీలు, మైనారిటీలకు 50 శాతం కోటా..

మంజూరు చేసే మొత్తం ఇళ్లలో 50 శాతం బీసీలు, మైనారిటీలకు కేటాయించాలని

మిగతా 2వ పేజీలో ▶

అర్హత మార్గదర్శకాలు ఇవే:

- లబ్ధిదారు కచ్చితంగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి
- కచ్చితంగా సొంత జాగా ఉండాలి
- నిర్ధారిత గ్రామం/యూఎల్‌బీలో నివాసి అయి ఉండాలి. ఇందుకు సంబంధించిన ఓటర్ గుర్తింపు కార్డు/ ఆధార్‌కార్డు కలిగి ఉండాలి.
- అప్పటికే ఆర్‌సీసీతో ఉన్న సొంత ఇల్లు కలిగి ఉండరాదు.
- ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ 59 (30-12-2014)ప్రకారం లబ్ధి పొంది ఉండకూడదు.
- ఇంటిని మహిళల పేరుతోనే మంజూరు చేస్తారు.
- దరఖాస్తుదారు తన ఇష్టం వచ్చిన డిజైన్‌లో ఇంటిని నిర్మించుకోవచ్చు.
- ఆర్‌సీసీతో కూడిన రెండు గదులు, మరుగుదొడ్డి ఉండేలా ఇంటిని నిర్మించాలి.
- ఆ ఇంటిపై ప్రభుత్వం ఖరారు చేసిన గృహలక్ష్మి లోగోను ఏర్పాటు చేస్తారు.



ఈ నగరానికి ఏమైంది..?

వరుస హత్యలు, హత్యాయత్నాల కలకలం

మైలార్‌దేవ్‌పల్లి, టప్పాచబుత్ర, చాదర్‌ఘాట్‌ల్లో మర్డర్లు

వీటిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జంట హత్యలు

నార్సింగిలో ప్రేమను నిరాకరించిన యువతిపై హత్యాయత్నం

ఎస్సార్‌నగర్ పరిధిలో కత్తిపోట్లు, బీరుబాటిళ్లతో దాడులు

16 గంటల్లో వరుస ఘటనలతో ఉలిక్కిపడిన భాగ్యనగరం

- వివరాలు 3లో

క్లుప్తంగా...

సార్ ఉంటే ఎంతో సంతోషించేవారు

జయశంకర్ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆకాంక్షించిన మహోజ్వల తెలంగాణను, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సమాజం ఆవిష్కరించుకుంటున్నదని, ఇది గర్వించదగ్గ సందర్భమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఇటువంటి చారిత్రక సందర్భంలో ప్రొఫెసర్ జయశంకర్ జీవించి ఉంటే ఎంతో సంతోషించేవారని, వారు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధనోద్యమంలో భావజాలవ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వయంపాలనా స్వాప్నికుడు, జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం సీఎం ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం వారు చేసిన కృషి అజరామరమైనదని అన్నారు.

నాడు సార్ కాళ్లు మొక్కిండు.. నేడు సార్ ఊరినే మర్చిండు

సీఎం కేసీఆర్‌పై టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ధ్వజం



ఆత్మకూరు: 'తెలంగాణ ఉద్యమ సమయంలో ఊకూకే జయశంకర్ సార్ కాళ్లు మొక్కిండు. రాష్ట్రమొచ్చినంక సీఎం అయ్యి సార్ ఊరినే మర్చిండు'అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పేర్కొన్నారు. జయశంకర్ సార్ స్వగ్రామమైన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట నుంచి బుధవారం ఆయన తెలంగాణ బచావో మొదటి దశ యాత్రను చేపట్టారు. అక్కంపేట గ్రామంలోని జయశంకర్ సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తోన్న దశాబ్ది ఉత్సవాలకు ప్రతిగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. గురువారం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'దశాబ్ది దగా'పేరుతో ఆందోళనలు నిర్వహించాలని, ఆర్డీవో, ఎమ్మార్వోలకు వినతిపత్రాలు సమర్పించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం పిలుపునిచ్చారు. ఈ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, రైతు రుణమాఫీ, 12% ముస్లింలకు, 12% గిరిజనులకు రిజర్వేషన్ల అంశాల్లో విఫలం చెందిన నేపథ్యంలో ఈ పది వైఫల్యాలను పది తలలపై రాసి రావణాసురుడి రూపంలో ఉన్న కేసీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఓ ప్రకటనలో ఆయన పిలుపునిచ్చారు.

ఏది అవాస్తవమని నిరసన చేస్తారు?

కాంగ్రెస్ పార్టీకి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్న



సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికే ప్రజలు నిరసన తెలిపారని, అందుకే ప్రతిపక్షంలో ఉన్నారని, అయినా వారికి ఇంకా బుద్ధి రావడం లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దశాబ్ది దగా'పేరుతో కాంగ్రెస్ చేపట్టబోయే నిరసనల అంశంపై ఆయన మండిపడ్డారు. ఉత్సవాల్లో ఏది అవాస్తవమని నిరసన చేస్తారు.. ప్రజలకు సంక్షేమం అందటం అవాస్తవమా.. మేము వేసిన రోడ్ల మీద మీరు నడుస్తున్నది అవాస్తవమా.. మేమిస్తున్న మంచినీళ్లు ప్రతిపక్షాలు తాగడం అవాస్తవమా? అంటూ ప్రశ్నించారు. ఏం అభివృద్ధి జరగలేదో కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో ప్రజలను నమ్మిస్తామన్న మూర్ఖపు భావనలో ప్రతిపక్షాలు ఉన్నాయన్నారు.

మరో 31 మంది కాంగ్రెస్ అధికార ప్రతినిధులుగా నియామకం

జాబితా విడుదల చేసిన టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులుగా మరో 31 మందిని నియమించారు. ఈ మేరకు కొత్తగా నియమితులైన అధికార ప్రతినిధుల జాబితాను బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. కత్తి వెంకటస్వామి, శ్రీరంగం సత్యం, కొనగాల మహేశ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సయ్యద్ నిజాముద్దీన్, పాల్వాయి స్రవంతిరెడ్డి, మరికంటి భవానీ రెడ్డి, గౌరి సతీశ్, బండారు శ్రీకాంత్, ఎ.బి.శ్రీనివాస్, అవెల్లి దామోదర్, అనపర్తి జ్ఞానసుందర్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బండి సుధాకర్‌గౌడ్, సామ రామ్మోహన్‌రెడ్డి, కత్తి కార్తీకగౌడ్, బొజ్జ సంధ్యారెడ్డి, మ్యాడమ్ బాలకృష్ణ, వి.యోగేశ్‌రెడ్డి, దూడం వెంకటరమణ, మద్ది శ్రీనివాసరెడ్డి, బూస వేణుగోపాల్ యాదవ్, బి.లింగంయాదవ్, మేడి రవిచంద్ర, చెనగాని దయాకర్, ఎ.కృష్ణతేజ, జహీర్ అక్తర్, కొర్రి వెంకటరత్నం, షేక్‌షావలి ఆచారి, చుక్కల ఉదయచంద్ర, ధరావత్ వెంకన్న నాయక్‌లను అధికార ప్రతినిధులుగా నియమించగా, బి.వచన్‌కుమార్, కె.శ్రీకాంత్ యాదవ్‌లను మీడియా కోఆర్డినేటర్లుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మరో 'పాతిక' చేతివైపు!

- జాబితాలో పొంగులేటి, జూపల్లితో పాటు మరికొంత మంది..
- కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్, బీజేపీ అసంతృప్త, 'ఉక్కపోత' నేతల చూపు!
- టీజేఎస్, వైఎస్సార్‌టీపీలు కాంగ్రెస్‌లో విలీనమవుతాయని రాజకీయ వర్గాల్లో చర్చ



పొంగులేటి నివాసంలో ఆయనతో సమావేశమైన రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి, మహేష్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఒక పార్టీలోంచి మరో పార్టీలోకి చేరికలు, ఇందుకు సంబంధించిన సమావేశాలు, మంతనాలు సర్వసాధారణమే. అయితే ఇటీవలి కర్ణాటక ఎన్నికల ఫలితాలు.. తెలంగాణ కాంగ్రెస్ రాతను మార్చేంతగా రాష్ట్రంలోని ఇతర రాజకీయ నాయకులను ప్రభావితం చేస్తున్నాయా? రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో త్వరలో కచ్చితంగా జరుగుతాయని భావిస్తోన్న జంపింగ్‌లతో బీఆర్ఎస్, కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ దిశగా అడుగులు పడుతున్నాయా? మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బీఆర్ఎస్, బీజేపీల్లోని పలువురు అసంతృప్త నేతలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వచ్చారా?.. అంటే అవుననే అంటున్నాయి టీపీసీసీ వర్గాలు. బుధవారం హైదరాబాద్ వేదికగా జరిగిన పొంగులేటి, జూపల్లిల టీంను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే కార్యక్రమమే ఇందుకు పునాది అని, త్వరలోనే తమ పార్టీలోకి అనూహ్య చేరికలుంటాయని ఆ పార్టీ ముఖ్య నేతలు చెపుతున్నారు. పొంగులేటి, జూపల్లిలే కాకుండా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల నుంచి 25 మందికి పైగా ముఖ్య నేతలు తమతో టచ్‌లోకి వచ్చారని, వీరంతా సమయానుకూలంగా పార్టీ కండువాలు కప్పుకుంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ పునరేకీకరణ దిశగానే..?

టీపీసీసీ నేతలు చెబుతున్న దాని ప్రకారం.. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, జీహెచ్ఎంసీ పరిధిలోని పలు పార్టీలకు చెందిన నాయకులు హస్తం పార్టీతో టచ్‌లోకి వచ్చారు. బీఆర్ఎస్‌లో వర్గపోరు ఉన్న నియోజకవర్గాల్లో తమకు టికెట్ రాదని అంచనా వేసుకుంటున్న నాయకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి బీజేపీలోకి వెళ్లి అక్కడ ఇమడలేకపోతున్న నేతలు, కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీయేనని అంచనాకు వస్తున్న వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ జాబితాలో మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, జిల్లా పరిషత్, డీసీసీబీ చైర్మన్లు, ఎంపీపీలు కూడా ఉన్నారు. కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం.. బీఆర్ఎస్‌కు సంబంధించి రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరించే వేముల వీరేశం, నేతి విద్యాసాగర్, పట్నం మహేందర్ రెడ్డి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కపిలవాయి దిలీప్‌కుమార్, కన్నంతరెడ్డి శశిధర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రేఖానాయక్, బి.మనోహర్‌రెడ్డి (రంగారెడ్డి), పాల్వాయి రజని, లాస్య నందిత (మాజీ ఎమ్మెల్యే సాయన్న కూతురు), మేఘారెడ్డి, ఆరేపల్లి మోహన్, సత్యనారాయణ గౌడ్ (చొప్పదండి), రఘురామిరెడ్డి (పాలకుర్తి), పాయం వెంకటేశ్వర్లు, పిడమర్తి రవి, తీగల కృష్ణారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డిలు ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలతో సంప్రదింపులు పూర్తి చేసుకున్నారు. వీరంతా పరిస్థితులను బట్టి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని, తమ పార్టీలోకి రావడం ఖాయమని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ఇక పొంగులేటి, జూపల్లి టీం త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనంగానే జరగనుందని చెబుతున్నారు. బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌లో నాయకుల చేరికకు ఊతమిస్తున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి నివాసంలో ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ కోసమే ఈ చేరికలు జరుగుతున్నాయి. వీళ్లే కాదు.. ఇంకా చాలామంది కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మంచి ముహూర్తంలో వీరంతా కాంగ్రెస్‌లో చేరతారు.'అని చెప్పడం గమనార్హం. కాగా గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితా యాదవ్, కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బుధవారం రేవంత్‌తో సమావేశం కాగా, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జెడ్పీ చైర్‌పర్సన్లు కూడా త్వరలోనే టీపీసీసీ చీఫ్‌తో భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

బీజేపీ నుంచి ఎందరు? ఎవరెవరు?

బీజేపీ నుంచి కూడా పలువురు ముఖ్య నేతలు కాంగ్రెస్‌లోకి వస్తారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వివేక్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. వీరితో పాటు తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. వీరిలో పలువురు నేతలు పార్టీపై అసంతృప్తితో ఉన్నారని, ఇప్పటికే పలుమార్లు రహస్యంగా సమావేశమై ఏం చేయాలన్న దానిపై మంతనాలు జరిపారనే ప్రచారం జరుగుతోంది. అయితే వీరు నిజంగానే పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారా? ఎంతమంది కాంగ్రెస్‌తో టచ్‌లోకి వచ్చారు? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు టీజేఎస్, వైఎస్సార్‌టీపీలు కూడా కాంగ్రెస్‌లో విలీనమవుతాయనే చర్చ కొంతకాలంగా జరుగుతోంది. బీఆర్ఎస్, కేసీఆర్‌ల ఓటమి లక్ష్యంగా తన పార్టీని కూడా విలీనం చేసేందుకు వెనుకాడబోనని కోదండరాం ఇప్పటికే ప్రకటించారు. మాజీ మంత్రి జూపల్లితో చర్చల సందర్భంగా కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన కూడా వెళ్లారు. ఈ నేపథ్యంలో విలీనం కాకపోయినా కాంగ్రెస్, టీజేఎస్‌లు కలిసి పనిచేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌తో షర్మిల భేటీ అయిన నేపథ్యంలో.. ఆమె కూడా కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ఊహాగానాలు కొనసాగుతుండటం గమనార్హం.

కలసికట్టుగా విపత్తుల నివారణ

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోగ్యశాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో డాక్టర్ మన్సుఖ్ మాండవీయ బుధవారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సహా ఇతర రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు. వేడి సంబంధిత అనారోగ్యాలపై జాతీయ కార్యాచరణ ప్రణాళికను పాటించాలని, చికిత్సకు అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు, అవసరమైన మందులు, లాజిస్టిక్స్ లభ్యతను నిర్ధారించాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్రాలకు సలహా ఇచ్చారు. ప్రజలకు సకాలంలో హెచ్చరికలతో పాటు క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వడగాల్పుల ప్రభావ తీవ్రతను తగ్గించడానికి నివారణ సన్నద్ధతలో భాగంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్య కేంద్రాల స్థాయిలో విపరీతమైన వేడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం, కూల్/గ్రీన్ రూఫ్, విండో షేడింగ్, షేడ్స్ మొదలైన వాటిని అమర్చడం వంటి వేడిని తగ్గించే చర్యలను చేపట్టాలని ఆదేశించారు.

అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం: మంత్రి హరీశ్‌రావు

వడదెబ్బ బాధితులకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సాయం అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ సమీక్షలో రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ దెబ్బ తగిలిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా వార్డులు, ఐసీయూ పడకలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచి, తక్షణం వైద్య సాయం అందేలా అవసరమైన మందులు ఏర్పాటు చేశామన్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాల్పుల ప్రభావం నేపథ్యంలో మార్చి మొదటి వారంలో సమీక్ష నిర్వహించి, జిల్లాకు ఇద్దరు చొప్పున వైద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. వీరి ద్వారా సబ్ సెంటర్, పీహెచ్‌సీ సహా అన్ని ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. పబ్లిక్ హెల్త్ రెస్పాన్స్, హాస్పిటల్ రెస్పాన్స్ వ్యవస్థలను సంసిద్ధం చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ శ్వేత మహంతి పాల్గొన్నారు.

కుప్పకూలిన ఫ్లైఓవర్ శ్లాబ్

▶ మొదటి పేజీ తరువాయి



ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న కేటీఆర్. చిత్రంలో తలసాని, సుధీర్‌రెడ్డి తదితరులు

తీవ్రగాయాలైన రోహిత్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

వంకరలు తిరిగిన ఫ్లైఓవర్!

ఫ్లైఓవర్ పక్కన ఓ అధికార పార్టీ కీలక నేతకు చెందిన బహుళ అంతస్తుల నిర్మాణం ఉందని, దాన్ని కాపాడేందుకు ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను వంకరటింకరగా మార్చారని ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ప్రీకాస్టింగ్ ద్వారా నిర్మాణం జరగాల్సి ఉన్నా.. ర్యాంప్ వంకర వల్ల శ్లాబ్ వేస్తున్నారని, ఈ క్రమంలోనే ప్రమాదం జరిగిందని అంటున్నారు. మరోవైపు కాంక్రీట్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోపాటు ర్యాంప్ నిర్మాణానికి సపోర్ట్‌గా ఉపయోగించే ఇనుప రాడ్లు నాణ్యంగా లేనందునే ప్రమాదం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్ఆర్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి) పనుల్లో భాగంగా బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఈ ఫ్లైఓవర్ పనులు చేస్తోందని.. నిర్మాణ పనుల్లో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మొత్తం 12 శ్లాబులకుగాను పది శ్లాబులు పూర్తయ్యాయని, ప్రమాదం జరిగినది 11వ శ్లాబ్ అని వివరించారు.

ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు: మంత్రి కేటీఆర్

సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆందోళన వద్దని బాధితులకు భరోసా ఇచ్చారు. ప్రమాదంపై జీహెచ్ఎంసీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలోని కమిటీతో, జేఎన్టీయూతో విచారణ చేయించి.. కారకులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి తలసాని, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి తదితరులు బాధితులను పరామర్శించారు.

స్వాగత యాత్ర షురూ

▶ మొదటి పేజీ తరువాయి

వారి నివాసానికి వెళ్తారని తొలుత ప్రచారం జరిగినా.. ఉన్నట్టుండి బుధవారం ఉదయం రేవంత్ హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో ప్రత్యక్షమయ్యారు. కోమటిరెడ్డిని వెంటబెట్టుకుని జూపల్లి నివాసానికి వెళ్లారు. అక్కడ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నేతలు రాజేశ్‌రెడ్డి (ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు), కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. ఈ భేటీలో కేంద్ర మాజీ మంత్రి, బలరాం నాయక్, ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు మల్లురవి, చిన్నారెడ్డి, శివసేనారెడ్డిలతో పాటు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఫిరోజ్‌ఖాన్, వేంనరేందర్ రెడ్డి, అభిలాష్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా అక్కడే భోజనం చేశారు. తర్వాత జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసానికి చేరుకున్నారు. పొంగులేటి వారికి ఎదురెళ్లి స్వాగతం పలికారు. ఆ తర్వాత ఉమ్మడి ఖమ్మంతో పాటు నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి వచ్చిన పొంగులేటి ముఖ్య అనుచరులు, నేతలతో భేటీ అయ్యారు. ఈ భేటీలో పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, మువ్వా విజయ్‌బాబు, విజయాబాయి, జారె ఆదినారాయణ, పొంగులేటి ప్రసాదరెడ్డి, సుధాకర్, రఘునాథ్‌యాదవ్, మేఘారెడ్డి, పాండురంగారావు, నూకల నరేశ్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత రేవంత్, కోమటిరెడ్డి, జూపల్లి, పొంగులేటి, మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి తదితరులు ప్రత్యేకంగా భేటీ అయి కాంగ్రెస్ పార్టీలోకి చేరిక, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం కాంగ్రెస్ నేతలు, పొంగులేటి, జూపల్లిలు విడివిడిగా విలేకరులతో మాట్లాడారు. మొత్తం మీద మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఆహ్వాన కార్యక్రమం జరిగింది.

ఖమ్మం నడిబొడ్డున చేరతా: పొంగులేటి

పొంగులేటి, జూపల్లిలు కూడా విలేకరులతో మాట్లాడారు. తాము ఏ పార్టీలో చేరాలనే దానిపై నిర్ణయం తీసుకున్నామని, ఈ నెల 24 లేదా 25న పార్టీ వివరాలు, చేరిక గురించి చెపుతామని పొంగులేటి తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో చేరికలుంటాయని చెప్పారు. తాను ఢిల్లీలో లేదా హైదరాబాద్‌లో పార్టీలో చేరబోనని, ఖమ్మం నడిబొడ్డున చేరతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమను పార్టీలోకి ఆహ్వానించారని, వారి ఆహ్వానంపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసమే తమ తపన అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం మూడు స్థానాలపై పరిశీలన జరుగుతోందని, వీటిల్లో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పొంగులేటి తెలిపారు

కేసీఆర్‌పై తిరుగుబాటు మొదలైంది: రేవంత్


పొంగులేటి నివాసంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లురవి తదితరులతో కలిసి రేవంత్ విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు తాను, కోమటిరెడ్డి కలిసి పొంగులేటి, జూపల్లిలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ చేరికలు సామాన్యమైనవి కావని, తెలంగాణకు పట్టిన గులాబీ చీడను వదిలించడానికేనని అన్నారు. కేసీఆర్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి కలిగించేందుకు, కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణకు, ఆయన పతనానికి పొంగులేటి తదితర మిత్రులు పునాదులు వేశారని చెప్పారు. త్వరలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలను కలిసి అన్ని పరిణామాలను వివరించి ఆశీస్సులు తీసుకుని ఖమ్మంలో సభ నిర్వహిస్తామని చెప్పారు.

రాష్ట్రాన్ని కాపాడేందుకు అంతా కలిసిరావాలి: కోమటిరెడ్డి

పొంగులేటి, జూపల్లికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కోమటిరెడ్డి చెప్పారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా స్వచ్ఛందంగా తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. తమకు అధికారంపై మక్కువ లేదని, అదేఉంటే తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఇచ్చేదే కాదన్నారు. ఖమ్మంలో నిర్వహించబోయే సభతోనే తమ ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందని, 70–80 స్థానాల్లో విజయం సాధిస్తామని చెప్పారు. ఈసారి కేసీఆర్ ఇంటికో కిలో బంగారం ఇచ్చినా గెలవడని వ్యాఖ్యానించారు.

కొత్తగా 300 అమ్మ ఒడి వాహనాలు

- మరో 204 అత్యవసర 108 వాహనాలు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సిద్దిపేటలో యోగా చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/సిద్దిపేట: వైద్య, ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా 300 అమ్మ ఒడి వాహనాలు, మరో 204 అత్యవసర 108 వాహనాలు, 34 పార్థివ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆయా వాహనాల పనితీరుపై మంత్రి హరీశ్‌రావు బుధవారం సమీక్షించారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంలో భాగంగా 300 అమ్మ ఒడి వాహనాలను జూలై మొదటి వారంలోగా ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అమ్మఒడి వాహనం 102 పనితీరును ప్రశంసించారు. అమ్మఒడి వాహనాల పనితీరు, రిపేర్లు, మెయింటెనెన్స్ వంటివాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కాలం చెల్లిన వాహనాలను వెంటనే తొలగించి నూతన వాహనాలను వాటి స్థానంలో చేర్చాలని సూచించారు. కాలం చెల్లిన 108 అంబులెన్స్‌ల స్థానంలో 204 అంబులెన్స్‌లను జూలై చివరి వారంలోగా అందుబాటులోకి తీసుకొని రావాలని ఆదేశించారు. జూలై చివరినాటికి 34 పార్థివ వాహనాలు అదనంగా జూలై చివరినాటికి వాడకంలోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌ది పైశాచిక ఆనందం..

రాష్ట్ర ప్రజలంతా దశాబ్ది వేడుకలను జరుపుకొంటూ తెలంగాణ అమరులను స్మరించుకుంటుంటే కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపడతామనడం పైశాచిక ఆనందమేనని హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో బుధవారం ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉద్యమంలో కలిసి రానివారికి అమరుల త్యాగాలు కూడా పట్టవని ఎద్దేవా చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ దశాబ్దకాలం పాటు మోసం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పవర్ హాలిడేలు, ఎరువుల కొరతలు పునరావృతం అవుతాయన్నారు.

రోజుకో గంట యోగా చేయాలి..

ప్రతిరోజూ ఒక గంటపాటు యోగా, ప్రాణాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేటలో బుధవారం జరిగిన అంతర్జాతీయ యోగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉండి, హాస్పిటల్‌కు వెళ్లకుండా ఉన్నప్పుడే ఆరోగ్య తెలంగాణ సాకారమవుతుందన్నారు.

స్వపరిపాలనలో ఆధ్యాత్మిక వైభవం

▶ మొదటి పేజీ తరువాయి

అమలుకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. ధూప దీప నైవేద్య పథకం ద్వారా అర్చకులకు ఇస్తున్న వేతనాలను రూ.6,000 నుంచి రూ.10,000కు పెంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు.

చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూలు..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూ ప్రసాదాన్ని ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఈవో గీతారెడ్డిలు ప్రారంభించారు. తొలి లడ్డూను దేవాదాయ శాఖ ఏడీసీ జ్యోతికి అందజేశారు. బంగారు, వెండి నాణేలను ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత ప్రారంభించగా...రూ.21 వేలు చెల్లించి 3 గ్రాముల బంగారం నాణాన్ని ఈవో గీతారెడ్డి, రూ.1,000 చెల్లించి 5 గ్రాముల వెండి నాణేమును ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి కొనుగోలు చేయగా.. వారికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వాటిని అందజేశారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి వెబ్‌పోర్టల్‌ను ఆవిష్కరించి, ఆన్‌లైన్ టికెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆలయాధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై ఈడీ దాడులు

▶ మొదటి పేజీ తరువాయి

ఘనాపూర్‌లో ఉన్న మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్‌లోని దక్కన్ మెడికల్ కాలేజీ, ఖమ్మంలోని మమత కాలేజీ, చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, మొయినాబాద్‌లోని భాస్కర మెడికల్ కాలేజీ, కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల, మంత్రి మల్లారెడ్డికి చెందిన సీఎంఆర్ మెడికల్ కాలేజీ, ప్రతిమ మెడికల్ కాలేజీ, సంగారెడ్డిలోని ఎస్ఎంఆర్ మెడికల్ కాలేజీలలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ అడ్మిషన్ల రికార్డులు, కాలేజీల బ్యాంకు లావాదేవీల వివరాలను సేకరించారని, పలు అంశాలపై ప్రిన్సిపాల్‌లను ప్రశ్నించారని తెలిసింది. పలు కంప్యూటర్ హార్డ్‌డిస్కలను, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్టుగా ఈడీ అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది.

కాళోజీ వర్సిటీ ఫిర్యాదు నేపథ్యంలోనే?

పలు మెడికల్ కాలేజీలు పీజీ సీట్లు, ఎంబీబీఎస్ బీ కేటగిరీ సీట్లలో డమ్మీ అభ్యర్థులు చేరేలా చేసి బ్లాక్ చేయడం.. కౌన్సెలింగ్ ప్రక్రియ అంతా పూర్తయ్యాక ఆ అభ్యర్థులు సీట్లను వదులుకునేలా చేయడం.. దీనితో నిబంధనల ప్రకారం ఎన్నారై కేటగిరీలోకి మారిన సీట్లను కోట్లకు అమ్ముకోవడంపై గత ఏడాది భారీగా ఆరోపణలు వచ్చాయి. దీనిపై కాళోజీ యూనివర్సిటీ స్పందించి పరిశీలన చేపట్టింది. నీట్‌లో మంచి ర్యాంకులు వచ్చి, తమ రాష్ట్రాల్లోనే మెడికల్ పీజీ సీట్లు వచ్చే అవకాశమున్నా.. ఇతర రాష్ట్రాల విద్యార్థులు 34 మంది రాష్ట్ర మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకున్నట్టు గుర్తించింది. దీనిపై వివరణ ఇవ్వాలని వారందరికీ కాళోజీ వర్సిటీ లేఖలు రాసింది. ఈ 34 మందిలో 18 మందే కాలేజీల్లో చేరగా.. మిగతా 16 మంది చేరలేదు. ఆ 16 మందిలోనూ ఏడుగురు అసలు తాము బీ కేటగిరీ సీట్లకు దరఖాస్తే చేయలేదని వివరణ ఇచ్చారు. ఇక ఎంబీబీఎస్‌లో చేరినవారిలోనూ 56 మంది సీట్లు వదులుకోవడంతో.. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు కాళోజీ యూనివర్సిటీ గుర్తించి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మెడికల్ కాలేజీలు మంచి ర్యాంకు వచ్చిన ఇతర రాష్ట్రాల వారిని గుర్తించి, ఇక్కడ చేరి సీటు వదులుకుంటే రూ.10 లక్షల వరకు ఇస్తామని దరఖాస్తు చేయిస్తున్నాయని.. అలా మిగిలిన సీటును కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

నేడో రేపో నైరుతి రాక!

▶ మొదటి పేజీ తరువాయి

మోస్తరు వర్షాలు నమోదవుతాయని వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రత అత్యధికంగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 43.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ఠ ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 41.0 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత నల్లగొండలో 23.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్షాలు పడ్డాయి.

అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ఠ ఉష్ణోగ్రత
దస్తురాబాద్	నిర్మల్	43.2
తిమ్మాపూర్	కరీంనగర్	42.8
మధిర	ఖమ్మం	42.2
గన్నేరువరం	కరీంనగర్	42.1
కోనరావుపేట	సిరిసిల్ల	41.8

జాగా ఉంటే చాలు.. పక్కా ఇల్లు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీలకు 20 శాతానికి తక్కువ కాకుండా, ఎస్టీలకు 10 శాతానికి తక్కువ కాకుండా కేటాయించనున్నట్టు ఉత్తర్వులో పొందుపరిచింది.

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ

ఇళ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజల నుంచి స్వీకరిస్తారు. ప్రజా ప్రతినిధుల నుంచి కూడా స్వీకరిస్తారు అంటూ ప్రత్యేకంగా పేర్కొనడం విశేషం. గ్రామాల ఎంపిక దాదాపు స్థానిక ఎమ్మెల్యేల చేతుల్లోనే ఉండనుందని సమాచారం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఇళ్లను దశలవారీగా మంజూరు చేస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో గ్రేటర్ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. కేటాయింపులు పోను మిగిలిపోయే దరఖాస్తులను పర్మనెంట్ వెయిట్ లిస్టులో నమోదు చేస్తారు. తదుపరి కేటాయింపులకు ఆ జాబితాను వినియోగిస్తారు.

మూడు విడతల్లో బిల్లుల చెల్లింపు

ఇంటికి మంజూరు చేసే రూ.3 లక్షలను మూడు విడతల్లో అందజేస్తారు. బేస్‌మెంట్ స్థాయి, పైకప్పు నిర్మాణ సమయం, పూర్తయ్యాక.. ఇలా విడతలవారీగా రూ.1 లక్ష చొప్పున అందజేస్తారు. ఇందు కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది. జన్‌ధన్ ఖాతాను ఇందుకు వాడరాదని ప్రభుత్వం నిర్ణయించింది.

కేంద్ర ప్రభుత్వ పథకంతో లింకు లేనట్టేనా?

గృహలక్ష్మి పథకాన్ని కేంద్రప్రభుత్వ గృహ నిర్మాణ పథకంతో లింకు లేకుండా ప్రస్తుతానికి సొంత నిధులతోనే చేపట్టే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో లింకు పెట్టారు. కేంద్రం మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య ఆధారంగా అక్కడి నుంచి నిధులు విడుదలయ్యాయి. తొలి విడత నిధులు వచ్చినా, డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం ఓ పద్ధతి లేకుండా సాగడంతో కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం లబ్ధిదారుల జాబితా కూడా లేకుండా పథకాన్ని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించి, లబ్ధిదారుల జాబితా ఇస్తేనే మలివిడత నిధులు విడుదల చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. ఫలితంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం కాస్తా అభాసుపాలు కావాల్సి వచ్చింది. ఇప్పుడు ఎన్నికలకు పెద్దగా సమయంలేని నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ పథకంతో లింకు పెట్టుకుంటే రకరకాల కారణాలతో సమయం వృథా అవుతుందని, దాని బదులు సొంత నిధులతోనే ప్రస్తుతానికి చేపడితే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోందని సమాచారం.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 22 । జూన్ । 2023

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
38.9°	27.7°

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కమిటీ



నూతన కమిటీకి అభినందనలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ నూతన ఎకనామిక్ కమిటీ పాలకవర్గం రాష్ట్ర మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు మంత్రి హరీష్‌రావును బుధవారం కలిశారు. మూడురోజుల క్రితం జరిగిన ఎకనామిక్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, ఉపాధ్యక్షుడు ఆదిత్య మార్గం, కార్యదర్శి రంగా రెడ్డి, జాయింట్ సెక్రటరీ ధీరజ్ జైస్వాల్, కోశాధికారి డాక్టర్ వంశీ తిలక్‌లతో పాటు ఇతర సభ్యులు మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి అభినందనలు తెలిపారు.

కొల్లూరులో నిర్మించిన ఇళ్లు ఆసియాలోనే అతిపెద్దవి

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



పటాన్‌చెరు టౌన్: కొల్లూరులో 124 ఎకరాల్లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఆసియాలో అతిపెద్దవని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం పటాన్‌చెరులో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సభాస్థలిని ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, చింతా ప్రభాకర్, సంగారెడ్డి కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్‌తో కలసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గురువారం ఉదయం కొల్లూరులో నిర్మించిన ఇళ్ల సముదాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారని, అనంతరం నాగులపల్లిలో రైల్వే కోచ్ పరిశ్రమ ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత పటాన్‌చెరులో 183 కోట్లతో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. ఆస్పత్రి రాకతో ఈ ప్రాంత కార్మికులకు ఉచిత వైద్యం అందుబాటులోకి రానుందన్నారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు తప్ప మరేమీ అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ శతాబ్ద కాలం దగా చేసిందన్నారు. కాంగ్రెస్‌ను రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు.

'గాంధీ'లో యోగా రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం




గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో యోగా రీసెర్చ్ ల్యాబ్‌ను బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు, ఫిజియాలజీ హెచ్‌ఓడీ రమాదేవిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన యోగా రీసెర్చ్ ల్యాబ్ ద్వారా కలిగే లాభాలను మరింత విస్తృతంగా, శాస్త్రీయ పద్ధతుల్లో విశ్లేషించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు వివిధ కారణాలతో మానసిక ఒత్తిడికి గురై చిన్న వయసులోనే బీపీ, షుగర్, హార్ట్ ఎటాక్ తదితర రుగ్మతల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యోగాను శాస్త్రీయంగా అభ్యాసం చేస్తే ఆరోగ్యవంతమైన జీవనం సొంతం అవుతుందన్నారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షల షెడ్యూలు విడుదల


ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ ప్రవేశ పరీక్షల షెడ్యూలును విడుదల చేసినట్లు బుధవారం టీఎస్‌సీపీఈటీ–2023 (తెలంగాణ స్టేట్ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్) కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 10 వరకు జరిగే పరీక్షల టైంబుల్ ఇతర వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో (ఉస్మానియా.ఎసి.ఇన్)చూడవచ్చని పేర్కొన్నారు.

చినుకు.. పలుకు



తొలకరి పలకరించింది. నైరుతి రుతు పవనాల ఆగమనంతో నగరంలో చిరుజల్లులు కురిశాయి. బుధవారం సాయంత్రం వర్షం పడింది. కొన్నిరోజులుగా మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు వర్షం పలకరింపుతో పాటు చల్లటి గాలులతో ఉపశమనం పొందారు. సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్ర ప్రభావం చూపగా.. ఆ తర్వాత వాతావరణం మారిపోయింది. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, సైదాబాద్, దిల్‌సుఖ్‌నగర్, కాప్రా, మల్కాజిగిరి, హైటెక్ సిటీ, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది.

–సాక్షి, సిటీబ్యూరో



అదిగదిగో.. మీ యాది!

ఎన్నో ప్రత్యేకతల సమాహారంగా రూపుదిద్దుకున్న అమరుల స్మారక స్తూపాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు ప్రారంభించనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరాన.. ఒకవైపు రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ భారీ విగ్రహం, రాష్ట్రానికే మకుటాయమానంగా నిలిచిన సెక్రటేరియట్ మరోవైపు.. తెలంగాణ సాధనలో అమరులైన వారి గుర్తుగా నిర్మించిన అమరుల స్మారకం ఇంకోవైపు.. ఇలా ఈ ప్రాంతానికి కొత్తందాల మేళవింపు నగర వాసులకు కనువిందు చేస్తున్నాయి. బుధవారం రాత్రి విద్యుత్ కాంతుల మధ్య జ్వలిత దీపంలా వెలుగొందుతూ కనిపించింది.

ఈ నగరానికి ఏమైంది..?

CRIME CITY రక్తచరిత్ర

ఒకేరోజు వరుస హత్యలు, హత్యాయత్నాలతో కలకలం



- మైలార్‌దేవ్‌పల్లి, టప్పాచబుత్ర, చాదర్‌ఘాట్‌ల్లో మర్డర్లు
- వీటిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జంట హత్యలు
- నార్సింగిలో ప్రేమను నిరాకరించిన యువతిపై హత్యాయత్నం
- ఎస్సార్‌నగర్ పరిధిలో కత్తి పోట్లు, బీరుబాటిళ్లతో దాడులు
- 16 గంటల్లో నేరాలు, ఘోరాలతో ఉలిక్కిపడిన భాగ్యనగరం

....✍ సాక్షి, సిటీబ్యూరో/రాజేంద్రనగర్/మణికొండ/చాదర్‌ఘాట్/విజయ్‌నగర్ కాలనీ/అమీర్‌పేట

హైదరాబాద్.. అంటే మెట్రో పరుగులు.. ఐటీ మెరుగులు.. అంతర్జాతీయ స్థాయిలో దినాదినాభివృద్ధి చెందుతున్న మహానగరం. విశ్వనగరిగా విస్తరిస్తూ.. మెట్రో సిటీల్లో మేటిగా వెలుగొందుతున్న భాగ్యనగరం.. అభివృద్ధిలో అందనంత వేగంగా దూసుకుపోతోంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు, నేరాలు ఘోరాలు మరోవైపు.. రాజధానిలో రక్త చారికలు పారుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు నగరం వరుస ఉదంతాలతో అట్టుడికిపోయింది. 16 గంటల్లో అయిదు హత్యలు, హత్యాయత్నంతో పాటు కత్తిపోట్లు, దాడులు చోటుచేసుకున్నాయి. ప్రేమోన్మాదం, వివాహేతర సంబంధం, వేధింపులు, మద్యం మత్తు తదితరాలు వీటికి కారణాలుగా నిలిచాయి. మైలార్‌దేవ్‌పల్లి ఉదంతం మినహా మిగిలిన చోట్ల బాధితులు, హతులు, నిందితులు, అనుమానితులంతా 30 ఏళ్ల లోపువాళ్లే కావడం గమనార్హం. ప్రాంతాలవారీగా ఉదంతాలిలా..

ఇద్దరు ట్రాన్స్‌జెండర్ల దారుణ హత్య

ప్రాంతం: ఆసిఫ్‌నగర్‌లోని దైబాగ్
సమయం: అర్ధరాత్రి 1.30 గంటలు
నేరం: జంట హత్యలు
హతులు: ట్రాన్స్‌జెండర్లు డాలీ, సోఫియా
నిందితులు: సయ్యద్ ఇనాయత్, మహ్మద్ ఇనాయత్
కారణం: పెళ్లి చేసుకోమని వేధించడం, బెదిరించడం

ఆసిఫ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని మహబూబ్ కాలనీకి చెందిన సయ్యద్ యూసుఫ్ అలియాస్ డాలీ (25), మహ్మద్ రియాజుద్దీన్ అలియాస్ సోఫియా (27) ట్రాన్స్‌జెండర్లు. దైబాగ్ ప్రాంతానికి చెందిన కార్పెంటర్ సయ్యద్ ఇనాయత్‌తో డాలీకి స్నేహం ఉంది. గతంలో వీళ్లు సన్నిహితంగా మెలిగారు. కొన్నాళ్లుగా డాలీ తనను వివాహం చేసుకోవాలని ఇనాయత్‌ను వేధిస్తోంది. గతంలో సన్నిహితంగా ఉన్నప్పటి ఫొటోలను బయటపెడతానని బెదిరిస్తోంది. దీంతో ఆమెపై కక్షగట్టిన ఇతగాడు తన స్నేహితుడైన కిషన్‌బాగ్ వాసి మహ్మద్ ఇనాయత్‌తో కలిసి హత్యకు పథకం రచించాడు. మంగళవారం రాత్రి మాలపల్లిలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకున్న డాలీ, సోఫియా అక్కడకు సయ్యద్ ఇనాయత్‌ను పిలిచారు. తన స్నేహితుడైన మహ్మద్ ఇనాయత్‌తో కలిసి వెళ్లిన ఇతగాడు వారితో కలిసి మద్యం తాగారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వీళ్లు తమ ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. కిషన్‌బాగ్‌లోని సయ్యద్ ఇనాయత్ ఇంటి వద్దకు రాగానే.. ఇతడితో పాటు స్నేహితుడూ రెచ్చిపోయారు. ఇనాయత్ ఇంటి నుంచి కత్తులు తీసుకువచ్చి డాలీతో పాటు ఆమెతో ఉన్న సోఫియాను పొడిచారు. కిందపడిపోయిన ఇద్దరిపై బండరాళ్లు విసిరి చంపేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం పరీక్షలకు తరలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.





చెలరేగిన ఉన్మాది

ప్రాంతం: మైలార్‌దేవ్‌పల్లి ఓల్డ్ కర్నూల్ రోడ్
సమయం: తెల్లవారుజాము 2.20–2.35 గంటలు
నేరం: జంట హత్యలు
హతులు: ప్రకాష్, యాచకుడు
అనుమానితుడు: గుర్తు తెలియని వ్యక్తి
కారణం: ఉన్మాదం లేదా మద్యం మత్తుగా అనుమానం

మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రకాష్ (50), మరో ఆరుగురు బతుకుదెరువు కోసం వలస వచ్చారు. రహదారి పక్కనే తాత్కాలికంగా గుడారాలు వేసుకుని, దుప్పట్లతో పాటు చిన్న చిన్న వస్తువులు విక్రయిస్తూ జీవిస్తున్నారు. మంగళవారం తన గుడారాన్ని మూసిన ప్రకాష్ పక్కనే ఉన్న దుకాణం వద్ద నిద్రకు ఉపక్రమించాడు. ఈ షాపులకు ఇతడు కాపలాదారుగానూ పని చేస్తున్నాడు. ఈ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో ఉన్న టైల్స్ దుకాణం ముందు ఓ యాచకుడు నిద్రిస్తున్నాడు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి వీరి వద్దకు వచ్చి సమీపంలో ఉన్న బండరాళ్లు తలపై వేసి చంపేశాడు. టైల్స్ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాల ప్రకారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి రెండు సార్లు అక్కడ సంచరించాడు. ఆపై అక్కడి పాన్ డబ్బా పక్కనే ఉన్న గ్రనేట్‌ను తీసుకువచ్చి యాచకుడి తలపై వేయడం కనిపించింది. దీనికి ముందే అతడు ప్రకాష్‌ను చంపినట్లు ఘటనాస్థలిని బట్టి తెలుస్తోంది. బుధవారం ఉదయం ఈ రెండు మృతదేహాలను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓల్డ్ కర్నూల్ రోడ్డు జాతీయ రహదారి అయినప్పటికీ ఆ ప్రాంతం వీధి దీపాలు వెలగకపోవడంతో సీసీ కెమెరాల్లో అనుమానితుడు స్పష్టంగా కనిపించట్లేదు. ఈ హత్యలు చేసిన యువకుడు నడుచుకుంటూ ముందుకు వెళ్లిపోయినట్లు మాత్రం రికార్డు అయింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు దుర్గానగర్ చౌరస్తా నుంచి కాటేదాన్ వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.



యాచకుడి మృతదేహం



సంఘటన స్థలంలో ప్రకాష్ మృతదేహం

మేనమామ ఘాతుకం

ప్రాంతం: నార్సింగిలోని టీ గ్రిల్ హోటల్
సమయం: మంగళవారం రాత్రి 9.40 గంటలు (బుధవారం వెలుగులోకి వచ్చింది)
నేరం: హత్యాయత్నం
బాధితురాలు: వాసవి
నిందితుడు: సమీప బంధువు గణేష్
కారణం: ప్రేమోన్మాదం

ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొత్త వాసవి (22), ఈమె మేనమామ చిలకలూరిపేట వాసి కొత్త గణేష్ (27) హైదరాబాద్‌కు వలస వచ్చారు. వాసవి సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తూ గచ్చిబౌలి ఇందిరానగర్‌లోని హాస్టల్‌లో ఉంటోంది. ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గణేష్ ఆ సమీపంలోని మరో హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇతగాడు మూడేళ్లుగా ప్రేమ పేరుతో ఆమె వెంట పడుతున్నాడు. వీళ్ల ఇంటి పేర్లు ఒకటే కావడం, గణేష్‌కు సరైన ఉద్యోగం లేకపోవడంతో ఆమె కుటుంబీకులు అంగీకరించలేదు. గణేష్ ఎన్ని సార్లు ప్రేమ, పెళ్లి పేర్లతో వేధిస్తున్నా వాసవి పట్టించుకోలేదు. దీంతో ఆఖరుసారిగా నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి మాట్లాడాలని, అంగీకరిస్తే పెళ్లి చేసుకోవడం లేదంటే హతమార్చడమే మార్గమని అతడు భావించాడు. తన బ్యాగ్‌లో మొక్కలు కత్తిరించే కత్తిని పెట్టుకుని మంగళవారం రాత్రి ఆమె హాస్టల్ వద్దకు వెళ్లాడు. మాట్లాడాలంటూ 9.30 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై కోకాపేట శివారులోని టీ గ్రిల్ హోటల్ వెనుక వైపునకు తీసుకువచ్చాడు. అక్కడ మళ్లీ ప్రేమ, పెళ్లి ప్రస్తావన తేవటంతో ఆమె తిరస్కరించింది. దీంతో ఆమె మరెవరినో ప్రేమిస్తోందని విచక్షణ కోల్పోయి ప్రేమోన్మాదిగా మారిన గణేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోయడానికి ప్రయత్నించాడు. ఆమె అడ్డుకోవడంతో తల, మెడ, ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. రహదారిపై వెళ్తున్న వాళ్లు ఆమె అరుపులు విని రావడంతో గణేష్ పరారయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి, నార్సింగి పోలీసులు ఘటనాస్థలికి వచ్చారు. అది నార్సింగి ఠాణా పరిధిగా తేలడంతో ఆ అధికారులే దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం బాధితురాలు అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గణేష్‌ను అరెస్టు చేసిన నార్సింగి పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు గణేష్



కత్తిపోటు గాయాలతో వాసవి

మద్యం మత్తులో కత్తి పోట్లు..

ప్రాంతం: బల్కంపేట పరిసరాలు
సమయం: మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము
నేరం: మూడు చోట్ల అయిదుగురికి కత్తిపోట్లు
బాధితులు: కార్తీక్ రాజు, శుభం జైస్వాల్, విశాల్, విష్ణు, సాయికుమార్
నిందితులు: సంజీవ్‌సింగ్, యశ్వంత్, సూర్య సహా గుర్తుతెలియని వ్యక్తి
కారణం: మద్యం మత్తు, క్షణికావేశం

మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అన్నదమ్ములైన విశాల్, విష్ణు క్రిస్టల్ హోటల్ వద్ద టీ తాగేందుకు వచ్చారు. అక్కడే ఉన్న యశ్వంత్, సూర్య వీరితో గొడవకు దిగారు. మాటా మాటా పెరిగి కత్తితో విశాల్, విష్ణులను పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ వారిద్దరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఎల్లమ్మ దర్శనానికి వచ్చిన ఎం.సాయికుమార్ తన మిత్రులతో కలిసి రాత్రి 10.30 గంటల సమయంలో బోనాల కాంప్లెక్స్ వద్ద ఉండగా గుర్తు తెలియని యువకుడు సాయికుమార్‌తో ఘర్షణ పడ్డాడు. కత్తితో సాయికుమార్ కడుపులో పొడవగా తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు అతడిని సోమాజిగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుమారుడు కార్తీక్ రాజు, అతడి స్నేహితుడు శుభం జైస్వాల్‌పై పాత నేరస్తుడైన సంజీవ్‌సింగ్ కత్తితో దాడి చేశాడు. బోనాల కాంప్లెక్స్ సమీపంలోని మహంకాళి దేవాలయం వద్ద కార్తీక్, జైస్వాల్ నృత్యాలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గొడవకు దిగారు. అక్కడే ఉన్న సంజీవ్ తన వద్ద ఉన్న కత్తితో ఈ ఇద్దరిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కార్తీక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నేరచరితుడైన సంజీవ్ సింగ్‌ను అరెస్టు చేశారు.

'బంధానికి' అడ్డొస్తున్నాడని..

ప్రాంతం: చాదర్‌ఘాట్‌లోని ఫిర్దోస్ హోటల్
సమయం: బుధవారం మధ్యాహ్నం 1.45 గంటలు
నేరం: హత్య
హతుడు: యూసుఫ్
నిందితులు: అక్రమ్, సోహెబ్
కారణం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉండటం

కాలికబర్‌లోని ఒకే ప్రాంతంలో నివసించే యూసుఫ్ (30), అక్రమ్ ఆటో డ్రైవర్లు. యూసుఫ్ భార్యతో అక్రమ్‌కు వివాహేతర సంబంధం ఉంది. ఇరువురూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్లు. ఇది గమనించిన యూసుఫ్ ఇద్దరినీ మందలించాడు. గతంలో అక్రమ్‌పై మీర్‌చౌక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు తమ బంధానికి అడ్డుగా ఉన్న యూసుఫ్‌ను చంపాలని అక్రమ్ పథకం వేశాడు. బుధవారం మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో యూసుఫ్ మీర్‌చౌక్ నుంచి ఆజంపుర వైపు నడుచుకుంటూ వస్తుండటాన్ని ఇతడు గమనించాడు. ఫిర్దోస్ హోటల్ వెనుక వైపు తన స్నేహితుడైన సోహెల్‌తో కలిసి అక్రమ్ వేచి ఉన్నాడు. అటుగా వచ్చిన యూసుఫ్‌పై కత్తులతో దాడి చేసిన ఇద్దరూ నడిరోడ్డుపై హత్య చేసి పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం రెండు టీమ్‌లు రంగంలోకి దింపారు. బుధవారం రాత్రి ఇరువురినీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



యూసుఫ్ మృతదేహం

మరో ఘటనలో..

ఇదిలా ఉండగా.. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం నేపథ్యంలో మందు బాబులు రెచ్చిపోయారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై సంచరిస్తూ మహిళా భక్తులను భయాందోళనకు గురి చేశారు. సౌండ్ సిస్టమ్ వద్ద నృత్యాలు చేస్తున్న సమయంలో ఇరు వర్గాలు గొడవ పడి బీరు బాటిళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు యువకుల తలలు పగిలాయి. అక్కడికి వచ్చిన పోలీసులు వారిని చెదరగొట్టారు.

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం



ఉప్పల్‌లో మహిళా పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు



ఉప్పల్ మహిళా పోలీస్ స్టేషన్

- హోం మంత్రి మహమూద్ అలీ
- ఉప్పల్‌లో మల్కాజిగిరి మహిళా పోలీస్‌స్టేషన్ ప్రారంభం

ఉప్పల్: మహిళా భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన మల్కాజిగిరి డివిజన్ మహిళా పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. నేరం చేయాలంటే నేరస్తుల్లో వణుకు పుట్టేలా పోలీస్ వ్యవస్థ పటిష్టపడిందన్నారు. ఎలాంటి కేసులైనా 24 గంటల్లో ఛేదిస్తున్నారంటే తెలంగాణ పోలీస్ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో అర్థమవుతుందన్నారు. కేసీఆర్ కలలు కన్న బంగారు తెలంగాణ త్వరలోనే నిజం అవ్వబోతున్నట్లు తెలిపారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి మహిళా పోలీస్‌స్టేషన్ ఉప్పల్‌కు రావడం అభినందనీయమన్నారు. రాచకొండ పరిధిలో కేవలం తొమ్మిది నెలల్లో తొమ్మిది పోలీస్‌స్టేషన్లు వచ్చాయన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, డీసీపీలు జానకి, మురళీధర్, నర్మద, శ్రీబాల, కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, ఏసీపీ నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినిమా రంగం అభివృద్ధికి కృషి: మంత్రి తలసాని

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చలన చిత్ర, నాటకరంగం అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చలనచిత్ర అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సినీ, టీవీ నటుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కురుమాచలం మాట్లాడుతూ సినీరంగంతో పాటు నాటక రంగానికి సైతం తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. అనంతరం పలువురు సినీ నటులు, నాటకరంగ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎండీ అశోక్‌రెడ్డి, దర్శకుడు వైవిఎస్ చౌదరి, నటులు రాజీవ్ కనకాల, రోజారమణి, అశోక్‌కుమార్ తో పాటు పలువురు టీవీ నటులు పాల్గొన్నారు.



మైనింగ్ పేరుతో ముంచేశారు

నగర వాసులకు టోకరా వేసిన వైజాగ్ వ్యాపారి

- ఇద్దరి నుంచి దాదాపు రూ.90 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్న మైనింగ్ వ్యాపారంలో లాభాలు ఇస్తామంటూ నగర వాసులను మోసం చేశారు వైజాగ్‌కు చెందిన మైనింగ్ వ్యాపారి. మైనింగ్‌లో పెట్టుబడి పెట్టిన తొలిసారి కాస్తంత లాభాలు ఇచ్చి ఆపై ముఖం చాటేశారు. రెండేళ్ల వ్యవధిలో పలుమార్లు మైనింగ్‌పై వచ్చే లాభాలు ఇవ్వాలంటూ కోరినా పట్టించుకోకపోవడంతో బాధితులు సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మోసానికి పాల్పడ్డ వ్యక్తి, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని పహాడీషరీఫ్‌కు చెందిన ఖలీలుల్లాకు అతని బంధువు రహీముద్దీన్ ద్వారా విశాఖపట్టణంకు చెందిన షేక్ ఫిరోజ్ పరిచయమైయ్యాడు. షేక్ ఫిరోజ్ కొంతకాలంగా విజయవాడ కేంద్రంగా ఉన్న ×శ్రీ మినరల్స్ అండ్ ఎర్త్ మూవర్స్× కంపెనీ పేరుపై మైనింగ్ వ్యాపారం చేస్తున్నట్లు బాధితుడి బంధువు రహీముద్దీన్...ఖలీలుల్లాకు తెలిపాడు. దీంతో తొలిసారిగా ఖలీలుల్లా రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత దాదాపు రూ.15 లక్షలు రెండోసారి ఇచ్చాడు. ఖలీలుల్లాకు ఒకసారి 15 శాతం చొప్పున లాభాలు ఇవ్వడంతో షేక్ ఫిరోజ్‌పై నమ్మకం కలిగింది. ఈ నేపథ్యంలో ఖలీలుల్లా అతని సోదరుడు రహీముల్లా అలీబేగ్‌తో రూ.72 లక్షలు పెట్టుబడి పెట్టించారు. ఇలా ఇద్దరికీ వేర్వేరు సందర్భాల్లో కేవలం ఒక్కసారి మాత్రమే ముందుగా మాట్లాడుకున్న ప్రకారంగా 15 శాతం లాభాలను ఫిరోజ్ ఇచ్చాడు. ఆ తర్వాత లాభాలు ఇవ్వడం మానేయడంతో 2022 అక్టోబర్ నెల నుంచి ఫిరోజ్‌ను నిలదీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఫిరోజ్ ఫోన్‌లు లిఫ్ట్ చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. బాధితుడు మైనింగ్ వ్యాపారంతో తనని షేక్ ఫిరోజ్, కుటుంబ సభ్యులు మోసం చేశారంటూ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో షేక్ ఫిరోజ్‌తో పాటు అతని భార్య మహ్మద్ హమీద, కుమార్తె సుమాయ సుల్తాన, కుమారుడు జహీన్‌లపై 406, 420 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొడుకును చూడటానికి వచ్చి అనంతలోకాలకు..

- కుమారుడి కళ్ల ముందే తల్లిని కబళించిన లారీ



సరస్వతి (ఫైల్)

ఉప్పల్: కన్న కొడుకును చూడటానికి నగరానికి వచ్చిన ఓ తల్లిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ హృదయ విదారక సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.

పోలీసులు తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా ఇటికలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల సరస్వతి (58) 15 రోజుల క్రితం హబ్సిగూడలో నివాసంఉండే కుమారుడు దిలీప్‌రెడ్డి ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం తిరిగి సొంతూరుకు వెళ్లడానికి కుమారుడు దిలీప్ రెడ్డి బైక్‌పైన రామంతాపూర్ బస్‌స్టాప్‌కు వచ్చింది. కాచిగూడ రైల్వేస్టేషన్ వెళ్లేందుకు సిటీ బస్సు కోసం ఇక్కడ వేచిచూస్తుండగా ఉప్పల్ నుంచి రామంతాపూర్ వైపు వేగంగా వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ లారీ సరస్వతిని ఢీకొంది. దీంతో ఆమె లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే తల్లి రక్తపుమడుగులో ప్రాణాలు వదలడంతో దిలీప్‌రెడ్డి గుండెలవిసేలా రోదించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి యూకే ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: యూకేలోని కార్డిఫ్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ల బృందం బుధవారం ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించారు. ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగే అంతర్జాతీయ సదస్సుకు హాజరైందుకు విచ్చేసిన యూకే ప్రొఫెసర్లు ఓయూ వీసీ రవీందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలను చర్చించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు.



యూకే ప్రొఫెసర్‌కు జ్ఞాపికను అందచేస్తున్న వీసీ

దశాబ్ది ముగింపు వేడుకలు.. భారీ ప్రదర్శనలు

అబిడ్స్: దశాబ్ది ముగింపు వేడుకలకు గోషామహల్ నియోజకవర్గంలో భారీ ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలు చేపడుతామని నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులతో పారా ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గం నలుమూలలా 22వ తేదీ గురువారం భారీ ఎత్తున ప్రదర్శనలు, బైకు ర్యాలీలు నిర్వహించి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ధన్‌రాజ్, పూజవ్యాస్ బిలాల్, పప్పుమాత్రే, శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు

ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న డ్రైవర్లపై కేసులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ముగ్గురు కారు డ్రైవర్లపై ఆర్‌జీఐ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎల్‌బీనగర్‌కు చెందిన నజీర్, శంషాబాద్ కవ్వగూడకు చెందిన ఎస్.జంగయ్య, చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన ఖాజాలు అరైవల్ ప్రాంతంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులను తమ కారులోనే ఎక్కాలని బలవంతం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకండా అరైవల్ ప్రాంతంలోకి ప్రవేశించడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు పెడుతున్నట్లు బుధవారం సాయంత్రం సమాచారం అందడంతో పోలీసులు సదరు డ్రైవర్లపై టౌటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికే తలమానికంగా తెలంగాణ

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

సాక్షి, సిటీబ్యూరో: జీసస్ గురించి స్మరించుకున్న ప్రతిసారి పోరాటం, త్యాగం, సేవ మనసులో కదులుతాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కూడా ఈ మూడు కనిపిస్తాయని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నారాయణగూడ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం సాధించడం కోసం కేసీఆర్ అహోరాత్రులు కృషి చేశారని, పదవులను, విలువైన సమయాన్ని త్యాగం చేశారన్నారు. తెలంగాణ భారతదేశానికి తలమానికంగా మారిందంటే అది కేసీఆర్ అందించిన సేవల వల్లనే అన్నారు. దేశంలో అత్యధిక వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. తెలంగాణలో క్రైస్తవుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రూ.133 కోట్ల రూపాలయతో ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకల్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు.

జులైలో వీరశైవ జంగమ సమాజం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న మఠం శివప్రసాద్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జంగమ సమాజాల సభ్యుల ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని రాష్ట్ర జంగమార్చక సమాఖ్య అధ్యక్షులు ఆకవరం మఠం శివప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రస్తుత అడహక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్, ప్రతి జిల్లా నుంచి ఒక్కొక్క కన్వీనర్‌ను నియమిస్తూ తీర్మానించారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా శివప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు మఠం మృత్యుంజయం, సిద్దిపేట జిల్లాకు నాగరాజుతో పాటు అన్ని జిల్లాలకు బాధ్యులను నియమించి జూలై మొదటి వారంలో రాష్ట్ర ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రతినిధులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిగిన మఠం శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణాచారి మఠం సాంబశివ, సంయుక్త కార్యదర్శి గొంగళ్ళ రవికుమార్, పరకాల భద్రయ్య, పురాణె దిలీప్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యపై ఉపా చట్టం కేసును ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య, సుభద్ర తదితరులు

సుల్తాన్‌బజార్: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్యపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సుభద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగస్టు 18న ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్యతో పాటు పలువురిపైన ఉపా చట్టం కేసు నమోదు చేశారని తెలిపారు. తప్పుడు పద్ధతిలో ఈ కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ప్రభుత్వ కుట్ర దాగి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఆమెపై కేసును ఎత్తివేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

యూనిఫాం సివిల్ కోడ్ అమలు ఆలోచనలు విరమించుకోవాలి

ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ



సాక్షి, సిటీబ్యూరో: విభిన్న మతాలు, కులాలు నివసిస్తున్న భారత్‌లాంటి దేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు సాధ్యం కాదని, యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు పరచే ఆలోచనలు చేయడం మన దేశానికి మంచిది కాదని పర్సనల్ లా బోర్డు అభిప్రాయపడుతోందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ అన్నారు. ఇటీవల బోర్డు అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా ఖాలిద్ నగర పర్యటనలో భాగంగా నారాయణగూడలోని తామిరే మిల్లత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒకవేళ పార్లమెంటులో యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లు నెగ్గి చట్టం చేస్తే మనదేశ విశిష్టత అయిన సామరస్యం, సద్భావనకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచిస్తున్నామన్నారు. ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టాలను సక్రమంగా అమలయ్యేలా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ చట్టం సక్రమంగా అమలయ్యేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. ప్రభుత్వం వేర్పాటు వాదులకు లొంగిపోకుండా, అందరి ప్రయోజనాలను కాపాడాలని ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ సూచించారు.







కలకలం

ఎల్‌బీనగర్ సమీపంలోని సాగర్ రింగురోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న బైరామల్‌గూడ ఫ్లై ఓవర్ ర్యాంప్ కూలిన ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపింది. ఈ ఘటనలో 9 మంది గాయపడగా.. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన అనంతరం సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి తగిన చర్యలు చేపట్టాయి. ఎన్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమో తెలుసుకునేందుకు డాగ్‌స్క్వాడ్ ద్వారా పరిశీలించాయి. - ఎల్‌బీనగర్



యోగాతో ఆరోగ్యం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



వివేకానందనగర్ కాలనీలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జరిగిన యోగా డేలో సభ్యులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, పార్కుల్లో యోగాసనాలు వేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకాపూడి గాంధీ, కార్పొరేటర్లు, యోగా సెంటర్ నిర్వాహకులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగా ద్వారా దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రోజు యోగా చేయాలన్నారు. ఉరుకుల, పరుగుల జీవితంలో యోగా చేయడం ఎంతో ఉత్తమమని పేర్కొన్నారు.

– కూకట్‌పల్లి



కేపీహెచ్‌బీకాలనీలోని గీతాంజలి స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



కేపీహెచ్‌బీకాలనీ 3ఫేజ్‌లోని మహిళ పార్కులో యోగా చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్‌పల్లి పీఎంఎం స్కూల్ గ్రౌండ్స్‌లో యోగా చేస్తున్న కాంతారావు, జయప్రకాశ్ నారాయణ



వివేకానందనగర్ డివిజన్‌లోని సీనియర్ సిటిజన్ పార్కులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



కూకట్‌పల్లిలో యోగా మాస్టర్ అంజన్‌కుమార్‌ను సన్మానిస్తున్న శిష్యులు



కూకట్‌పల్లి ట్వింకిల్ స్టార్స్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లికి చెందిన సత్యం శ్రీరంగం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి అంకిత భావంతో నిబద్ధతతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ, రాష్ట్ర ప్రజలకు సుస్థిర పాలన అందించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పాత పింఛన్ విధానం అమలు చేసే వారికే కార్మికుల మద్దతు

అడ్డగుట్ట: పాత పింఛన్ విధానం అమలు చేసే వారికే రైల్వే కార్మికుల మద్దతు ఉంటుందని మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్ రావు అన్నారు. నూతన పింఛన్ విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో సంచాలన్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ.. కార్మికులకు పింఛన్ లేకపోవడంతో పదవీ విరమణ తర్వాత జీవనం అగమ్యగోచరంగా మారుతుందన్నారు. దశలవారీగా చేసిన ప్రజల ఉద్యమాల కు ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పింఛన్ విధానం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం అయ్యాయని, అదే మాదిరి రైల్వే కార్మికులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ధర్నాలో ఉదయ్ భాస్కర్, వరప్రసాద్, ఖాజాబాబా, కృష్ణ, పద్మావతి, చిలుక స్వామి, స్వరూప, యుగంధర్, నర్సింహరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

కలప దుకాణం సీజ్



జీడిమెట్ల: బిల్లులు లేకుండా కలప కలిగి ఉన్న ఓ కలప దుకాణాన్ని ఫారెస్టు అధికారులు సీజ్ చేశారు. సుభాష్‌నగర్‌లోని ఓ కర్ర దుకాణంలో బుధవారం దూలపల్లి ఫారెస్టు రేంజర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోదా చేశారు. అనంతరం దుకాణంలో రసీదులు లేకుండా కలప ఉండటాన్ని అధికారులు గుర్తించారు. అనంతరం దుకాణాన్ని సీజ్ చేయగా దుకాణ యజమాని తమ వద్ద బిల్లులు ఉన్నాయని తెలిపారు. వాటిని చూపించిన తర్వాతే దుకాణం తెరవడానికి అనుమతులు ఇస్తామని ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ కృష్ణమ్మ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం



మూసాపేట: మూసాపేటలోని రెయిన్ విస్టాస్ రాక్ గార్డెన్స్‌లో ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సంగీత కార్యక్రమం నిర్వహించారు. రెయిన్ బో విస్టాస్ రాక్ గార్డెన్ సంఘం అధ్యక్షులు బండి మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖ గాయకులు పి. గీతాంజలి, వై. లక్ష్మిరమా, ఆర్‌కే ప్రభాకర్ భక్తి గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు. – ఈ సందర్భంగా బండి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల జీవితంలో ఉన్న అపార్ట్‌మెంట్లవాసులు సాయంత్రపు వేళ పాటలు వింటూ సేదతీరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ సభ్యులు ఇంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదం

పంజగుట్ట: యువత ఉద్యోగాలు లేక, రైతుల పంటలు అకాలవర్షాలతో నష్టపోతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉందని విశ్వ భారత్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు ఎస్.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లలో ఏం సాధించారని సంబురాలు చేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎం.రవి ప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగాన్ని సమగ్రంగా నివారిస్తామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పిస్తామన్నారు.

అమరుల సంస్మరణ సభలను నిర్వహించండి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా గురువారం అమరుల సంస్మరణ సభలను ఘనంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 61గ్రామాలు, 13 పురపాలక సంఘాల్లో గురువారం ఉదయం 11గంటలకు సంస్మరణ సభలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటించాలని కలెక్టర్ సూచించారు. అమరుల సంస్కరణ తీర్మానం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత ఫార్మాట్లో అమరుల సంస్మరణ తీర్మానాలు జాగ్రత్తగా చేయాలని అన్నారు. విద్యాలయాలు, ప్రార్థనా సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

డిప్యూటీ డీఈఎంఓ వేణుగోపాల్‌రెడ్డి మృతి తీరనిలోటు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్టెన్షన్ అండ్ మీడియా అధికారి(డీఈఎంఓ) వేణుగోపాల్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆయన లేనిలోటు ఎన్నటికీ తీర్చలేనిదని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఈస్ట్ కోస్ట్ రోడ్ నుంచి పాండిచ్చేరి మార్గంలో కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ఆయన మృతి చెందగా భార్య, ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారన్నారు. మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఈఎంఓ వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌తో పాటు ఇతర సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శివ శక్తినగర్‌లో బుధవారం మాజీ కార్పొరేటర్ పి.బాబు రావు డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు తాము అందుబాటులో ఉంటామన్నారు. డివిజన్‌లోని ప్రతి సమస్యను తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. వర్షకాలంలో డ్రైనేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శారద, నర్సింగ్, జానకీ తదితరులు పాల్గొన్నారు.



శివ శక్తినగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ పి.బాబురావు

ఎస్పీఆర్‌హిల్స్‌లో 58 జీవో దరఖాస్తుల పరిశీలన

రహమత్‌నగర్: రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం బుధవారం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో బుధవారం పర్యటించారు. 58 జీవో కింద చేసుకున్న దరఖాస్తులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి (డిప్యూటీ కలెక్టర్) ఆదిలక్ష్మీ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం ఐదు బృందాలు దరఖాస్తులను పరిశీలిస్తున్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి నివాసాల వద్దకు తామే స్వయంగా వెళ్లి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఖైరతాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ భిక్షం, సీనియర్ అసిస్టెంట్ సునీల్, స్పెషల్ ఆర్‌ఐ కిరణ్‌రాజ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల సంస్కృతులకు గౌరవం

సనత్‌నగర్: అన్ని మతాల ఆచారాలు, సంస్కృతులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో లోక కల్యాణార్థం నిర్వహించిన శాంతియాగం, చండీహోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానంగా నగరంలో వివిధ భాషలు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు బోనాలు, గణేష్ నవరాత్రులు, రంజాన్, క్రిస్మస్ తదితర పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

డా. సుబ్బారావుకు అత్యుత్తమ అవార్డు

లాలాపేట: ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యునికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ డాక్టర్ సుబ్బారావు గుజరాత్ సైన్స్ అకాడమీ బుటీ ఫౌండేషన్-జీఎస్ఏ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డు విజ్ఞాన శాస్త్రాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో వారు చేసిన కృషికి గాను ఎంపికయ్యారు. సైన్స్ అండ్ టెక్నాలజీని భవిష్యత్‌లో ప్రజలకు అవగాహన కల్పించడం, సైన్స్‌పట్ల ఆసక్తిని రేకెత్తించడం దీని ముఖ్య ఉద్దేశం. గుజరాత్ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుటీ ఫౌండేషన్ ద్వారా ప్లాస్మా ఫిజిక్స్‌లో అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ప్రొఫెసర్ బిమ్లా బుటీ పేరుతో ఈ అవార్డును ఏర్పాటు చేశారు. సైన్స్ కమ్యూనికేషన్‌లో ప్రముఖ ఉపన్యాసాలు, ప్రచురణలు, పుస్తకాలు, వ్యాసాలు, వీడియో ప్రదర్శనల రూపంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ అవార్డు ప్రదానం చేశారు. డా.సుబ్బారావు ఈ అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. దీనిపై 80 పబ్లికేషన్స్, 10 పుస్తకాలను ప్రచురించారు.

మందుబాబుల హల్‌చల్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా మందుబాబులు రెచ్చిపోయారు.అర్ధరాత్రి వరకు రోడ్లపై సంచరిస్తూ మహిళా భక్తులను భయాందోళనకు గురి చేశారు. సౌండ్‌సిస్టమ్ వద్ద నృత్యాలు చేస్తున్న సమయంలో ఇరు వర్గాలు గొడవపడి బీరు బాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడులకు తెగపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి యువకుల తలలు పగిలిపోయాయి.

విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కోటి 16 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో ఒక పక్క సంక్షేమం, మరో పక్క ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయల కల్పించేందుకు నిత్యం పని చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ మహానగరానికి అంతర్జాతీయగా పెట్టుబడులు రావడానికి కారణం ఇక్కడ జరుగుతున్న అభివృద్ధేనని అన్నారు.

బడే మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు..

హస్మత్‌పేట బడే మజీద్‌లో ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం నాయకుల కోరిక మేరకు బడే మజీద్‌ను సందర్శించిన ఆయన వారితో కలసి ప్రార్థనలు చేశారు. మన దేశం, రాష్ట్రం సర్వమతాలకు నిలయమన్నారు. ఇంకా ఏమైన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

14న ఢిల్లీలో బీసీల మహాధర్నా



మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్నగౌడ్

పంజగుట్ట: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 14న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నా పోస్టర్‌ను రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు గాదగోని మహేష్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ జనాభాలో సగం శాతం ఉన్న బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాల్లానే చూస్తున్నారని 542 పార్లమెంట్ స్థానాలు ఉంటే 270 బీసీ పార్లమెంట్ సభ్యులు ఉండాల్సిన చోట కేవలం 80 మంది మాత్రమే ఉండటం అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 119 ఎమ్మెల్యే స్థానాలు ఉంటే 60 మంది బీసీ శాసనసభ్యులు ఉండాల్సిన చోట కేవలం 22 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు 93వ రాజ్యాంగ సవరణ చేసి పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని కాని బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు లేక ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా దక్కాలని తెలిపారు. పై డిమాండ్ల సాధనకు జూలై 14వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా, 15వ తేదీన జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సూరగాని రాంబాబు, నర్సింహా, వెంకటేశ్వర్లు యాదవ్, లక్ష్మణ్ యాదవ్, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో జయశంకర్ సార్ పోరాట పటిమ మరువలేనిది



జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జయశంకర్‌నగర్ నాయకులు



జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రొ. జయశంకర్ సార్‌ను అందరం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని జయశంకర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కనకరాజు యాదవ్, ఫీరోజ్‌ఖాన్, ఐలేష్, బెల్లం ఐలయ్య అన్నారు. బుధవారం జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాట పటిమ, చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సమ్మయ్య, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఫోరం మాల్ చౌరస్తాలో...

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌లోని ఫోరం మాల్ చౌరస్తాలో బుధవారం ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కోసం ప్రొ. జయశంకర్ సార్ ఎంతో పోరాడని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు తెలంగాణకు ఎప్పటికీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతూరి గోపి, ప్రసాద్, కె. వెంకట్‌రెడ్డి, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5 నిర్మాణాలకు ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత 'ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డు'లను లండన్‌లో అందుకున్న ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆ అవార్డులను కేసీఆర్‌కు అందజేశారు.

అనస్తీషియాలజిస్ట్ విభావరి ఘనత

ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియా గౌరవ కార్యదర్శిగా ఎన్నిక



బంజారాహిల్స్ (హైదరాబాద్): బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియాలజిస్ట్, ఇంటెన్సివ్ వైద్య నిపుణురాలు డాక్టర్ విభావరి నాయక్ ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియాకు గౌరవ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదటిసారి భారతీయ వైద్యురాలు ఈ పదవికి ఎన్నికయ్యారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఆమెను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు ఆమె ఈ పదవికి ప్రాతినిధ్యం వహిస్తారు. 2010 నుంచి బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే ప్రతి ఒక్కరితో పనిచేసే గొప్ప అవకాశాన్ని పొందానని ఆనందం వ్యక్తం చేశారు.

పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ (టీసీటీజీవోఏ) రాష్ట్ర అధ్యక్షునిగా వి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా మురళీమోహన్, సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దేవేందర్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్.భాస్కర్, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.రామలక్ష్మయ్య, కోశాధికారిగా ఎస్.గిరిధర్, జాయింట్ సెక్రటరీలుగా బి.రాజు, డి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కందిమళ్ల సుధీర్‌రెడ్డి, బీమ్లా, నరేశ్‌రెడ్డి, విజయ్, మురళి ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు పదవుల్లో కొనసాగనున్నారు.

హస్తినలో బంగారు బోనం

ఘనంగా లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాలు ● బంగారు బోనాలు సమర్పించిన బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ పాతబస్తీ లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుధవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. అలాగే బీఆర్ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేత మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ, పట్టణ, వ్యవసాయం, ఐటీ.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకపోయినా చెరువుల పునరుద్ధరణ చేశారని, ప్రాజెక్టులను నిర్మించారని



బంగారు బోనం తీసుకెళ్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఆదరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణ పాలనపై పక్క రాష్ట్రాల్లో చర్చ జరుగుతోందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు.

బీఆర్ఎస్ ఎంపీలను అడ్డుకున్న శేజల్


ఇదిలా ఉండగా బోనాల కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు నిరసన సెగ తగిలింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భవన్ వేదికగా గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న శేజల్, ఎంపీలను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఎంపీల వాహనానికి అడ్డుగా నిలిచి శేజల్, ఆరిజన్ డైరీ నిర్వాహకుడు ఆదినారాయణ నిరసన వ్యక్తం చేయగా.. ఎంపీ సురేశ్‌రెడ్డి కారు దిగివచ్చి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఏజీ బీఎస్ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తులు

ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావుకు 'బూటి' అవార్డు

సాక్షి, హైదరాబాద్: శాస్త్ర సంబంధిత సమాచారాన్ని సామాన్యుల చెంతకు చేర్చేందుకు విశేష కృషి చేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త, న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు.. ప్రతిష్టాత్మక బూటి ఫౌండేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్లాస్మా ఫిజిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ బిమలా బూటి ఏర్పాటు చేసిన బూటి ఫౌండేషన్ అవార్డును గుజరాత్ సైన్స్ అకాడమీ అందజేస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు భవిష్యత్తుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేసిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.



గోవా రాజ్‌భవన్‌లో యోగా దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేయండి

మళ్లీ నిర్వహణకు హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడం అక్రమాలకు తావిచ్చేలా ఉందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వాన్ని, టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు బి.ప్రశాంత్, బండి ప్రశాంత్, జి.హరికృష్ణ పిటిషన్ వేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రతివాదిగా పేర్కొన్నారు. హాల్ టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని.. ఇది అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం ఇచ్చేలా ఉందని స్పష్టం చేశారు. ఒకసారి లీకై మళ్లీ నిర్వహిస్తున్న గ్రూప్–1 విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవలసిన కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 13న టీఎస్‌పీఎస్సీకి వినతి పత్రం కూడా నిచ్చినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. న్యాయవాది బి.నర్సింగ్ ఫైల్ చేసిన ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఘనంగా ప్రారంభమైన సాహితీ సభలు
- ఆచార్య ఎన్.గోపికి జయశంకర్ పురస్కారం ప్రదానం



ఆచార్య ఎన్.గోపీకి స్వర్ణకంకణం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ సాహిత్య వికాసాన్ని, సాహితీ పుత్రులను నిరంతరం స్మరించుకోవడంతో పాటు తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన తెలంగాణ సాహిత్య సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎన్.గోపికి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తొలి విశిష్ట సాహితీ పురస్కారం –2023ను కవిత ప్రదానం చేసి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకోవడం ఎంత ముఖ్యమో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్న నినాదంతో ఉద్యమం చేశామన్నారు. తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ వారు మరింత పరిపుష్టం చేయాలన్న ఉద్దేశంతో భారత జాగృతి ఆధ్వర్యంలో సాహితీ సభలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై ఏటా తెలంగాణ సాహిత్య సభలు జరుపుతామని ప్రకటించారు. రెండురోజుల పాటు జరగనున్న సాహిత్య సభల్లో పలు అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ చర్చలన్నింటిని గ్రంథస్తం చేస్తామని చెప్పారు. కాగా, సాహితీ ప్రేమికులుగా హిందీభాషలో ఉన్న సాహిత్యాన్ని ఆరాధిస్తామని, కానీ ఇదే మాట్లాడాలని రూల్స్ పెడితే మాత్రం తప్పకుండా రూల్స్ బ్రేక్ చేస్తామని పేర్కొన్నారు. దేశంలో తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలో కూడా వేతనాలు చెల్లిస్తూ కళాకారులను గౌరవించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.గోపికి విశిష్ట సాహిత్య పురస్కారం కింద స్వర్ణ కంకణంతో పాటు రూ.1,01,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిని సిధ్దారెడ్డి, డాక్టర్ గోరటి వెంకన్న, డాక్టర్ తిరునగరి దేవకీ దేవి, డాక్టర్ గోగు శ్యామల, డాక్టర్ నాళేశ్వరం శంకర్, జాగృతి కార్యకర్తలతో పాటు పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు

కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్
- కన్హా శాంతివనంలో దివ్యాంగుల సామూహిక యోగా
- మూడు రికార్డులు సొంతం

నందిగామ: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 రాష్ట్రాలకు చెందిన 3వేల మంది దివ్యాంగులు సామూహిక యోగా చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీరేంద్ర కుమార్ యోగాసనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సామూహికంగా భారీ ఎత్తున పాల్గొని యోగా చేసినందుకుగాను అంతర్జాతీయ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు. అనంతరం దృష్టి, వినికిడి, అంగవైకల్యం కలిగిన సుమారు 200 మందికి సహాయ ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర వార్తలు

తల్లి జన్మనిస్తే.. యోగా పునర్జన్మనిస్తుంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

ఘట్‌కేసర్: తల్లి జన్మనిస్తే యోగా పునర్జన్మనిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అన్నారు. పట్టణంలోని గురుకుల్ మైదానంలో కొండాపూర్ యోగా చైతన్య సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 5 వేల ఏళ్ల క్రితం భారత దేశంలో పుట్టిన యోగా ప్రస్తుతం ప్రపంచంలో 100కు పైగా దేశాలు ఆచరిస్తున్నాయని, యోగాను యూఎన్ఓ ద్వారా ఆమోదం లభించేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కిందన్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమన్నారు. నేను బాగుంటే చాలు అని అనుకోకుండా అందరు బాగుండాలని కోరుకొని వసుధైక కుటుంబంలా భావించాలన్నారు. ప్రధాని మోదీ సమాజం గురించి ఆలోచిస్తారని, అందుకే నేడు ఆయనను ప్రపంచమంతా బాస్ అని అంటోందని తెలిపారు. కరోనాతో అతలకుతలమైన సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించి కోట్లాది మంది ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. యోగా సాధన స్ఫూర్తిదాయకంగా ఉండాలని, భారతావనికి విశ్వగురువుగా గుర్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొండాపూర్ యోగా చైతన్య సేవా సంస్థ అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి హనుమాన్, అవుషాపూర్ వీబీఐటీ కళాశాల కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభారాణి, స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో యోగాసనాలు వేస్తున్న బండి సంజయ్

కంటోన్మెంట్ పరిధిలో యోగా డే..

కంటోన్మెంట్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్‌లో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. తెలంగాణ– ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని 1ఈఎంఈ సెంటర్ మిల్కాసింగ్ స్టేడియం ఆవరణలో మిలటరీ అధికారులు వారి కుటుంబ సభ్యులతో పాటు పాల్గొన్నారు. బైసన్ డివిజన్, ఎన్‌సీసీ క్యాడెట్‌లు, ఇండియర్ రిజర్వ్ బెటాలిన్‌లకు చెందిన 1870 మంది సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కంటోన్మెంట్ బోర్డు అధికారుల ఆధ్వర్యంలో బొల్లారం పబ్లిక్ పార్కు ఆవరణలో యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణ సహా సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.





కంటోన్మెంట్‌లోని మిల్కాసింగ్ స్టేడియంలో యోగా డే వేడుకల్లో పాల్గొన్న మిలటరీ అధికారులు

గోవుల అక్రమ రవాణాపై దృష్టిసారించండి

సీపీ సీవీ ఆనంద్

హిమాయత్‌నగర్: హైదరాబాద్ కేంద్రంగా గోవుల అక్రమణ రవాణాపై దృష్టి సారించాలంటూ సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఆ రకమైన రవాణాకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. ఈ నెల 29న బక్రీద్ నేపథ్యంలో బుధవారం మూడు కమిషనరేట్‌ల పరిధిలోని పోలీసు, జీహెచ్ఎంసీ, రవాణశాఖ, యానిమల్ హస్బెండరీ శాఖలతో అడిషనల్ సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, ఏ.ఆర్.శ్రీనివాస్‌లతో కలసి సీవీ ఆనంద్ బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ టవర్స్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా..నగరం నుంచి బయటకు, బయట నుంచి నగరంలోకి అక్రమంగా గోవుల రవాణ జరిగే అవకాశం ఉందని, దీన్ని నివారించాలన్నారు. గోవుల అక్రమ రవాణా ఎంత పెద్ద నేరమో పశుసంవర్థక శాఖ అధికారులు రవాణాదారులకు వివరించాలన్నారు. నగరంలోని ప్రతి చెక్ పోస్టు వద్ద పోలీసు శాఖతో పాటు రవాణ, జీహెచ్ఎంసీ, యానిమల్ హస్బండరీ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. అదేవిధంగా అక్రమ రవాణాలో సీజ్ చేసిన ఆవుల కోసం షెల్టర్లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. ఆ షెల్టర్లలో ఆవులకు మంచి నీళ్ల, ఆహారం, ఇతర సౌకర్యాలు అన్నీ సమయానికి అందేలా చూడాలన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూనే, అక్రమ రవాణ వ్యవహారంపై సోషల్ మీడియాలో వచ్చే కథనాలను సైతం పరిశీలించాలన్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సీపీ సీవీ ఆనంద్ సూచించారు. అడిషినల్ కమిషనర్ ప్రియాంక, సైబరాబాద్ జాయింట్ సీపీ ఎం.సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సీపీ సీవీ ఆనంద్

అత్యాధునిక టెక్నాలజీ.. అత్యల్ప దుష్ప్రభావాలు!

- కేన్సర్ వ్యాధి నివారణకు సరికొత్త రేడియేషన్ చికిత్స
- యశోద ఆస్పత్రిలో అందుబాటులోకి...



ఎంఆర్ లినాక్ రేడియేషన్ టెక్నాలజీ బ్రోచర్‌ను విడుదల చేసిన యశోద హాస్పిటల్ ఎండీ జి.ఎస్ రావు, డాక్టర్ సీఎస్ ప్రమేష్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో, మాదాపూర్: ఒకప్పుడు కేన్సర్ అంటే మరణం. అదే ఇప్పుడు చికిత్సకు లొంగే అనేక వ్యాధుల్లో అదీ ఒకటి. అలాగే చికిత్సల్లో భాగంగా ఉపయోగించే పద్ధతుల ద్వారా కలిగే దుష్ప్రభావాలనూ ఒక్కొక్కటిగా తగ్గించుకుంటూ ముందడుగేస్తోంది ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానం. అందులో భాగంగానే కేన్సర్ చికిత్సలో సరికొత్త రేడియేషన్ టెక్నాలజీ నగరంలోని యశోద ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చింది. కేన్సర్ వ్యాధి ఎంత బాధపెడుతుందో దానికి అందించే చికిత్స అంత భయపెడుతుంది. ముఖ్యంగా రేడియేషన్ థెరపీల వల్ల హెయిర్ లాస్ దగ్గర నుంచి అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ రోగుల్ని ఇబ్బంది పెడతాయి. ప్రాణాలు దక్కించుకున్నా దీర్ఘకాలం వెంటాడే సైడ్ ఎఫెక్ట్స్ వేధిస్తాయి. ఈ నేపథ్యంలో ఆధునిక వైద్య పరిశోధకులు వీటిని తగ్గించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. ఒకటొకటిగా వెలుగు చూస్తున్న ఆ కృషి ఫలితాల్లో ఒకటి 'ఎలెక్టా యూనిటీ ఎం.ఆర్–లినాక్'' రేడియేషన్ టెక్నాలజీ. భారతదేశంలోనే తొలిగా ఈ టెక్నాలజీని నగరానికి చెందిన యశోదా ఆసుపత్రి అందుబాటులోకి తీసుకువచ్చింది.

ప్రయోజనాలేమిటంటే...

- కేన్సర్ చికిత్స సమయంలో క్రిస్టల్–క్లియర్ ఇమేజింగ్ పొందడానికి ఈ అత్యాధునిక సాంకేతికత సహకరిస్తుంది. అలాగే రియల్ టైమ్ అడాప్టివ్ రేడియోథెరపీ రియల్ టైమ్ ట్యూమర్ మానిటరింగ్ సామర్థ్యాల స్పష్టంగా కేన్సర్ కేంద్రాన్ని కి సంబంధించిన ఉన్నతమైన హై–డెఫినిషన్ ఇమేజ్ క్వాలిటీని అందిస్తుంది. కష్టతరమైన వాటితో సహా అన్ని రకాల కేన్సర్ చికిత్సలపై ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది. చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణజాలాలకు హాని తగ్గిస్తూ కణితులను ఖచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుంటుంది.

ఖచ్చితమైన రేడియేషన్ థెరపీ...

మరో రెండేళ్లలో కేన్సర్ వ్యాధి 12.8 శాతం వరకు పెరగొచ్చని, తద్వారా ప్రతి 9 మంది భారతీయులలో ఒకరికి తప్పక కేన్సర్ వచ్చే అవకాశం ఉందని అంచనా. ఖచ్చితమైన లక్ష్యాన్ని నిర్ధారించడానికి, ఆరోగ్యకరమైన కణజాలాలకు నష్టాన్ని తగ్గించడానికి ఎం.ఆర్.లినాక్ సాంకేతికత కేన్సర్ చికిత్స ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ తరహా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా మాత్రమే వీటికి ఖచ్చితమైన, దుష్ప్రభావాలు తగ్గిస్తూ చికిత్స అందించగలం.

–డాక్టర్. జి.ఎస్. రావు, మేనేజింగ్ డైరెక్టర్, యశోద హాస్పిటల్స్ గ్రూప్

పర్యావరణ అనుకూల ఉత్పత్తులకే సై...

సాక్షి, సిటీబ్యూరో: కాలుష్యం, అవాంఛనీయ వాతావరణ మార్పుల నేపథ్యంలో హెచ్‌పి ఇండియా చేసిన ఒక అంతర్జాతీయ సర్వే ప్రకారం పర్యావరణ అనుకూల ఉత్పత్తులకే భారతీయ తల్లిదండ్రులు ఓటేస్తున్నారు. తమ పిల్లలకు అవసరమైన కంప్యూటర్ హార్డ్‌వేర్ ఉత్పత్తులకు సంబంధించిన కొనుగోళ్లలో ఉత్పత్తుల నాణ్యత, పర్యావరణ హిత ఉత్పత్తుల విషయంలో అదనపు వ్యయానికి 80శాతం మంది తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారు. ఈ రకమైన ఆలోచనా విధానంలో మార్పుకు వాతావరణ సంక్షోభం ఓ కారణంగా ఈ అధ్యయనం కనుగొంది. ముఖ్యంగా 18శాతం తల్లులు తమ పిల్లలపై పడే వాతావరణ ప్రభావం గురించి ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా కంపెనీలు అనుసరిస్తున్న పర్యావరణ హిత పద్ధతులు కూడా తమ కెరీర్ ఎంపికల్లో ప్రాధాన్యత చూపుతాయని 61శాతం తల్లిదండ్రులు చెప్పారు.

నిమ్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



లక్డీకాపూల్: తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం నిమ్స్‌లో నిమ్స్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ సాధన కోసం జయశంకర్ సార్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కనకతార, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ప్రతినిదులు శిరందాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోల్కొండ జగదాంబ అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనాల పూజా కార్యక్రమాల్లో భాగంగా మొదటి బంగారు బోనాన్ని భక్తులు గురువారం గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించనున్నారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ ఆలె భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో బంగారు బోనంతో పాటు ఒడి బియ్యం, పట్టు వస్త్రాలను అందజేయనున్నారు. గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి గోల్కొండ జగదాంబ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

గోల్కొండ కోట రూట్లో ట్రాఫిక్ మళ్లింపులు

గోల్కొండ: నేటి నుంచి గోల్కొండ కోట బోనాలు ప్రారంభంకానున్న దృష్ట్యా గోల్కొండకు వెళ్లే వారికి ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు కోటకు వచ్చే అవకాశం ఉందని, వాహన దారులు తమ సూచనలను పాటించాలని టోలిచౌకి నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. రాందేవ్‌గూడ మీదుగా గోల్కొండ కోటకు వచ్చే వారు ఆషుర్‌ఖానా మిలటరీ సెంట్రల్ పాయింట్ వద్ద ద్విచక్ర వాహనాలు, ఆషుర్‌ఖానా పార్కింగ్ ప్లేస్‌లో కార్లను పార్కింగ్ చేయాలి. అదే విధంగా లంగర్‌హౌస్ నుంచి ఫతేదర్వాజ గుండా కోటకు వచ్చే వారు టూవీలర్లను, ఆటోలను హుడా పార్కు వద్ద, కార్లు, ఇతర వాహనాల వారు ఫతేదర్వాజ నుంచి ఒవైసీ ప్లేగ్రౌండ్, ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద పార్కింగ్ చేయాలి. షేక్‌పేట్, సెవన్ టూంబ్స్ మార్గాల నుంచి కోటకు వచ్చే వారు తమ ద్విచక్ర వాహనాలు, ఆటోలను ప్రియదర్శిని స్కూల్, ఏరియా ఆస్పత్రి, గోల్కొండ కోట బస్టాప్ వద్ద పార్క్ చేయాలి. కార్లలో వచ్చే వారు బంజార దర్వాజ నుంచి గోల్కొండ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఒవైసీ గ్రౌండ్‌లో తమ వాహనాలను పార్క్ చేయాలి. వాహన దారులు తమ సూచనలను పాటించి ట్రాఫిక్ జామ్ కాకుండా సహకరించాలని , అత్యవసర సమయాల్లో 9010203626 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.